మొజాయిక్ గత వారం రోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-10-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 262 పేజీలు: 10+4 వెల: 6.50


## ఆసియాన్ సదస్సుకు వెళ్లని ప్రధాని

## బీహార్‌లో విపక్ష కూటమి సిఎం అభ్యర్థిగా తేజస్వి

5లో



## నవంబరు 1 నుంచి డిడిఒ కార్యాలయాలు

### పంచాయతీ పాలనలో పలు సంస్కరణలు: డిసిఎం పవన్

**విజయవాడ, అక్టోబరు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పంచాయ తీరాజ్ వ్యవస్థలో ప్రభుత్వం తీసుకుని వచ్చిన నాలుగు అంచెల వ్యవస్థ మంచి ఫలితాలను ఇచ్చే దిశలో ఉండాలన్నారు. నవంబరు 1నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధిఅధికారులు (డిడిఒ) కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఉన్నతా ధికారులతో ఉపముఖ్యమంత్రి సమావేశమయ్యారు. క్లస్టర్ విధానంరద్దుచేసి 13,351 గ్రామ పంచాయ తీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులు బాటు తీసుకువచ్చామని డి.సిఎంచెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు >>2

## పెట్రో కెమికల్ రంగంలో
# పెట్టుబడులు పెట్టండి

### అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

### దక్షిణాసియాకు చేరువలో వ్యూహాత్మక ప్రాంతంగా ఎపి



గురువారం అబుదాబిలో ఎడిఎస్‌ఒసి గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్... ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులకు ఎపిలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు. యూఎఇ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఎడిజిఎ స్క్వేర్‌లో ఎడిఎన్‌ఒసి గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్‌జి, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చిం చారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రోకెమికల్, ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సిఎం అన్నారు. ఎడిఎన్‌ఒసి- ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకే తిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దశను దాటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా వేగంగా సాగుతోందని తెలిపారు. రాష్ట్ర >>2

## ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు కూడా ముందంజ 2లో



కృష్ణాజిల్లాలో గురువారం కురిసిన భారీ వర్షాలకు నీటమునిగిన పంట పొలాలు

## వర్షాలపై అప్రమత్తం

### దుబాయ్ నుంచి పరిస్థితిని సమీక్షించిన సిఎం చంద్రబాబు

### నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ. 2 కోట్ల అత్యవసర నిధులు మంజూరు, మిగిలిన జిల్లాలకు రూ. కోటి సాయం

**విజయవాడ అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి సిఎం చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షప్రభావిత జిల్లాలు నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య తదితర జిల్లాల పరిస్థితిపై మంత్రులు, సీఎస్, కలెక్టర్లు, ఆర్టిజీఎస్అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ >>2

## పలు జిల్లాలు అతలాకుతలం

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో సుస్పష్ట అల్పపీడనం కొనసాగుతోంది. 12 గంటల్లో క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశముంది. అండమాన్ సముద్ర తీరంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. 24 గంటల్లో రాష్ట్రంలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాలతో పాటు యానాంలో ఆకస్మిక వరదలు వచ్చే >>2



## రాష్ట్రమంతా నకిలీమద్యం దందాయే

### బాలకృష్ణ మద్యంతాగి అసెంబ్లీకి వచ్చారు: మాజీ సిఎం జగన్

**విజయవాడ, అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో నకిలీ మద్యం దందా వ్యవస్థీకృతమైందని మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. తాడేపల్లిలోని జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ మద్యం కేసులో నిందితుడుగా ఉన్న టిడిపి నాయకుడు జయచంద్రారెడ్డిని ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని సీఎం చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. పరవాడ, పాలకొల్లు, నెల్లూరు వంటి ప్రాంతాలలో నకిలీ మద్యం తయారీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ చిన్నపాటి పరిశ్రమగా మారిందని ధ్వజమెత్తారు. ఇలా వ్యవస్థీ కృతంగా వ్యాపారం చేయడం చంద్రబాబుకే సాధ్యమని ఆరోపించారు. ఈ విషయాన్ని తప్పుదోవ పట్టించడానికి >>2



## సుప్రీం సిజెగా జస్టిస్ సూర్యకాంత్!

### నవంబరు 23న జస్టిస్ గవాయ్ రిటైర్మెంట్, నియామక ప్రక్రియ ప్రారంభించిన కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ సూర్య కాంత్ నియమితులు కానున్నారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎంపిక ప్రక్రియను ప్రారంభించింది. తదుపరి చీఫ్ జస్టిస్ పేరును సిఫారసు చేయమని కోరుతూ సిజెఐ జస్టిస్ గవాయ్‌కు కేంద్రం లేఖ రాసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సంప్రదాయకంగా, ప్రస్తుత సిజెఐ 65 యేళ్ల నిండినప్పుడు పదవీ విరమణ చేయడానికి దాదాపు నెల ముందు తదుపరి సిజెఐ ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తారు. అందులో భాగంగానే తాజాగా సిజెఐ జస్టిస్ గవాయ్‌కు కేంద్ర న్యాయ >>2






గురువారం అబుదాబిలో లులు గ్రూపు ప్రతినిధులతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు కూడా ముందంజ

## అబుదాబి పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఏపి సిఎం చంద్రబాబునాయుడు కోరారు. యూఏఇలోని రెండోరోజు పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబు అబుదాబిలోని వివిధ పారిశ్రామికవేత్తలతో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయనే అంశాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సిఎం కోరారు. అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్, మస్దార్, అగ్తియా గ్రూప్, లులు గ్రూప్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులతో సిఎం చంద్రబాబు వివిధచోట్ల భేటీ అయ్యారు. ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఛైర్మన్ ఖలీఫాఖోరీ, మస్దార్ సిఇఒ మొహమ్మద్ జమీల్ అల్ రమాహీని ముఖ్యమంత్రి కోరారు. విశాఖలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని అపెక్స్, మస్దార్ సంస్థల ప్రతినిధులకు సిఎం వివరించారు. ఈ క్రమంలో బ్యాటరీ స్టోరేజ్ రంగంలో పెట్టుబడులపై అపెక్స్ ప్రతినిధులు చర్చించారు. సూపర్ కెపాసిటర్స్ రంగంలో పేరొందిన అపెక్స్ సంస్థను ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సిఎం ఆహ్వానించారు. ఈమేరకు సూపర్ కెపాసిటర్ ఉత్పత్తులను రాష్ట్రానికి పంపాలని అపెక్స్ ప్రతినిధులను సిఎం కోరిన మీదట.. సూపర్ కెపాసిటర్ ప్రోడక్ట్సును పంపేందుకు అపెక్స్ ప్రతినిధులు అంగీకరించారు. ఇక ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు పెట్టాలని ఎపెక్స్ సంస్థను సిఎం ఆహ్వానించారు. సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని మస్దార్ సిఇఒను చంద్రబాబు ఆహ్వానించారు. ఇక అగ్తియా గ్రూప్ సిఇఒతో సల్మీన్ అలమేరీ, లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీతో జరిపిన వేర్వేరు భేటీల్లో ఫుడ్ ప్రాసెస్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆ రెండు సంస్థలను సిఎం ఆహ్వానించారు. ఎపిలో కోకో ఉత్పత్తి బాగుంటుందని... తమ దగ్గర చాక్లెట్ పరిశ్రమ పెట్టే అంశంపై ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి అగ్తియా గ్రూప్‌కు సూచించారు. అలాగే గల్ఫ్ దేశాల నుంచి పారిశ్రామిక వేత్తలను తీసుకుని విశాఖ పెట్టుబడుల సదస్సుకు రావాలని సిఎం ఆహ్వానించారు.

# నకిలీమద్యం దందాయే

>> వివిధ రకాల ఆరోపణలు చేయడం, తప్పుడు విచారణ చేయడం, సాక్ష్యాలను సృష్టించడం, ప్రలోభపెట్టడం అలాంటివి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఫేక్ చాట్లను సృష్టించి జోగి రమేష్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. తనకు సంబంధించి సంబంధం లేదని, ఆ చాట్లు అబద్ధమని తన దగ్గర ఉన్న రెండు ఫోన్లలో చాట్లను బహిరంగంగా చూపించారని తెలిపారు. సిబిఐకి అప్పగిస్తే నిజాలు తెలుస్తాయని, అది చేయకుండా సిట్ వేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నకిలీ మద్యం వెనక ఉన్నది టిడిపి ఇన్‌ఛార్జ్. ఆయన గత ఎన్నికల్లో పోటీ కూడా చేశారు. మరో వ్యక్తి జనార్దన్‌రావు. మరో వ్యక్తి సురేంద్రనాయుడు. వీరంతా ఒక మాఫియా. వారు గత ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం కూడా చేశారు. ఇదే జనార్దన్‌రావు విదేశాల్లో ఉండి, రెండు రోజుల్లో వచ్చి రెండు రోజుల్లో లొంగిపోతానని ఎల్లో మీడియాలో ముందే ఊదరగొట్టారు. ఆయన వచ్చిన తర్వాత ఆయనతో ఒక వీడియో రిలీజ్ చేయించారు. అది తను రెండేళ్ల నుంచి దందా చేస్తున్నట్లు, దాని వెనక వైయస్సార్సీపి నాయకుడు ఉన్నట్లు దుష్ప్రచారం చేశారు. ఇంకా జయచంద్రారెడ్డి వైయస్సార్సీపి నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడని ప్రచారం చేశారు.ఇంకా మరో అడుగు ముందుకేసి, నకిలీ మద్యం మూలాలు ఆఫ్రికాలో ఉన్నాయంటూ ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేశారు. జనార్దన్‌రావుతో వీడియో రికార్డు చేసి, దాంట్లో జోగి రమేష్ పేరు చెప్పించారు. నకిలీ మద్యం గుర్తించిన తర్వాత ఎన్ని షాపుల్లో దాడి చేశారు. ఎక్కడెక్కడ నకిలీ మద్యం గుర్తించారు? జనార్దన్‌రావు విదేశాల నుంచి వస్తున్నాడని ముందే చెప్పారు, అక్కడే ఎందుకు ఆయన్ను అరెస్టు చేయలేదు...కస్టడీలో ఉన్న జనార్దన్‌రావు వీడియోలో ఎలా మాట్లాడారు? అది బయటకు ఎలా వచ్చింది? ఇంకా తన ఫోన్ పోయిందని అదే జనార్దన్‌రావు చెప్పారు. మరి ఏ ఫోన్‌లో ఆయన రికార్డు చేశారు? వాట్సాప్ ఛాటింగ్‌ను ఎలా బయటపెట్టారు? నకిలీ మద్యం ఫ్యాక్టరీ ఈనెల 3న బయట పడింది. ఇప్పటికే 20 రోజులు గడిచాయి. అయినా మీ పార్టీ అభ్యర్థి, గత ఎన్నికల్లో పోటీ చేసిన, ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జయచంద్రారెడ్డిని ఎందుకు అరెస్టు చేయలేదు? ఆయన పాస్‌పోర్టు ఎందుకు సీజ్ చేయలేదు? రెండేళ్ల నుంచి అదే జయచంద్రారెడ్డి నకిలీ మద్యం తయారు చేస్తున్నాడని అంటున్నారు కదా? మరి అలాంటప్పుడు ఎందుకు ఆయన్ను గత ఎన్నికల్లో తంబళ్లపల్లిలో పెద్దిరెడ్డిగారి తమ్ముడు ద్వారకనాథ్‌రెడ్డిపై ఎలా నిలబెట్టారు? అదే జయచంద్రారెడ్డి తన ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఆఫ్రికాలో డిస్టిలరీ ఉన్నట్లు చెప్పారు. మరి ఆ విషయం ఎందుకు దాచారు లేదా? అమలాపురం, అనకాపల్లి జిల్లా పరవాడ, పాలకొల్లులో పట్టుబడిన నకిలీ మద్యం ఎవరిది? ఇంకా ఏలూరు జిల్లాకు చెందినటిడిపి నాయకుడిపై డజన్ల కొద్దీ కేసులున్నాయి. నకిలీ మద్యం ఫ్యాక్టరీలు పెట్టింది చంద్రబాబు మనుషులు. దాన్ని తమ మాఫియా నియంత్రణలో ఉన్న లిక్కర్ షాపులు, బెల్టుషాపులకు సరఫరా చేసింది చంద్రబాబు మనుషులే. దీన్ని సీబీఐకి అప్పగిస్తే, అన్ని వాస్తవాలు తెలుస్తాయి. కానీ, చంద్రబాబు ఆ పని చేయకుండా, ఎప్పుడూ సిట్‌పైనే ఆధారపడతారు. ఎందుకంటే ఆ సిట్ పూర్తిగా చంద్రబాబు అదుపాజ్ఞలలోనే ఉంటుంది అన్నారు.గ్రామ, వార్డు సచివాలయాల మీద చంద్రబాబుకు అర్థం కావడం లేదు. అందుకే ఆ వ్యవస్థను తప్పు పడుతున్నారు. ఆయన వైఖరి, నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అతలాకుతలం అవుతోంది. బాలికపై టిడిపి నాయకుడి అత్యాచారం. ఒక నాయకుడు ఏపీసీసీని నిందించడం ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయంటే.. ఇక్కడ పొలిటికల్ గవర్నెన్స్ నడుస్తోంది..అసలు లేని అంశాన్ని బాలకృష్ణ ప్రస్తావించారు. ఆయన మద్యం సేవించి, అసెంబ్లీకి వచ్చి మాట్లాడారు. దాన్ని స్పీకర్ చూడాలి. సభా నియమాల విషయంలో వివక్ష ఉండకూడదన్నారు.


గురువారం డి.సిఎం పవన్‌తో భేటీ అయిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

# డి. సిఎం పవన్ కల్యాణ్‌తో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ భేటీ

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యలపై నిర్మోహమటంగా స్పందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిస్వార్ధ రాజకీయనేత అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. ఫిర్యాదులను స్వీకరించడంతో వాటి పరిష్కారానికి జాప్యం లేకుండా కృషి చేస్తున్న పవన్ కూటమి ప్రభుత్వానికి వన్నె తీసుకుని వస్తున్నారన్నారు. గురువారం సాయంత్రం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్.మధుకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్. చీఫ్ మోహన్ భగవత్ ఆదివాసీ యోధుడు బిర్సా ముండా గురించి రాసిన పుస్తకాన్ని పవన్ కల్యాణ్‌కు అందించారు. వీటితోపాటు భారత భారతి సంస్థ స్వాతంత్ర్య సమరయోధుల జీవితాల గురించి ప్రచురించిన 175 పుస్తకాలను ఇచ్చారు. బిర్సా ముండా జయంతి వేడుకల గురించీ, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని విస్తృతం చేయడం గురించి ఉప ముఖ్యమంత్రితో చర్చించారు. ఏ అంశపైనైనా నిష్కర్షగా వ్యవహరిస్తామని పవన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మంచి చేయాలనే ఆలోచనతో సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఎన్డీఎ కూటమి 16 నెలల్లో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్దామన్నారు.

# పలు జిల్లాలు అతలాకుతలం


గురువారం కురిసిన భారీ వర్షాలకు నీటమునిగిన రావులపాలెం బస్టాండు

>> అవకాశముందని పేర్కొంది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అనంతసాగరం మండలం కమ్మవారిపల్లెలో చప్టాపై వరద ప్రవహిస్తోంది. ఈ జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. కృష్ణపట్నం పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లింగసముద్రంలో 8.3 సెం.మీ, ఉలవపాడులో 6.2 సెం.మీ, రాపూరులో 5.6 సెం.మీ, మర్రిపాడులో 5.3 సెం.మీ, ఉదయగిరిలో 4.7 సెం.మీ, అనంతసాగరం, కొండాపురంలో 4.6 సెం.మీ, కోవూరులో 4.1 సెం.మీ, కొడవలూరులో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి పెన్నా నదిలో వరద ప్రవాహం పెరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మచిలీపట్నంలో ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. వర్షం కారణంగా ప్రధాన రహదారులు కాల్వలను తలపిస్తున్నాయి. బస్టాండ్ ప్రాంతం నీటమునిగింది. రహదారులపై వర్షపు నీటి ప్రవాహంతో వాహనాదారుల ఇబ్బందులకు గురయ్యారు. వర్షాల దృష్ట్యా నేడు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. కృష్ణా జిల్లా దివిసీమలో ఎడతెరపి లేని వర్షం కురిసింది. పల్నాడు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసాయి. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, పెదకూరపాడులో వర్షాలు కురిసాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసాయి. బాపట్ల జిల్లాలో విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. గుంటూరులో వర్షం కారణంగా రహదారులు జలమయ మయ్యాయి. నెల్లూరు జిల్లా చేజెర్ల మండలం యనమదల వద్ద నల్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మర్రిపాడు మండలం బొగ్గేరు, సైదాపురం మండలం పిన్నేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

# నవంబరు 1 నుంచి డిడిఓ కార్యాలయాలు

>> ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంచాయతీలు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నిధులు సమకూర్చడంలోను, పాలనాపరమైన సంస్కరణల్లోనూ కూటమి ప్రభుత్వం ఎంతో సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ఆ ఫలితాలు ప్రజలకు చేర్చి పల్లెల అభివృద్ధిలో ఉద్యోగులు క్రియాశీలక బాధ్యత తీసుకోవాలన్నారు. నిధుల వినియోగం, పాలన సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళిక అందించాలని ఆదేశించారు. గ్రామీణ ముఖ చిత్రం మారే విధంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రతిపాదిత అంశాలు అమలు కావాలన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఎసిబి డైరెక్టర్ జనరల్ లేఖపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంది? - హైకోర్టు

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** గత వైఎస్సార్సీ ప్రభుత్వంలో కాకినాడ జిల్లా పరిధిలో 'నవరత్నాలుపేదలందరికీ ఇళ్లు' పథకం కింద భూసేకరణ అక్రమాలపై విచారణకు అనుమతి కోరుతూ ఎసిబి డైరెక్టర్ జనరల్ రాసిన లేఖపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందో చెప్పాలని హైకోర్టు కోరింది. అక్రమాలు, ఇళ్ల స్థలాలను మెరక చేయడం, స్థలాలను చదును చేయడం, లేఅవుట్ల పేరుతో అక్రమాలు జరిగాయనే వ్యవహారంపై విచారణకు అనుమతి కోరుతూ ఎసిబి డైరెక్టర్ జనరల్ లేఖ రాశారు. దీనిపై వివరణ ఇవ్వాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఎసిబి విచారణకు అనుమనితిచ్చారో లేదో చెప్పాలని కోరింది.
విచారణను 2026 ఫిబ్రవరి 4కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలో 5 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు జరిగిన భూసేకరణలో అక్రమాలు జరిగాయంటూ గడిమోగ గ్రామస్తుడు పివి భద్రరావు పిల్ దాఖలు చేశారు. దీనిపై అధికారులకు గతేడాది ఏప్రిల్‌లో వినతిపత్రం ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఇందులో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కాంట్రాక్టర్ కాటంశెట్టి వెంకట రమణమూర్తి ఇతరులను ప్రతివాదులుగా చేర్చారు.

# వర్షాలపై అప్రమత్తం

>>చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీవర్షాల కారణంగా తీవ్రంగా ప్రభావితం అయిన నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు ఎస్డీఆర్ బృందాలను, నెల్లూరు జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తక్షణం మోహరించాలని ముఖ్యమంత్రి సూచనలిచ్చారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలని సిఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, రహదారులు, భవనాలు, విద్యుత్‌శాఖలు సమన్వయంతో పనిచేయాలనీ ముఖ్యమంత్రి సూచించారు. భారీవర్షాలతో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, పిల్లలకు పాలు లాంటి ఆహారపదార్థాలను అందుబాటులో ఉంచాలన్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. తీవ్ర వర్షాల కారణంగా కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్నచోట్ల పటిష్టపరచాలని సిఎం అధికారులకు సూచనలు ఇచ్చారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పంట నష్టం జరక్కుండా చూడాలని సిఎం సూచనలిచ్చారు.

# రెండురోజుల వైకుంఠద్వార దర్శనాలకే మొగ్గు!

## ఆగమసలహాదారులతో కీలక సమావేశంలోనూ ఇదే చర్చ

## ఇక పదిరోజుల దర్శనాలు లేనట్లే?

**తిరుమల, అక్టోబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని వైకుంఠద్వార దర్శనాలను రెండురోజులు (వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియలు)మాత్రమే పరిమితంచేసే దిశగా సమాలోచనలు జరిగినట్లు తెలుస్తోంది. 2021 సంవత్సరంలో అమలైన తరహాలోనే ఈ ఏడాదికూడా రెండురోజులు వైకుంఠద్వారాలను తెరచి భక్తులకు దర్శనాలు చేయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై ఈనెల 28వతేదీ తిరుమలలో జరగనున్న టిటిడి బోర్డు సమావేశంలో స్పష్టత రానుంది. ఈ యేడాది డిసెంబరు 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠద్వాదశి ఘడియలు. గతంలో మాదిరి రెండురోజులకే పరిమితం చేయాలనేది టిటిడి బోర్డు, అధికారులు, ఆగమసలహామండలి ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చిందనేది విశ్వసనీయ సమాచారం. వైష్ణవ ఆలయాల్లో ఉత్తరవైకుంఠద్వార దర్శనం ఉంటుంది. తిరుమల ఆలయంలో వైకుంఠద్వారం మాత్రమేననేది పండితుల వివరణ. ఈ నేపథ్యంలో మోక్ష మార్గం వైకుంఠద్వారాలను ఏకాదశి, ద్వాదశి ఘడియల్లో మాత్రమే తెరచి దర్శనం చేయించడం మంచిదనే అభిప్రాయంతో ఉన్నారనేది తెలుస్తోంది. గతంలో ఆ రెండురోజుల్లో సుమారు 1.80లక్షలమంది వరకు సామాన్యభక్తులకు దర్శనాలు చేయించిన సందర్భాలు ఉన్నాయి. 2021వ సంవత్సరంలో అప్పటి వైఎస్సార్సీ ప్రభుత్వంలోని టిటిడిబోర్డు ఎక్కువమంది సామాన్య భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించాలనే ఉద్దేశ్యంతో తమిళనాడు శ్రీరంగంలోని ఆలయంలోఉన్న విధానాన్ని తిరుమల ఆలయంలోనూ అమలుచేసి పదిరోజులు ద్వారాలను తెరచివుంచి దర్శనం కల్పించేలా చూస్తున్నారు. పదిరోజులు దర్శనాలకు దాదాపు ఏడెనిమిది లక్షలమంది వరకు భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయించారు. ఇదేవిధానం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సామాన్యభక్తులకు వైకుంఠద్వారదర్శనం ముక్తి కల్పించాలనే అమలుచేసేలా చూశారు. ఈ ఏడాది జనవరి 10వతేదీ వైకుంఠ ఏకాదశి, 11న ద్వాదశి ఘడియల్లో భక్తులను అనుమతించేందుకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేసిన సర్వదర్శన టోకెన్ విధానంలో భక్తులు భారీగా రావడంతో తోపులాటతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. యాభైమందికిపైగా తీవ్రంగా క్షతగాత్రులయ్యారు.
అప్పట్లోనే ఈ విషయంపై భక్తుల నుండి వచ్చిన విజ్ఞప్తులు, వాదనలతో సిఎం చంద్రబాబునాయుడు ఒకింత అసహనం వ్యక్తం చేశారుకూడా. గత ప్రభుత్వం అమలుచేసిన విధానం కొనసాగించాలని ఏముంది? బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తారా?ఆలోచన చేయరా అని టిటిడి అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం చెందారు. టిటిడిలో ప్రస్తుత బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అధికారులు పూర్తిగా సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, సూచనల మేరకు పాలన సాగిస్తున్నారు. అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. సామాన్యభక్తులకు మరింత సౌకర్యంగా దర్శనాలు, వసతి కల్పించేందుకు కదులుతున్నారు. ఇప్పుడు ఈ యేడాది వైకుంఠద్వార దర్శనాలను రెండురోజులకే పరిమితం చేయాలనేది టిటిడి బోర్డు, ఆగమ సలహా మండలి, టిటిడి అధికారులు నిర్ణయంతో ఉన్నారు.

## వారం - వర్జ్యం

24-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
తదియ రా.1.19
అనూరాధ పూర్తి
వర్జ్యం : ఉ.9.21-11.09
దు.ఉ.8.23-9.10, మ.12.16-1.03
శుభసమయం : ఉ.7.30-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. సంఘ సేవా కార్య క్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** ఆర్థికంగా పరిస్థితి బాగున్నా ఖర్చు అధికమవుతుంది.

**మిథునం:** నూతన వస్తు, వస్త్రా, ఆభరణాలకు గాను అధికంగా ఖర్చు చేస్తారు.

**కర్కాటకం:** జీవితములో ముఖ్యము అని భావించే కార్యక్రమణాలను ప్రారంభించటానికి కృషి చేస్తారు.

**సింహం:** కాంట్రాక్ట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం చెప్పదగినది.

**కన్య :** రాయభారములు నడిపి లాభపడుతారు. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**తుల :** సుదూర ప్రాంతములలోని వారి యొక్క క్షేమ సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** మీరు చేసే ప్రతి పని వివేకంతో కూడిఉంటుంది. ప్రయాణాలు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి ఇంటా బయటా ప్రోత్సాహం.

**మకరం:**దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** చిన్ననాటి మిత్రులు నుండి కీలక సమాచారం అందుతుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పెట్టుబడులు పెట్టండి

>> ప్రభుత్వ విధానాలు, పారదర్శకత, సాంకేతిక వినియోగం కారణంగా పెట్టుబడిదారుల విశ్వాసం పెరిగిందని చెప్పారు. సాంకేతికతలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంటుందని తెలిపారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయని ఆయన వెల్లడించారు. ఇది దేశంలో సాంకేతిక విప్లవానికి దారితీసే అడుగు అవుతుందని చెప్పారు. 'అమరావతి భవిష్యత్తు సాంకేతికత, ఇన్నోవేషన్, పెట్టుబడులకు హబ్‌గా మారుతుంది. ఇక్కడి నుంచి ఆవిష్కరణలు ప్రపంచానికి చేరుతాయి' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**విశాఖలో భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానం:**
నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (భాగస్వామ్య సదస్సు)కు రావాలని ఆయన అబుదాబీ ప్రతినిధులను ఆహ్వానించారు. పెట్టుబడుల దిశగా ఎపి తీసుకుంటున్న వేగవంతమైన చర్యలను ప్రత్యక్షంగా చూడాలని సూచించారు. అబుదాబీ ప్రతినిధులు స్పందిస్తూ, త్వరలో ఎపి పర్యటనకు వస్తామని, రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు.

**అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్‌తోనూ భేటీ**
అబుదాబీ చాంబర్ ఛైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జి 42 సిఇఒ మాన్సూర్ అల్ మాన్సూరీతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఎపి పయనిస్తోందని, రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తున్నాయని సిఎం తెలిపారు. కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందన్నారు. విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సిఎం ఆహ్వానించారు. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జి42 ఇంటర్నేషనల్ సంస్థను ఎఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు స్వాగతించారు.

**టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్వర్క్ లంచ్**
అనంతరంఅబుదాబీలోని పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబు బృందం నెట్వర్క్ లంచ్ సమావేశంలో పాల్గొంది. దీనిలో జీ 42 సిఇఒ మనుకుమార్ జైన్, ఎడిఐసి గ్లోబల్‌హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సి సిఇఒ అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సిఇఒ జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సిఇఒ జయంతి కనాని, ట్రక్కర్ సిఇఒ గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సిఇఒ యశిష్ దహియా, ఇన్స్యూరెన్స్ మార్కెట్ సిఇఒ అవినాష్, ఇన్సార్ట్స్ సిఇఒ అజార్ ఇక్బాల్, జీఐఐ సిఇఒ పంకజ్ గుప్తా, నూన్ సిఇఒ ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సిఇఒ ఆశీష్ కోషి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వారికి వివరించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఫిన్ టెక్, హెల్త్ టెక్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటిరంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలనుసూచించారు. త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్‌హబ్‌ద్వారా ఎపిలో ఇన్నోవేషన్‌ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. యూఏఈలో టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏపీలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని సిఎం తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. ఈ పర్యటనలో మంత్రులు బిసి జనార్దన్ రెడ్డి, టిజి భరత్‌తో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**దుబాయ్‌లో ముగిసిన సిఎం పర్యటన, ఎపిలో పెట్టుబడులకు ఆసక్తి కన్పరిచిన పరిశ్రమలు**
దుబాయ్‌లో సిఎం పర్యటన ముగించుకుని గురువారం అబుదాబి చేరుకున్నారు. సిఎం దుబాయ్ పర్యటనల్లో పలు అంశాలకు సంబంధించి, వారిని ఎపికి ఆహ్వానించారు. విశాఖలో జరిగే పెట్టుబడిదారుల సదస్సులో తమ సంస్థలు రాష్ట్రంలో ఏఏ రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తిని కనబరుస్తుందనే విషయాన్ని వెల్లడించాలని కోరారు. రాష్ట్రంలో రియాల్టీ రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ క్రమంలో అమరావతి విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాల్లో కూడా బిజినెస్ ఐటీ పార్కులు, మాల్స్, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లతో పాటు ఉన్నతశ్రేణి వర్గాలకు హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితం అవుతున్న పారిశ్రామిక కారిడార్లు, పోర్టులకు అనుసంధానంగా ఇండస్ట్రియల్ టౌన్ షిప్, హౌసింగ్ ప్రాజెక్టులకు అవకాశం ఉందని శోభా రియాల్టీ ఛైర్మన్ రవి పిఎన్సీ మీనన్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా శోభా గ్రూప్ సంస్థ చేస్తున్న ఛారిటీని సిఎం అభినందించారు.

# హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకరించండి

## విక్టోరియా టూరిజం, స్పోర్ట్స్ మంత్రి స్టీవ్ విమోపోలోస్‌తో మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకారం అందించమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మెల్‌బోర్న్ విక్టోరియా రాష్ట్ర పర్యావరణ, టూరిజం, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌ను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మెల్‌బోర్న్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... వారసత్వ పర్యాటకంలో విక్టోరియా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఎపిలో పాపికొండలు, విశాఖ బీచ్ వంటి సుందరమైన ప్రదేశాలు ఉన్నాయి. గ్రేట్ ఓషన్ రోడ్ తరహా పర్యావరణ బ్రాండింగ్ కు విక్టోరియా నైపుణ్యాన్ని ఎపికి అందించండి. ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖతో కలిసి హెరిటేజ్ టూరిజం, మార్కెటింగ్, ఎకో సర్టిఫికేషన్ పై కలిసి పనిచేయండి. ఆంధ్రప్రదేశ్ లో 1053 కి.మీ.ల సువిశాల తీరం ఉంది.
విక్టోరియా పోర్టు ఫిలిప్ బే ప్రాజెక్టు తరహాలో వాతావరణ సాంకేతికతను ఉపయోగించి ఏపీలో తీరప్రాంత స్థితిస్థాపకతపై ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి (ఆర్‌డి) కార్యక్రమాలు చేపట్టండి. విక్టోరియా సర్క్యులర్ ఎకానమీకి చేయూతనిస్తున్న వ్యర్థాల నిర్వహణ, కార్బన్ న్యూట్రల్ టూరిజం తరహా ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేయండి. విక్టోరియా మెల్‌బోర్న్ గ్రాండ్ ప్రిక్స్ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ ఈవెంట్ల నిర్వహణకు సహకారం అందించండ అన్నారు. ఆంధ్రప్రదేశ్/విక్టోరియాలలో క్రికెట్, హాకీ వంటి క్రీడలకు సంబంధించి ఉమ్మడి శిక్షణా శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్‌లు నిర్వహించండి. స్పోర్ట్స్ సైన్స్‌పై ఎపివిక్టోరియా నడుమ స్టూడెంట్ ఎక్స్ఛేంజి కార్యక్రమాలకు సహకారం అందించండి. విక్టోరియా అడ్వెంచర్ టూరిజం గవర్నెన్స్ (ఆల్పిన్ నేషనల్ పార్క్) తరహాలో ఆంధ్రప్రదేశ్ లోని అరకు (ట్రెక్కింగ్), పులికాట్ (వాటర్ స్పోర్ట్స్) అభివృద్ధికి చేయూతనివ్వండి. విక్టోరియాలోని ఆఫ్ షోర్‌విండ్, సోలార్ రెన్యువబుల్ ప్రాజెక్టులు విజయవంతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎపిలో యువతకు గ్రీన్ జాబ్స్ పై స్కిల్ డెవలప్ మంట్ కార్యక్రమాలకు సహకారం అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# సుప్రీం సిజెగా జస్టిస్ సూర్యకాంత్!

>> మంత్రిత్వ శాఖ లేఖ రాసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత సిజెఐ గవాయ్ తర్వాత అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ సూర్యకాంత్ భారత న్యాయవ్యవస్థకు నాయకత్వం వహించే అవకాశం దక్కనుంది. అధికారికంగా ఆయన నియామకం అయితే, జస్టిస్ సూర్యకాంత్ నవంబరు 24న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. దాదాపు 15 నెలలపాటు సుప్రీం సిజెగా సేవలందిస్తారు. ఆయన పదవీ కాలం 2027 ఫిబ్రవరి 9న ముగిసే అవకాశముంది.

## ఎస్పీడిసిఎల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ ఎఇ, డిప్యూటీ ఇఇల సస్పెన్షన్

**తిరుపతిరూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ఏపిఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలోని గూడూరు డిస్ట్రిక్ స్టోర్స్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మల్లిఖార్జున, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శివశంకరయ్యలను సస్పెండ్ చేస్తూ చైర్మెన్ శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేసారు. గూడూరు డిస్ట్రిక్ స్టోర్స్‌లో విద్యుత్ పరికరాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో వారిద్దర్ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఈ అంశంపై వివరణ కోరుతూ నెల్లూరు సర్కిల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/ టెక్నికల్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్.బాలచంద్రకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవల బకాయిలు చెల్లించండి : వైఎస్ షర్మిల

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రైవేటు ఆస్పత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిలు రూ.2,700 కోట్ల మేర ఉన్నాయని వాటిని చెల్లించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైద్యసేవలు 14 రోజులుగా నిలిచిపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడుతూ వైకాపా హయాంలో ఆస్పత్రులకు రూ.2వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.5,900 కోట్లు చెల్లించాల్సి ఉండగా...వాటిలో రూ.5,200 కోట్లు చెల్లిం చిందని వివరించారు. కూటమి ప్రభుత్వ బకా యిలు రూ.700 కోట్లతో పాటు వైకాపా పాలన లోని రూ.2వేల కోట్లు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# విద్యుత్ టెండర్లలో మాయాజాలం



### ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోళ్లలో రూ.40.000 కోట్ల అవకతవకలు
### ఎపిఎస్పీడిసిఎల్, డిస్కంలలో ఒకే కంపెనీ ఆధిపత్యం
### విచారణ చేపట్టాలని సెంటర్ ఫర్ లిబర్టీ ప్రతినిధులు డిమాండ్

**తిరుపతిరూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఏపిఎస్పీడిసిఎల్), అనుబంధ విద్యుత్ డిస్కాంలలో ట్రాన్స్‌ఫార్మర్స్ కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరిగాయని సెంటర్ ఫర్ లిబర్టీ ప్రతినిధులు ఏబి వెంకటేశ్వరరావు, చక్రవర్తిలు ఆరోపించారు. డాక్యుమెంటరీ ఆధారాలు, ఆర్‌టిఐ రికార్డులు, తనిఖీ నివేదికలు, కొనుగోళ్ల ఆర్డర్స్ ఆధారంగా షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ప్రవేట్ లిమిటెడ్ అనే ప్రవేట్ కంపెనీకి ప్రయోజనం చేకూర్చటానికి రూ.40,000కోట్ల విలువైన టెండర్లు, కొనుగోళ్ల అమోదాలను తారుమారు జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి కలిసి వినతిపత్రం అందజేసారు. అనంతరం ఏబి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ " కర్మను తప్పించుకోగలమేమో గానీ కరెంట్ బిల్లును మాత్రం తప్పించుకోలేం" మన పిల్లలైన ఆ బిల్లులు కట్టాల్సిందేనని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఎవరో చేసిన అవినీతికి సామాన్య వినియోగదారుడు ఎందు భారం మోయాలని ప్రశ్నించారు. రూపాయి విలువ చేసే వస్తువును మూడు రుపాయాలకు కొనుగోలు చేసి, ఆ భారాన్ని ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో ఎపిఎస్పీడిసిఎల్ చైర్మెన్‌గా నియమితులైన సంతోషరావు హయాంలోనే భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆరోపణలకు సంబంధించి సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వివరాలు కోరినా అధికారులు ఇవ్వలేదన్నారు. 12సార్లు అప్పీలు చేసినా సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని, 2023 నుండి ఎస్పీడిసిఎల్‌లో అవినీతి వ్యవస్థీకృతంగా మరిందన్నారు. అధికారులు, కంపెనీలు కుమ్మకై అవినీతి సొమ్మును పంచుకున్నారని ఆరోఫించారు. టెండర్స్‌లో బహుళ సంస్థలు పాల్గొనే విధంగా పోటీ పెంచాల్సి ఉండగా ఒకే సంస్థకు కాంట్రాక్టులు అన్నీ ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు. టెండర్ నిబంధనలు మారుస్తూ...సాంకేతిక ప్రమాణాలను సడలిస్తూ ఇతర కంపెనీలను అర్హత రహితంగా మార్చినట్లు పత్రాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. విద్యుత్ కొనుగోలు చట్టం ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ ప్రకారం ఉండాల్సిన అనుమతులు లేకుండా ఉన్నతాధికారులే అప్రూవల్ ఇచ్చినట్లు రికార్డ్స్ వెల్లడిస్తున్నాయని తెలిపారు. ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టుల్లో పెయిలైన ట్రాన్స్ ఫార్మర్స్‌కు కూడా బిల్లులు అమోదించినట్లు బయటపడినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక రేట్లకు ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 25కెవి 2-స్టార్ ట్రాన్స్‌ఫార్మర్స్‌కు రూ.1,19,899 చెల్లించగా అదే సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌లకు తెలంగాణా ప్రభుత్వం రూ.87,791, చత్తీస్‌గర్ రూ.75,496, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.73,101 రుపాయాలకే కొనుగోలు చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయని తెలిపారు. 5స్టార్ మోడల్ ట్రాన్స్‌ఫార్మర్‌ల కొనుగోలుకు ఏపి ప్రభుత్వం రూ.1,36,46,499 చెల్లించారని తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే భారీగా చెల్లించిన ఈ ధరల వ్యత్యాసం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ చర్యల వల్ల ప్రభుత్వ ఖజానకు కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. టెండర్ మాయా జాలానికి సంబంధించిన విచారణను ఏసిబిచే చేయించాలని డిమాండ్ చేసారు.

# తిరుమల సమాచారం

## 30న తిరుమలేశునికి పుష్పయాగం - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల,అక్టోబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వతేదీ గురువారం పుష్పయాగమహోత్సవం ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. 29వ తేదీ సాయంత్రం అంకురార్పణ జరగనుంది. పుష్పయాగంరోజు ఆలయంలో ఉదయం రెండవ అర్చన, రెండవ గంట,నైవేద్యం అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి సంపంగి ప్రాకారంలోని కల్యాణమండపానికి వేంచేపు చేస్తారు, అక్కడ విశేష స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. 30వతేదీ మధ్యాహ్నం 1గంట నుండి చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆరురకాల ఆకులతో 12రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులకు పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయమాడవీదుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆ రోజు ఆర్జితసేవలు తిరుప్పావడ,కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం రద్దయ్యాయి. వేకువజామున తోమాల,అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. 29వతేదీ బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ రద్దయ్యింది.

## అలిపిరి 'విడిదిమండపం' పునర్ నిర్మాణం

### - రూ.4కోట్లతో త్వరలో పనులు



**తిరుమల,అక్టోబర్ 23ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుపతి అలిపిరిలోని పురాతన విడిది మండ పం(రాతి మండపం) కూలేందుకు శిధిలావస్థకు చేరుకోవడంతో దాన్ని పూర్తిస్థాయిలో పున:నిర్మాణానికి టిటిడి అధికారులు నిర్ణయించారు. ఇందుకు పూర్తిగా దాతల సహకారంతో 4కోట్ల రూపాయలు వ్యయం చేయడానికి సిద్దమయ్యారు. 2023లోనే అప్పట్లోనే అధికారులు దీన్ని మరమ్మతులు చేయాలని భావించారు. కూల్చికొత్తది నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు.అయితే పురావస్తుశాఖ నుండి అనుమతులు రాకపోవడం, దీనిపై విమర్శలు రావడంతో అంతటితో ఆగింది. మళ్ళీ ఇప్పుడు దాన్ని పున:నిర్మించేందుకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి జీర్ణోద్ధారణకు నిర్ణయించారు. పురావస్తుశాఖ సంచాలకుడు మునిరత్నంరెడ్డి చొరవతో పనులు చేపట్టేందుకు తాజాగా పూణేకు చెందిన వెంకటేశ్వర ఛారిటబుల్‌ట్రస్ట్ దాతల సహకారంతో మొదలుకానున్నాయి. అలిపిరి పాదాలమండపం వెళ్ళే మార్గంలోని 'భక్తుల విడివి మండపం"పూర్తిస్థాయిలో కనుమరుగు కాకుండా పున:నిర్మాణానికి సిద్దమయ్యారు.తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులకోసం 16వశతాబ్ధంలో అలిపిరి వద్ద రాతిమండపంలో సేదదీరి ఆ తరువాత తిరుమల ఆలయానికి చేరుకునేవారని శాసనాలు ద్వారా తెలుస్తోంది. నడకమార్గంలో భక్తులు తరచూ ఈ విడిది మండపాన్ని సందర్శించి సేదదీరేవారు.

## శ్రీవారి ఆశీస్సులతోనే 'మిరాయి' చిత్రం విజయవంతం

### - దర్శకుడు కార్తీక్‌ఘట్టమనేని



**తిరుమల,అక్టోబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల విడుదలై బాక్సాఫీస్ హిట్ అందుకున్న మిరాయి చిత్రం విజయవంతం ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతోనేనని చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని, నటుడు సజ్జాతేజ విశ్వాసం వ్యక్తం చేశారు. చిత్రం విజయవంతంతో గురువారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. విఐపి బ్రేక్‌లో ఇరువురూ ఆలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన తేజ సజ్జాతో అభిమానులు సెల్ఫీలకోసం పోటీపడ్డారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు : ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతోరెండు తెలుగురాష్ట్రాల ప్రజలందరికీ శుభాలు కలగాలని పలువురు ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఎంఎల్‌సి ఆలపాటిరాజేంద్రప్రసాద్, అలనాటి సినీనటి జయలలిత అనుచరులతో కలసి ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. దేవదేవుడ్ని దర్శించుకుంటే మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలుగు రాష్ట్రాల క్రికెటర్లకు న్యాయంచేస్తా

### - అఫెక్స్‌లో సభ్యుడు కావడం సంతోషం :చాముండేశ్వరినాథ్



**తిరుమల,అక్టోబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:** బిసిసిఐ అఫెక్స్‌లో తెలుగువాడిగా సభ్యుడు కావడం సంతోషంగా ఉందని, ఈ ఎన్నికలు జరిగే ముందు తిరుమలకు వచ్చి స్వామివారి ఆశీస్సులందుకున్నానని బిసిసిఐ అఫెక్స్ సభ్యుడు చాముండేశ్వరినాథ్ తెలిపారు. తెలుగురాష్ట్రాల క్రికెటర్లకు న్యాయం చేస్తానని, తెలుగువాడికి ఈ అవకాశం రావడం శ్రీవారి ఆశీస్సులతోనేనని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్.పాకిస్థాన్ క్రికెటర్లు తటస్థ ప్రాంతాల్లో మ్యాచ్‌జరిగేలా చూస్తానన్నారు. అఫెక్స్‌సభ్యుడుగా నియమితులైన చాముండేశ్వరినాథ్ గురువారం ఉదయం తిరుమలకు వచ్చారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపి ముందంజ

### - నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రమ్మణ్యం



నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రమ్మణ్యంతో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బేటీ దృశ్యం

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందుందని నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రమ్మణ్యం అన్నారు.పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు.విశాఖపట్నం గ్రోత్ హబ్, పూర్వోదయ పథకాల పై గురువారం ఎపి సచివాలయంలో నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో సమావేశమై చర్చించారు. ఈసందర్భంగా నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రమ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగాపోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆదిశగా తగిన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు. అదే విధంగా రానున్న చీఫ్ సెక్రటరీల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా తగిన నివేదికను సిద్ధం చేసుకోవాలని సిఎస్ విజయానంద్‌కు ఆయన సూచించారు. అనంతరం విశాఖపట్నం, అమరావతి, తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు తద్వారా జరిగే అభివృద్ధి ప్రయోజనాలపై ఆయన చర్చించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ విశాఖపట్నం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వేగవతంగా ముందుకు తీసుకువెళ్ళడం తోపాటు అనేక నూతన ప్రాజెక్టులు,పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.కేంద్రం నుండి వివిధ ప్రాజెక్టులు,పథకాలకు సకాలంలో తగిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతోందని కేంద్రం నుండి తగిన నిధులు మంజూరు అయ్యేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. కాగా పూర్వోదయ అనేది దేశ తూర్పుతీరంలోని ఆంధ్రప్రదేశ్,ఒడిస్సా,పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, బీహార్ ఐదు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక వినూత్న పథకం.ఇది సాంస్కృతిక వారసత్వం మరియు సహజ వనరులను ఉపయోగించుకోవడం,కొత్త మౌలిక సదుపాయాలను సృష్టించడం,ఉపాధిని సృష్టించడం మరియు స్థిరమైన ఆర్థికవృద్ధిని ప్రోత్సహించడం ద్వారా తూర్పు భారతదేశాన్ని జాతీయ పురోగతికి కీలకమైన చోదకంగా మార్చాలనే లక్ష్యంతో పూర్వోదయ పథకాన్ని చేపట్టడం జరిగింది.దీనిద్వారా పెద్దఎత్తున రహదారులు వంతెనలు, విమానాశ్రయాలు, విద్యుత్ ప్లాంట్లు వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం జరుగుతుంది.ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరచడానికి, పారిశ్రామికాభి వృద్ధికి

## పుర, నగరపాలక, పట్టణాభివృద్ధి సంస్థల్లో ఒకే విధమైన జోనింగ్ నిబంధనలు

### - గందరగోళ పరిస్థితులకు తెరదించుతూ కీలక నిర్ణయం

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని అన్ని పుర,నగరపాలక సంస్థలు, నగర పంచాయితీలు,పట్టణాభివృద్ధి సంస్థల్లో ఒకే విధమైన జోనింగ్ నిబంధనలు ఇక అమలులోకి రానున్నాయి. ఒక్కో నగరం, పట్టణంలో ఒక్కో రకమైన నిబంధనల కారణంగా తలెత్తుతున్న గందరగోళ పరిస్థితుల కు తెర దించుతూ ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. ఇప్పటి వరకు ఉన్న 16 రకాల భూ వినియోగాన్ని కూడా 9కి తగ్గించారు. రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం విడుదల చేశారు. జోనింగ్ విధానంలో సంక్లిష్టంగా ఉన్న నిబంధనలు సరళీకరించే క్రమంలో ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో అధికారుల బృందం ఇటీవల పర్యటించి చేసిన సిఫార్సుల్లో భాగంగానే అన్ని నగరాలు,పట్టణాలకు ఒవ విధమైన జోనింగ్ నిబంధనలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త విధానం ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధికి దోహదం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు. నివాస,వాణిజ్య, పారిశ్రామిక,వ్యవసాయ రంగాల అభివృద్ధి విషయంలో స్పష్టత ఉంటుంది.



## ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంకండి

### - కాంగ్రెస్ శ్రేణులకు పిసిసి చీఫ్ షర్మిల నిర్దేశం

**తిరుపతి,అక్టోబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రం లోని బిజెపి,రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంకావాలని పిసిసి చీఫ్ వైఎస్‌షర్మిల పార్టీ శ్రేణులకు నిర్దేశం చేశారు. ప్రజల తరపున చైతన్యవంతమైన పోరాటాలకు సిద్ధంకావాలని ఆమె పిలుపునిచ్చారు. ఏఐసిసి,పిసిసి పిలుపుతో ఓట్‌చోరీకి వ్యతిరేకంగా తిరుపతి నియోజకవర్గ పరిధిలో సేకరించిన 21వేల సంతకాలను గురువారం ఉదయం తిరుపతినగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరుచిట్టిబాబు, పార్లమెంట్ అధ్యక్షుడు బాలగురవంబాబు, రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి మస్తాన్‌వలీ, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి ఈద సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అందజేశారు.

## మీరు తాగే మద్యం నిజమైనదేనా తెలుసుకోండి

### అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎక్సైజ్ కమీషనర్ శ్రీధర్

**విజయవాడ, అక్టోబర్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కొనుగోలు చేసే వినియోగదారులు నకిలీ మద్యం బారిన పడకుండా ఉండేందుకు, ఆంధ్రప్రదేశ్ మధ్య నిషేధం, ఎక్సైజ్ శాఖ"మీరు తాగే మద్యం నిజమైనదేనా తెలుసుకోండి" అనే రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమాన్ని డైరెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రారంభించారు. వినియోగదారులలో అవగాహనకు విజయవాడ ఒక రిటైల్ మద్యం దుకాణంలో అవగాహన పోస్టర్‌ను శ్రీధర్ ఆవిష్కరించారు.


## సమర్ధవంతమైన విద్యుత్ కొనుగోలు వ్యూహాలపై దృష్టి సారించండి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ, అక్టోబరు 23,ప్రభాతవార్త ప్రతినిధి** :నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సంస్థలు విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ఖచ్చితమైన ఆర్థిక పరమైన జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. 2025 నవంబర్ నెలలో విద్యుత్ కొనుగోలు కు సంబంధించి విద్యుత్ సంస్థలతో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ పీ జెన్కో ఎండీ ఎస్. నాగలక్ష్మి, ఏపీట్రాన్స్కో జెఎండీ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ , ఏ పీ ట్రాన్స్కో డైరెక్టర్లు ఏ.కె.వి. భాస్కర్, జె .వి. రావు, ఎన్.వి. రమణమూర్తి, ఏ పీ జెన్కో డైరెక్టర్లు ఎం. సుజయ కుమార్, పి. అశోక్ కుమార్ రెడ్డి, ఏపీపీడీసిఎల్ డైరెక్టర్ శ్రీనివాస రావు, నెడ్క్యాప్ ఎండీ ఎం. కమలాకర్ బాబు, విద్యుత్ సంస్థల ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మార్కెట్ లో విద్యుత్ ధరలు, పునరుత్పాదక ఉత్పత్తి ధోరణులను నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతమైన విద్యుత్ కొనుగోలు వ్యూహాలు రూపొందించాలని విద్యుత్ సంస్థలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. 2025 నవంబర్ నెలకు సంబంధించి 213 మిల్లియన్ యూనిట్ల విద్యుత్ అందుబాటులో ఉందని, గ్రిడ్ డిమాండ్ 218 మిలియన్ యూనిట్లు గా అంచనా వేసినట్లు సిఎస్ తెలిపారు . "రోజువారీ డిమాండ్ తీర్చడంలో పునరుత్పాదక విద్యుత్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు . ఉదయం 06:30 నుంచి 17:30 గంటల మధ్య సౌర విద్యుత్ ఉత్పత్తి 70 ఎండబ్ల్యు నుంచి 1,870 ఎండబ్ల్యు మధ్య, పవన విద్యుత్ 90 లీజూ నుంచి 400 లీజూ మధ్య ఉండబోతోందని , 500 లీజూ సామర్థం గల సిలెరు హైడ్రో స్టేషన్ పూర్తి సామర్ధంతో వినియోగించుకోవాలని సిఎస్ తెలిపారు.(అక్టోబరు) లో రోజువారీ విద్యుత్ లోటు 15.33 మిలియన్ యూనిట్లు ఉండగా , పీక్ డెఫిసిట్ 1,800 మెగావాట్లు ఉండే అవకాశముందని అంచనా వేసినట్లు సిఎస్ తెలిపారు . అయితే, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, శ్రీ శైలం ప్రాజెక్ట్ విద్యుత్ ఉత్పత్తిని పరిగణలోకి తీసుకొని విద్యుత్ సంస్థలు రోజు వారి విద్యుత్ కొనుగోలు పై దృష్టి సారించాయని, దీనివల్ల విద్యుత్ సంస్థలకు గణనీయమైన లాభం చేకూరిందని సిఎస్ పేర్కొన్నారు.

## మీ వద్ద ఆధారాలు ఉంటే ఇవ్వండి

### గోవుల మృతిపై - టిటిడి మాజీ ఛైర్మన్ భూమనను ప్రశ్నించిన డిఎస్పీ



**తిరుమల,అక్టోబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో పవిత్రమైన గోమాతలు టిటిడి గోశాలలో మృతిచెందాయనే ఆరోపణలపై మీవద్ద ఆధారాలు ఉంటే ఇవ్వాలని టిటిడి మాజీఛైర్మన్, వైసిపి ఉమ్మడిజిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం ప్రశ్నించారు. ఏప్రిల్‌లో మీడియాతో గోవులు అధికంగా మృతి చెందాయని ఫోటోలతో మీడియాతో మాట్లాడిన అంశంపై టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసులో భూమన కరుణాకర్‌రెడ్డిని గురువారం ఉదయం తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు రావాలని నోటీసులిచ్చారు. ఉదయం 11గంటలకు పార్టీ శ్రేణులతో కలసి ప్రదర్శనగా భూమన స్టేషన్‌కు వచ్చారు.పార్టీ న్యాయవాదితో కలసి వచ్చిన ఆయనను అక్కడ డిఎస్పీ భక్తవత్సలం కొన్ని ప్రశ్నలను కరుణాకర్‌రెడ్డికి సంధించి సమాధానాలు రాబట్టారనేది తెలుస్తోంది. గోవుల మృతిపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, గోవులు అధికంగా మరణిస్తున్నాయని మాట్లాడానని తెలిపినట్లు సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతో ఆయన్ను పంపివేశారు. అయితే దీనిపై భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. టిటిడి బోర్డు గోవుల పట్ల నిర్లక్ష్యం తగదని, గోవులు మరణిస్తున్నాయని తెలిపానన్నారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసభ్యపదజాలంతో కూటమి నేతలు ఆరోపణలు చేస్తున్నారని అసహనం చెందారు. ఇప్పటివరకు తాను చేసిన ఆరోపణలపై ఏ ఒక్క ఆరోపణలు తేల్చిందిలేదన్నారు. వాస్తవాలు చెబుతుంటే నిందారోపణలు చేస్తున్నారని, తనపై విషప్రచారం చేస్తున్నారన్నారు. టిటిడిలో పనిచేసే వారికి తనపై నమ్మకం, గౌరవం వుందని, టిటిడి ఉద్యోగులతో ఒకరకమైన బాండింగ్ ఉందన్నారు.

## జగన్ అబద్ధాలు బహిర్గతం :పిపిపితో విద్యార్థులకు న్యాయం

### - గుంటూరు 'తూర్పు' ఎమ్మెల్యే నజీర్ అహ్మద్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 23:** రాష్ట్రంలో వైద్య విద్యను విస్తృతం చేయాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో కొత్తగా 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. జగన్ రెడ్డి హయాంలో వైద్య విద్య రంగం పూర్తిగా స్థంభించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ప్రచార ఆర్భాటాలు తప్ప, జగన్ ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తి స్థాయిలో నిర్మించలేకపోయారని దుయ్యబట్టారు. పీపీపీ విధానం దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని,

రాష్ట్రంలో కూడా అదే నమూనా ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ పద్ధతిలో ప్రభుత్వమే కళాశాలలు, ఆసుపత్రులు నడిపిస్తుందని, ప్రైవేటు రంగం కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధికి మాత్రమే సహకరిస్తుందని తెలిపారు. జగన్ ప్రచారం చేస్తున్నట్టుగా భూములు శాశ్వతంగా ప్రైవేటు వారికి ఇస్తున్నారని చెప్పడం అబద్ధమని అన్నారు.

## పంచారామాలకు ప్రత్యేక బస్సులు

**విజయవాడ,అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీక మాసం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పంచారామాల టూర్ ప్యాకేజీలో భాగంగా అమరలింగేశ్వర స్వామి అమరావతి, సోమేశ్వర స్వామి భీమవరం, క్షీ రారామలింగేశ్వర స్వామి పాలకొల్లు, భీమేశ్వర స్వామి ద్రాక్షారామం, కుమారరామ స్వామి, సామర్లకోట పంచారామ క్షేత్రాలు ఉన్నాయన్నారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టూరిజం కేంద్ర రిజర్వేషన్ కార్యాలయం నుండి ఈ నెల 27, నవంబర్ 03,10,17 సోమవారం తేదీల్లో బస్సులు బయలుదేరతాయన్నారు. పెద్దలకు: రూ.2130/, పిల్లలు: రూ.1760 లు ధర ఉంటుందన్నారు. ప్రతి శనివారం విజయవాడ నుండి వాడపల్లి వరకు ప్రత్యేక బస్ ను పర్యాటక శాఖ నిర్వహిస్తోందన్నారు.

వార్త


పువ్వు ఎంత అందంగా ఉన్నా పరిమళం లేకపోతే అది వ్యర్థమే. అలాగే క్రియాశూన్యమైన మాటలు వినడానికి ఎంత సొంపుగా ఉన్నా నిష్ప్రయోజనమే.

-మెకాలే

# ఏదీ 'అటవీ' భద్రత?

అటవీ రక్షణకు వేలాది కోట్లరూపాయలు వెచ్చిస్తున్నాం, అడవులను ధ్వంసం చేసే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని అటు కేంద్రపాల కులు, ఇటు రాష్ట్రాల పాలకులు ఎన్ని హెచ్చరికలు చేసినా, మరెన్ని ప్రకటనలు చేసినా ఆశిం చిన ఫలితాలు లభించడం లేదు. అంతకంతకు అటవీ విధ్వంసం పెరిగి పోతున్నది. కొందరు అధికారుల అవి నీతి, నిర్లక్ష్యం అన్ని టికంటే మించి రాజకీయ జోక్యంతో అటవీ రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న చట్టాలు నిరు పయోగం అవుతున్నాయి. అరణ్యాలను స్మగ్లర్లు వేట గాళ్లకు వదలి కొందరు అధికారులు జనారణ్యంలో ఉండ దంతో పరిస్థితి అంత కంతకు దిగజారిపోతున్నది.తెలుగు రాష్ట్రాల్లో ఒకనాడు కాకులు దూరని కీకారణ్యాలుగా పేరు పొందిన నల్లమల, దండకారణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి.మరోకపక్క ప్రభుత్వాలు కూడా అటవీ విధ్వంసానికి అభివృద్ధి పేరుతో పాల్పడుతున్నాయనే విమర్శలను కొట్టి వేయలేం. రోడ్లు, ప్రాజెక్టులు, గనుల తవ్వకం తదితర అవసరాల కోసం అడవులను నిర్దాక్షి ణ్యంగా నరికివేస్తున్నారు. మరొకపక్క పెరుగుతున్న జన అవసరాలు కూడా ముఖ్యంగా వంటచెరుకుకు ప్రధాన ఆధారంగా అడవులే ఉంటున్నాయి. ప్రతిరోజూ భారత్‌లో మూడవందల ముప్పై ఎకరాలకుపైగా అడవులు అదృశ్య మైపోతున్నాయని గతంలో ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాబోయే రెండు,మూడు దశాబ్దాల్లో ముఖ్యంగా గ్రామీ ణులు అడవులపై వంట చెరుకుకు ఆధారపడాల్సిన పరిస్థితులు పెరుగు తాయని నిపుణులే అభిప్రాయపడు తున్నారు. దీంతో అడవుల నరికివేత మరింత పెరుగు తుందని అంచనా వేస్తున్నారు. ఈ అటవీ సంపద ఇలా అదృశ్యమైపోతుంటే వీటి ఆధారంగా శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్న పెద్ద పులులు,చిరుత పులులు, దుప్పులు, అడవి పం దులు, కుందేళ్లు, అడవికోళ్లు ఇలా ఒక్కటేమిటి సమస్త వన్యప్రాణులు వేటగాళ్ల బారి నుంచి తప్పించుకోలేక కాల గర్భంలో కలిసిపోతున్నాయి. అడ వుల విస్తీర్ణం తగ్గడం, స్మగ్లర్ల కార్యకలాపాలు పెరగడంతో ఈ వన్యప్రాణులు అక్కడ ఆహారం దొరకక జనారణ్యం లోకి చొచ్చుకు వస్తు న్నాయి. ఇటీవల అనేక ప్రాంతాల్లో గ్రామాల్లోకి పులులు, ఎలుగుబంట్లు, అడవిపందులు, ఏనుగులు, తదితర వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి చొచ్చుకువచ్చి ఆహారం కోసం రైతుల పంటలపై పడుతు న్నాయి. శ్రీకాకుళం తదితర ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాయల సీమలోని చిత్తూరు ప్రాంతంలో అడవి ఏనుగుల గుంపు లు చొచ్చుకువస్తున్నాయి. దీంతో ఎన్నో వ్యయప్రయాసల కు ఓర్చి సాగు చేసుకున్న పంటలు నోటికి అందుతున్న దశలో వన్యప్రాణులు ధ్వంసంచేస్తున్నాయి. కొన్నిప్రాంతా ల్లో రైతులపై కూడా దాడులు చేస్తున్నాయి. మొన్న తెలంగాణలో పులిదాడిలో అన్నదాత ఒకరు అసువులు బాశారు. ఇలాంటి సంఘటనలు తరుచుగా చోటు చేసు కుంటున్నాయి. దీంతో కొన్నిప్రాంతాల్లో క్రిమిసంహారక మందుల ప్రయోగంతోనో, కరెంటు తీగలుపెట్టి వన్య ప్రాణుల ప్రాణాలు తీస్తున్నారు. ఇక రాయలసీమలోని కడప, చిత్తూరు, నెల్లూరు, తదితర జిల్లాల్లో ఎర్రచంద నం కోసం స్మగ్లర్లు చేస్తున్న ఆగడాలకు అంతే లేకుండా పోతున్నది. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసికాల్పులు జరుపుతున్నా ప్రాణాలు కూడా లెక్క చేయ కుండా స్మగ్లింగ్ కొనసాగిస్తున్నారు. అత్యంత విలువైన ఈఅటవీ సంపద కేవలం నెల్లూరు, చిత్తూరు, కడప సరి హద్దుల్లోని వెలుగొండలు, శేషాచలం అడువుల్లో మాత్రమే దొరుకుతాయి. అందుకు కారణం ఏమిటో కొన్నివందల సంవత్స రాలుగా పరిశోధనలు చేసినా వృక్షశాస్త్రజ్ఞులు కనుగొన లేకపోయారు.గతంలో ఒకసారి బ్రిటీష్‌పాలకులు ఇంగ్లాండ్‌కు తీసుకువెళ్లి అక్కడ పెంచే ప్రయత్నంలో కూడా సఫలీకృతం కాలేదు.ఈ అరుదైన వృక్ష సంపదను కాపా డేందుకు 1973లో (కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పీసిస్)లోకి చేర్చారు. దాంతో ఎర్రచందనం ఎగుమతులపై నిషేధం అమలులోకి వచ్చింది. పరిమితిగా ఉన్న వృక్షాలను సంరక్షించుకునేం దుకు వెసులుబాటు లభించింది. అయినా ఆనాటి నుంచి ఏదోఒక రూపంలో ఇది ముఖ్యంగా జపాన్‌లాంటి దేశా లకు ఎగుమతి అవుతూనేఉంది. సముద్ర మార్గం ద్వారా దేశసరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త విభాగాలు అనుసరిస్తూనే ఉన్నారు. రోడ్డు మార్గం ద్వారా కూడా ఈ అక్రమ రవాణా సాగుతూనే ఉంది. మొన్న ఢిల్లీలో దాదాపు ఎనిమిదికోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను అధికారులు కనుగొన్నా రు. మూలాలు ఆంధ్ర ప్రదేశ్ నుంచే ఉన్నాయి. ఢిల్లీ, చండీగఢ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును సమయం చూసి నేపాల్‌కు తరలించి అక్కడి నుంచి చైనాకు చేరవేస్తున్నారు. మణిపూర్, మిజో రం రాష్ట్రాలు ఈ అక్రమ రవాణాకు అడ్డాగా మారిపోయా యి. అయితే ఈ అక్రమ రవాణాను ఆపేందుకు గతంలో భారీ ఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దించి భద్ర తను కట్టుదిట్టం చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆనాడు ఇరవైమందికిపైగా కూలీలు చనిపోయారు. స్మగ్లర్ల పదఘట్ట నలతో నల్లమల, శేషాచలం అడువులు నేటికీ అతలాకుత లం అవుతున్నాయి.దీంతో వన్యప్రాణులు తలదాచుకునేం దుకు స్థావరాలు లేకుండాపోతున్నాయి. ఇకపక్క అడువు లు తగ్గిపోతున్నాయి. మరొకపక్క విషప్రయోగాలతో వన్యప్రాణులను మట్టుబెట్టే కార్యక్రమం నిర్విఘ్నంగా జరుగుతున్నది. ఇప్పటికైనా పాలకులు కళ్ల తెరవాలి. అడవులను, వాటి ఆధారంగా జీవనం సాగిస్తు న్న వన్యప్రాణులను కాపాడేందుకు త్రికరణశుద్ధిగా అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు జరగాలి.

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.



సెయింట్ థెరిస్సా

నేర్చుకున్నదాంట్లో ఒక గ్రాము ఆచరణలో పెట్టేందుకు పది గ్రాముల ఇంగిత జ్ఞానం అవసరం.



ఆల్బర్ట్ కామూ

## ప్రజావాక్కు



### రవాణా సంస్కరణల దిశగా తెలంగాణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న చెక్‌పోస్టుల మూసి వేత నిర్ణయం, అలాగే కేంద్రం సూచించిన జీఎస్టీ 2.0 తరువాతి రవాణా సంస్కరణల దిశగా తెలంగాణలో ఒక సాహసోపేతమైన అడుగుగా నిలిచింది.ఈనిర్ణయం రవా ణారంగంలో పారదర్శకత, సమర్థతను పెంపొందించడ మే కాకుండా అవినీతిని అరికట్టడంలో కీలక పాత్ర పోషిం చనుంది.ఇంతకాలం రోడ్డు రవాణా చెక్‌పోస్టులు వాణిజ్య రవాణాదారులకు ఇబ్బందికరంగా మారాయి. అనవసర ఆలస్యం, లంచాల వ్యవహారం, ఇంధన వ్యయం వంటి సమస్యలతో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఆ చెక్‌పోస్టులను తొలగించడం ద్వారా ప్రభుత్వం వ్యాపార సౌలభ్యాన్ని పెంచుతూ, సమయ నష్టాన్ని తగ్గించగలదు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### గురువులను గౌరవించండి

విద్యార్థులజీవితంలో గురువులు ఎంతోముఖ్యమైన స్థానా న్ని కలిగి ఉంటారు. వారు మనకు పాఠాలు నేర్పడమే కాకుండా, మంచి మనుషులుగా మారే మార్గాన్ని చూపి స్తారు. జీవిత విలువలనునేర్పిస్తారు. అందుకే విద్యార్థులు తమ గురువులను గౌరవించాలి,వారు చెప్పిన మాటలను ఆచరించాలి. గురువులను గౌరవించడం అంటే కేవలం నమస్కారంచేయడంకాదు.వారి బోధనలను గుండె చప్పు ళ్లలోనిలుపుకోవడం, జీవితంలో ఆచరించడం కూడా. గురువులు చూపిన దారిలో నడిస్తేనే విద్యార్థులు విజ యం సాధిస్తారు. గురువు ఆశీర్వాదం పొందిన విద్యార్థి ఎప్పుడూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పరిశోధకులను ప్రోత్సహించాలి

రాష్ట్రంలో ఉన్నపర్యాటక ప్రాంతాలను,కట్టడాలను, నిర్మా ణాలను, త్రవ్వకాలను,పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పరిశో ధనలను మెరుగుపరచాలి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన వారిచేత చారిత్రాత్మకమైన ప్రదేశాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయడం కోసం రచనల ద్వారా ఫోటోల ద్వారా సేకరించడానికి పరిశోధనలను జరిపించాలి.నేటి సమాజా నికి చరిత్రత్మకమైన ప్రదేశాల గురించి తెలియజేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### సిఎన్జి స్టేషన్ల సంఖ్యను పెంచాలి

నేటి ఆధునిక కాలంలో సిఎన్జి (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) వాహా నాల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. వివిధ కార్ల కంపెనీలు సిఎన్జి వాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. దీంతోపాటు అనేకమంది సిఎన్జి కార్ల కొనుగోలు మీద మక్కువ చూపిస్తున్నారు. పెట్రోల్ డీజిల్‌తో పోలిస్తే ధర తక్కువగా వుంది. మైలేజీ రావడం జరుగుతుంది. కార్ల సంఖ్యకు అనుగు ణంగా సిఎన్జి స్టేషన్లసంఖ్య తక్కువగా ఉండడంతో కార్ల వాహా నదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హనుమకొండ నగరంలో భీమారం వైపు ఒకటి నక్కలగుట ప్రాంతంలో మరొకటి కాజీపేటలో ఒకటి వున్నాయి. అదేవిధంగా హనుమకొండ నుంచి భూపాలపల్లి వెళ్లే దారిలో చెల్పూరు వద్ద మాత్రమే సిఎన్జి స్టేషన్ ఉంది కాబట్టి ఆయా పెట్రోల్ కంపెనీ యాజమాన్యాలు స్పందించి కార్ల వాహన దారుల అవసరార్థం సిఎన్జి స్టేషన్ల సంఖ్య పెంచాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### బదలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు 2025 జూన్ నెలలో బదిలీలు చేపట్టింది.బదలీ అయిన వారిని పాతస్కూల్లో 50శాతం ఉపా ధ్యాయులు లేని కారణంగా పాఠశాలలకు తిరిగి డిప్యూటేషన్ ద్వారాచేరమని ప్రభుత్వం ఉత్తర్వులు జీఓ 22ఇచ్చింది. దీంతో ఉపాధ్యాయులు సర్దుబాటు కోసమేనని పాత పాఠశాలలోనే పని చేస్తున్నారు.వీరు బదలీ అయ్యి నాలుగునెలలు గడుస్తున్నా రిలీవ్ చేయలేదు. వీరిలో ఎనిమిది సంవత్సరాలకుపైగా పని చేసి తప్పనిసరిగా బదలీ అయిన ఉపాధ్యాయులు, మారుమూ ల ప్రాంతాలలో ఇబ్బంది పడుతున్న మహిళా ఉపాధ్యాయులు, వయస్సు మళ్లిన ఉపాధ్యాయులు ఉన్నారు.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ట్రంప్ తిక్క నిర్ణయాలు

అమెరికా అవలంబిస్తున్న వైఖరి అలాగేఉన్నది. ఇందుకు రెండు కారణాలున్నాయి. ఉక్రెయిన్‌ను ఇజ్రాయెల్ చెప్పు చేతల్లో ఉండ మని అంటున్నది మరోవైపు చైనా తో ఆపన్న హస్తము చాస్తు న్నది. మరొకవైపు భారత్ వంటి నమ్మకస్తుడు అయిన మిత్ర దేశాన్ని రష్యా నుండి చమురూ కొనుగోలు చేయకూడదు అని అంటుంది ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కానీ విషయం.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదంలో ఐక్యరాజ్యసమితి అస్తిత్వం

**ధనిక దేశాల ఆగడాలను నిలువరించలేక, అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతూ, కొన్నిదేశాలు మౌనముద్ర వహిస్తూ, తటస్థంగా మనుగడ సాగిస్తున్నాయి. ఎంతో విస్తృతమైన యంత్రాంగం కలిగి ఉండి, ప్రపంచ శాంతిసాధన కోసం ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితి నిర్వీర్యమైపోయింది. ఐక్యరాజ్య సమితి యుద్ధాలను నివారించడంలో వైఫల్యం చెందిందని డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలోనే తీవ్రమైన విమర్శ చేయడం జరిగింది. శాంతి స్థాపనలో ఘోర వైఫల్యం చెందిన ఐక్యరాజ్య సమితి మను గడ ఇక ప్రశ్నార్థకమే. ఐ.రా.స మరో నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్)లా మిగిలిపోయే అవకాశముంది. యుద్ధాలను నివారించడానికి, ప్రపంచంలో శాంతిని స్థాపించడానికి ఇతర దేశాల కలిమిపై, బలిమిపై, ఆదేశాలపై ఆధారపడని శక్తివంతమైన మరో అంతర్జాతీయ వేదిక నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉంది.**



సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచ యుద్ధాల వలన నెల కొంటున్న అశాంతిని రూపు మాపి, ప్రపంచంలో శాంతిని నెల కొల్పి, ప్రజల ప్రాణాలను కాపాడి వారిని భయం నుండి భద్రత వైపు నడిపించి, ప్రజల మధ్య సామరస్యా న్ని నెలకొల్పడానికి,1945 అక్టోబర్ 24వ తేదీన 51 సభ్యదేశాల చేరికతో ఐక్యరాజ్య సమితి అధికారికంగా ఆవి ర్భవించింది. ఇంతింతై వటుడింతై... మాదిరిగా ఐక్యరాజ్య సమితిలో ప్రస్తుత సభ్య దేశాల సంఖ్య 193కి పెరిగింది. మొదటి మహా సంగ్రామంలో సుమారు 40 మిలియన్ల మంది ప్రజలు, సైనికులు మృత్యువాత పడ్డారు. 1939-45 సంవత్సరాల మధ్య ఆరు సంవత్సరాల పాటు అక్షరాజ్యా లు, మిత్ర రాజ్యాల మధ్య సుదీర్ఘంగా కొనసాగిన రెండవ మహా ప్రపంచ సంగ్రామం చరిత్రలో భయంకరమైన మార ణహోమానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. సైనికులు ప్రజల తో సహా సుమారు 70మిలియన్ల మందికిపైగా ఈ యుద్ధం లో మరణించినట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ మహా యుద్ధ ప్రళయాన్ని నిలువరించడంలో అప్పటి నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్) ఘోరమైన వైఫల్యాన్ని మూట గట్టుకుంది. లీగ్ ఆఫ్ నేషన్స్‌కు ప్రత్యామ్నాయ అంతర్జా తీయ వేదికగా ఐక్యరాజ్య సమితి ఆవిర్భవించింది. అయితే ఐక్యరాజ్య సమితి కూడా లీగ్ ఆఫ్ నేషన్స్ దారిలోనే పయ నిస్తూ, తన మనుగడను కోల్పోయి,అదృశ్యమయ్యే ప్రమా దం పొంచి ఉంది. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లకు చేరింది. కొన్ని దేశాలుజనాభా సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మరికొన్ని దేశాల్లో జన సంఖ్య తగ్గి, యువ తరం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని దేశాలు ఆర్థిక మందగమనంతో ప్రజల అవసరాలు తీర్చలేక సతమ తమవుతున్నాయి. కోవిడ్ సంక్షోభం వలన ఆర్థికంగా అనేక దేశాలు అస్తవ్యస్త పరిస్థితులను చవిచూసాయి.కోవిడ్‌తర్వాత రష్యా,ఉక్రెయిన్ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అలాస్కాలో ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన శాంతి చర్చలు అసంపూర్తిగా ముగియడంతో మరో దఫా చర్చలు బుడా పెస్ట్‌లో జరగబోతున్నాయి. ఉక్రెయిన్ డొనెట్స్క్ ప్రాంతాన్ని వదిలేస్తే, యుద్ధాన్ని ఆపేస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ షరతు పెట్టడం జరిగింది. ఇప్పటికే డొనెట్స్క్ లోని 75 శాతం భూభాగం రష్యా అధీనంలో ఉంది. తన షరతును ఉక్రెయిన్ అంగీకరిస్తే, తన అధీనంలోని కొన్ని భూభాగాల ను ఉక్రెయిన్‌కు అప్పగిస్తానని పుతిన్ ట్రంప్‌తో జరిపినటెలి ఫోన్ సంభాషణ సమయంలో పేర్కొనడం జరిగింది.పుతిన్ షరతును జెలెన్‌స్కీ తిరస్కరించినట్టు, ట్రంప్ మౌనం వహించినట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఇలాంటి పరి స్థితుల నేపథ్యంలో ట్రంప్ పుతిన్‌ల మధ్య జరగబోయే ముఖాముఖి చర్చలు ఎలాంటి ఫలితాలనిస్తాయో ఊహించ డం కష్టం. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రష్యా,ఉక్రెయిన్ యుద్ధం వలన అనేక విపత్కర పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. రష్యా వద్ద చమురు దిగుమతి చేసుకుంటున్న కారణంగా భారత్‌పై ట్రంప్ ట్రేడ్ వార్, వీసా నిబంధలు, నిర్బంధాలు కొనసాగిస్తున్నారు. చైనా, అమెరికాల మధ్య టారిఫ్‌ల గోల పతాక స్థాయికి చేరింది. ఏడు యుద్ధాలను ఆపానంటున్న ట్రంప్‌కు శాంతిబహుమతి దక్కలేదు. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య శాంతియుత వాతావరణం నెలకొన్నా, ఈ దేశాల మధ్య ఎప్పుడైనా అగ్గి రాజుకునే అవకాశం లేదు. హమాస్ లక్ష్యంగా గాజాలో కొనసాగుతున్న రక్తపాతానికి స్వస్తిచెప్పడానికి ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్ అంగీ కారం తెలపడం ముదావహం. భారత్ చేతిలో చావుదెబ్బ తిన్న పాక్ తన వక్రబుద్ధి విడనాడడం లేదు. భారత్‌ను




ఏదో చేయాలనే పైశాచిక ధోరణితో పాక్ నేల విడిచి సాము చేస్తున్నది. పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్, సింధ్, పాక్ ఆక్ర మిత కాశ్మీర్ ప్రాంతాలు భగ్గమంటున్నా యి. వేరు కుంపటి పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. పులిమీద పుట్రలా అఫ్ఘా నిస్థాన్ పాక్‌కు ముచ్చెమటలు పట్టిస్తున్నది. పాక్‌కుఇస్లామిక్ దేశాలు కూడా సంఘీభావం తెలపడం లేదు. అఫ్ఘానిస్థాన్ దాడులతో పాక్ భీతిల్లుతున్నది. స్వంత ఇంటిని చక్కదిద్దుకో లేని పాక్ అమెరికా చెంత పదాక్రాంతమయింది. నేపాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న జన్‌జడ్ ఉద్యమం ప్రపంచదేశాలకు ఒక హెచ్చరిక వంటిది. బంగ్లాదేశ్‌లో అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటు న్నాయి. ఈజిప్టు ఇథియోపియా, థాయ్‌లాండ్‌కంబోడియా, భారత్ పాక్, ఇజ్రాయిల్ ఇరాన్, ఇజ్రాయిల్ పాలస్తీనా, రు వాండా కాంగో, అజర్ బైజాన్ ఆర్మీనియా తదితర యుద్ధా లను తానే ఆపానంటూ ట్రంప్ పదే పదే వల్లె వేస్తున్నా, ఆయా దేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందాలు కేవలం తాత్కాలికమే. ప్రస్తుతం కాల్పుల విరమణ పేరుతోనే,ట్రంప్ బెదిరింపుల వలనో వివిధ దేశాల మధ్య సంఘర్షణలు తా త్కాలికంగానే సర్దుమణిగాయి. భవిష్యత్తులో ఏం జరుగు తుందో ఊహించలేం. ప్రపంచంలో అశాంతి రాజ్యమేలుతు న్నది. ప్రపంచంలోని పలుదేశాల మధ్య ఆధిపత్య భావజా లంతో,ఇతర దేశాల భూభాగాలను, సహజ సంపదను కబ ళించాలనే దుగ్ధతో,అత్యాశతో యుద్ధాలు జరుగుతున్నాయి. భారత్ లాంటి దేశాలను ఆర్థికంగా ఎదగకుండా చేయడానికి అగ్రదేశాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. పాక్ లాంటి దేశాలు ఆర్థికంగా చితికిపోయినా ఉగ్రవాదులకు స్వర్గధామం గా నిలుస్తున్నాయి.మయన్మార్, వెనిజులా వంటి దేశాల్లో ప్రజలకు స్వేచ్ఛలేదు. కొన్ని దేశాలు నియంతృత్వపు పోకడ లు కొనసాగిస్తున్నాయి.అగ్రదేశాల పడగ నీడలో కొన్ని దేశా లు మొద్దునిద్దుర పోతుంటే, మరికొన్నిదేశాలు ఐ.ఎం.ఎఫ్, వరల్డ్ బ్యాంకు వంటి ఆర్థిక సంస్థల సహాయంతో తమతమ దేశాల ఆర్థిక అవసరాలను తీర్చడంలో తాత్కాలికంగా నెట్టు కొస్తున్నాయి. వీటో అధికార దర్పంతో అగ్రరాజ్యాలు చెల రేగిపోతున్నాయి. భద్రతామండలిలో భారత దేశానికి శాశ్వత సభ్యత్వం అందని ద్రాక్షలా మారింది. ప్రపంచ శాంతిని కాపాడడంలోను,యుద్ధాలను నివారించడంలోను ఐక్యరాజ్య సమితి ఘోరంగా వైఫల్యం చెందింది. ఐక్యరాజ్య సమితి ఒక అవశేష అవయంగా, ఆరో వేలిలా రూపాంతరం చెం దింది. ఏ లక్ష్య సాధన కోసం ఐక్యరాజ్య సమితి అవతరిం చిందో, ఆ లక్ష్యాల సాధనలో విఫలం కావడం దురదృష్ట కరం. పేద దేశాల పక్షాన, యుద్ధపీడిత దేశాల పక్షాన నిల బడవలసిన ఐక్యరాజ్య సమితి కేవలం ధనిక దేశాలకువంత పాడే పరిస్థితి తలెత్తడం సముచితం కాదు.ఏడు దశాబ్దాలకు పైగా భారత్ పొరుగునున్న పాక్ ప్రేరిత ఉగ్రవాద చర్యలతో విసుగెత్తిపోతుంటే, ఇప్పటి వరకు ఐ. రా. స ఒరగబెట్టిం దేమీ లేదు.అదే అగ్రదేశాలు ఇతర దేశాలపై దాడి చేస్తుంటే, ఆ దేశాల ఆదేశాలకు,వారి అడుగులకు మడుగులొత్తడం విచిత్రం. గాజాలో రక్తపాతం ఐక్యరాజ్య సమితికి కనిపించ లేదా? బలూచిస్తాన్, సింధ్, పి.ఓ.కె ప్రజలు పాక్ నుండి స్వేచ్ఛ కోసం తపించడం ఐ.రా.స దృష్టికి రాలేదా? ఉక్రె యిన్ రష్యా యుద్ధంలో అమాయక ప్రజలు చనిపోతుంటే, ఆ దృశ్యం ఐ.రా.స కంటికి కనిపించలేదా? అన్ని దేశాల ప్రజలు యుద్ధాలను నిరసిస్తున్నారు. తినడానికి తిండిలేక, ఉపాధి అవకాశాలు లేక, తీవ్రమైన ఆర్థిక అంతరాల మధ్య అవినీతి, దరిద్రం వంటి అస్తవ్యస్త పరిస్థితుల్లో జీవిస్తూ, ఆకలి కేకలతో అలమటిస్తున్న సామాన్య ప్రజల గోడు పై గొడ్డలి పోటులా యుద్ధాలు పరిణమించాయి. ధనిక దేశాల ఆగడాలను నిలువరించలేక, అడకత్తెరలో పోకచెక్కలా నలిగి పోతూ, కొన్నిదేశాలు మౌనముద్ర వహిస్తూ,తటస్థంగా మను గడ సాగిస్తున్నాయి. ఎంతో విస్తృతమైన యంత్రాంగం కలిగి ఉండి, ప్రపంచ శాంతిసాధన కోసం ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితి నిర్వీర్యమైపోయింది. ఐక్యరాజ్య సమితి యుద్ధాలను నివారించడంలో వైఫల్యం చెందిందని డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలోనే తీవ్రమైన విమర్శ చేయడం జరిగింది. శాంతి స్థాపనలో ఘోర వైఫల్యం చెందిన ఐక్యరాజ్య సమితి మను గడ ఇక ప్రశ్నార్థకమే. ఐ.రా.స మరో నానా జాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్)లా మిగిలిపోయే అవకాశముంది. యుద్ధాలను నివారించడానికి, ప్రపంచంలో శాంతిని స్థాపించడానికి ఇతర దేశాల కలిమిపై, బలిమిపై, ఆదేశాలపై ఆధారపడని శక్తివంతమైన మరో అంతర్జాతీయ వేదిక నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉంది. •

# యువత ఆత్మహత్యలను అరికట్టలేమా?

మేకిరి దామోదర్

మన దేశంలో సంవత్సరానికోసారి ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. సాగు రంగంలో సంక్షో భం, కుటుంబ కలహాలు, నిరుద్యోగం, ఉపాధి అవకాశాల లేమి వంటి కారణాలతో రైతులు,గృహిణులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు తీసుకుంటున్నారు.ఇప్పుడు విద్యా ర్థుల వరకూ ఈ విషాద గాథ విస్తరించింది. 2019లో దేశ వ్యాప్తంగా 1,39,123 ఆత్మహత్యలు నమోదయ్యాయి. 2023 నాటికి ఈ సంఖ్య 1,71,418కి పెరిగింది. వీటిలో పెద్దవాటా రైతులకూ, విద్యార్థులకూ చెందింది. ముఖ్యంగా మార్కులు, ర్యాంకుల ఒత్తిడికి తాళలేక, పరీక్షల్లో వైఫల్యం భయంతో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడు తున్నారు. 2017లో దేశవ్యాప్తంగా 1.29 లక్షల మందితమ ప్రాణాలను తామే తీసుకుంటే, 2023లో ఈ సంఖ్య 1.71 లక్షలకు చేరింది.విద్యార్థుల ఆత్మహత్యలు 2017లో9,905 ఉండగా 2023లో 13,892కి పెరిగాయి. ఇవి పోలీసుల ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఎన్సీఆర్బీ సేకరించిన గణాంకాలు మాత్రమే. వెలుగులోకి రాని సంఘటనలను పరిగణిస్తే ఈ సంఖ్య మరింతగా ఉందనే అంచనా నిపుణులు చెబుతున్నా రు. పిల్లల ఇష్టాలు, సామర్థ్యాలను పక్కన పెట్టి పెద్దలు బలవంతంగా కోర్సులు ఎంచి పెడుతున్నారు. ఆటవిడుపుకి అవకాశం లేకుండా బడి, కోచింగ్ సెంటర్ అనే బండ బాధ లతో పిల్లల బాల్యం మసకబారుతోంది. అందరి తెలివితేట లను ఒకే త్రాసుపల్లెలో కొలిచే అశాస్త్రీయ పరీక్షా విధానం యువత మనసును విసిగిస్తోంది. ఎన్సీఆర్బీ తాజా నివేదిక ప్రకారం, 2023లో దేశవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్ప డిన విద్యార్థులు 13,892 మంది. వీరిలో 7,300 మంది బాలురు, 6,559మంది బాలికలు,ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇది రైతు, రైతు కూలీల ఆత్మహత్యల కంటే



28.79 అధికం. ఈ మరణాల అధిక భాగం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో చోటుచేసుకున్నాయి. 2014తో పోలిస్తే 2023 నాటికి విద్యార్థుల ఆత్మహత్యలు 72 శాతం పెరిగాయి.తెలంగాణలో 4,732, ఆంధ్రప్రదేశ్‌లో 4,188 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇది "చదువుతారా, చస్తారా?" అనే భయభ్రాంత వాతావరణం సృష్టిస్తున్న మన విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. ర్యాగింగ్, కులవివక్ష, ఉపాధి లేమి, మత్తు పదార్థాల విని యోగం కూడా విద్యార్థులను మానసికంగా కుంగదీస్తున్నా యి. ఈ సమస్యలు ఎదుర్కోలేక చాలామంది యువత ఆత్మహత్యల దారిని ఎంచుకుంటున్నారు. విద్య అంటే కేవ లం పాఠాలు కాదు. స్వతంత్రంగా ఆలోచించే శక్తి, సరికొత్త మార్గాలు కనుగొనగల ధైర్యం, జీవిత ఆటుపోట్లను ఎదు ర్కొనే సహనం నేర్పే ప్రక్రియ అది. కానీ మన వ్యవస్థలో ఈ అంశాలన్నీ విస్మరించబడ్డాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం, ప్రతి లక్ష జనాభాకు కనీసం ముగ్గురు సైక్రియాట్రిస్టులు అవసరం. కానీ మన దేశంలో కేవలం 0.75 మంది మాత్రమే ఉన్నారు. మానసిక వైద్యుల కొరత ను తగ్గించేందుకు వ్యవస్థాగత చర్యలు తీసుకోవడం అత్యవ సరం. ఇటీవల సుప్రీంకోర్టు విద్యాసంస్థల్లో మానసికఆరోగ్య సాయం, కౌన్సెలింగ్ వ్యవస్థ తప్పనిసరి చేయాలని సూచిం చింది. ఈ మార్గదర్శకాలు కఠినంగా అమలైతేనే విద్యార్థుల ప్రాణాలు కాపాడగలం. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, తల్లి దండ్రులు, సమాజం -అందరూ కలిసి ఈ సమస్యను ఎదు ర్కోనాలి. మనకెందుకులే?" అనే నిర్లక్ష్యపు ధోరణి నుంచి బయటపడి మన సమాజం, మన బాధ్యత అనే చైతన్యం అవసరం. యువత మన దేశ భవిష్యత్తు. వారిని రక్షించ డం,ప్రోత్సహించడం మన సమిష్టి ధర్మం. మానసిక ప్రశాం తత కలిగిన మనిషి చీకట్లలో కూడా దారి కనుగొంటాడు. అలాంటి ధైర్యం, స్థిరత్వం కలిగిన తరం కోసం కుటుంబా లు, పాఠశాలలు, ప్రభుత్వాలు కలసి కృషి చేయాలి. •

# 'జెండర్ స్టడీస్' విద్యార్థులకు ఉపాధి కల్పించాలి

సోరుపాక అనిల్ కుమార్

మహిళల భద్రత అనే అంశం ఈ రోజుల్లో భారత సమా జంలో అత్యంత ప్రాధాన్యం పొందిన చర్చాంశంగా మారిం ది. ప్రతిరోజూ వార్తలలో కనబడుతున్న లైంగిక వేధింపులు, గృహ హింస, మానసిక బాధలు ఇవి. మహిళల భద్రత కేవలం చట్టపరమైన అంశం కాకుండా, మానసిక, సామా జిక, సాంస్కృతిక సమస్య కూడా అని స్పష్టంగా తెలియ జేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యం గా తెలంగాణ ప్రభుత్వం, మహిళల రక్షణ కోసం ప్రత్యే కంగా ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్, భారోసా సెంటర్స్ వంటి విభాగాలను ఏర్పాటు చేసి, మహిళలకు న్యాయం చేయడంలో విశేష పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఈ విభా గాల్లో అత్యంత ముఖ్యమైన స్థానం పొందిన కౌన్సిలర్ పోస్టుల విషయంలో ఒక పెద్ద లోపం ఇప్పటికీ కొనసాగు తోంది. ఆ లోపం ఏమిటంటే జెండర్ స్టడీస్ పూర్తి చేసిన విద్యార్థులను ఇప్పటికీ అర్హులుగా పరిగణించకపోవడం. జెండర్ స్టడీస్ అనే విద్యా కోర్సు ప్రస్తుతం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రం. ఈ కోర్సు చదివే విద్యార్థులు కేవలం లింగ సమానత్వం గురించి సిద్ధాంతా త్మక పరిజ్ఞానం మాత్రమే కాకుండా, మహిళలపై హింస, లైంగిక వేధింపులు, ట్రాఫికింగ్, మానసిక ఆందోళనలు వంటి సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తారు. వారు లింగ సున్నిత దృక్పథంను అభివృద్ధి చేసుకుంటారు, హ్యూ మన్ రైట్స్ సోషల్ వర్క్ పద్ధతులపై సమగ్ర అవగాహన పొందుతారు.ఇలాంటి సమగ్ర శిక్షణ పొందిన వారు ఉమెన్ సేఫ్టీ వింగ్‌లో కౌన్సిలర్‌గా పనిచేస్తే, బాధిత మహిళలతో మరింత సున్నితంగా, మానవీయంగా వ్యవహరించగలరు. బాధితురాలి మానసిక స్థితి అర్థం చేసుకోవడం, ఆమె భయాన్ని తగ్గించడం, చట్టపరమైన మార్గదర్శనం ఇవ్వడం ఇవన్నీ కౌన్సిలర్ బాధ్యతలు. ఈ పనిలో భావోద్వేగపరమై న సహనం, జెండర్ అవగాహన, మానసిక దృఢత అవసరం. ఇవన్నీ జెండర్ స్టడీస్ విద్యార్థుల శిక్షణలో ప్రధాన భాగంగా ఉంటాయి. అయితే ప్రస్తుత నియామక విధానాలు మాత్రం ఇంకా పాత విధానాలకే పరిమితమై ఉన్నాయి. కౌన్సిలర్ పోస్టులకు సాధారణంగా సైకాలజీ లేదా సోషల్ వర్క్ చేసినవారినే ఎంపిక చేస్తున్నారు. కానీ జెండర్ స్టడీస్ కూడా ఈ రెండింటిని సమ్మిళితంగా కలిగిన ఆధునిక విద్యా రంగం. సైకాలజీ మానసిక ఆరోగ్యంపై



దృష్టి పెడితే, సోషల్ వర్క్ సమాజంలోని వ్యక్తిగత సమస్యల పరిష్కారాన్ని సూచిస్తుంది. కానీ జెండర్ స్టడీస్ ఈ రెండింటిని మించి, లింగ అసమానతల మూలాలను అర్థం చేసుకుని వాటిని సామాజిక మార్పు ద్వారా పరిష్క రించే దిశగా దృష్టి సారిస్తుంది. తెలంగాణలో గతంలో కాకతీయ యూనివర్సిటీ, ప్రస్తుతం హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలు ఎం ఏ జెండర్ స్టడీస్ కోర్సును నాణ్య తతో బోధిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుతం ఉద్యోగ రహితులుగా ఉన్నారు. వారు ప్రభుత్వ ప్రాజెక్టులు, మహిళా కమిషన్‌లు, ఉమెన్ సేఫ్టీ వింగ్‌లలో పని చేసే అవకాశం కోరుతున్నారు. కానీ నియామకాలలో కోర్సు పేరు లేకపోవడం వల్ల వారు అర్హత కోల్పోతున్నారు. ఇది కేవలం ఉద్యోగ రహిత సమస్య కాదు. ఇది విద్యా సమానత్వానికి విరుద్ధమైన అంశం.ప్రభుత్వం ఈ అంశాన్ని గమనించి, ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్, 181 వుమెన్ హెల్ప్‌లైన్ వంటి విభాగాల్లో కౌన్సిలర్ పోస్టులకు జెండర్ స్టడీస్ విద్యార్థులను కూడా అర్హులుగా గుర్తించాలి. వారు ఫీల్డ్ ట్రైనింగ్ పొందినవారు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం ఉన్నవారు. ఇటువంటి వ్యక్తులు బాధితురాళ్లతో మాట్లాడినప్పుడు వారు కేవలం సలహాదారు లుగా కాకుండా, ఒక మానవీయ ఆధారంగా నిలుస్తారు. ఇక ఈ మార్పు కేవలం ఉద్యోగ అవకాశాల పరిమితిలోనే ఉండదు. జెండర్ స్టడీస్ విద్యార్థులు వ్యవస్థలో చేరడం ద్వారా పోలీస్ వ్యవస్థలోనే జెండర్ సెన్సిటివిటీ పెరుగు తుంది. మహిళా భద్రతా విధానాలు మరింత మానవీయం గా మారతాయి. చట్టపరమైన వ్యవహారాల్లో కూడా సాను భూతి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఉన్న ప్రపం చంలో మహిళా భద్రత అంటే కేవలం రక్షణ చర్యలు కాదు. అది మానసిక, సామాజిక, భావోద్వేగ స్థిరత్వాన్ని పునరు ద్ధరించే ప్రక్రియ. ఈ ప్రక్రియలో జెండర్ స్టడీస్ విద్యార్థులు ముందుండాలి. వారు మహిళా హక్కుల ఉద్యమానికి శాస్త్రీయ దృష్టికోణం తీసుకురాగలరు. కాబట్టి, ప్రభుత్వం ఈ కోర్సు విద్యార్థులను కూడా ఉమెన్ సేఫ్టీ వింగ్ కౌన్సి లర్ పోస్టులకు అర్హులుగా గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్లు ఇవ్వడం అవసరం. ఇది కేవలం విద్యార్థుల భవిష్యత్తు పరి రక్షణ మాత్రమే కాదు మహిళా భద్రతా వ్యవస్థను మరింత సున్నితమైన, సమర్థవంతమైన, మానవీయ దిశగా నడి పించే ఒక ప్రగతిశీల అడుగు అవుతుంది. అంతేకాకుండా జెండర్ స్టడీస్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశా లు కల్పించినట్లు అవుతుంది. కొంతవరకు నిరుద్యోగ సమస్య కూడా తీరుతుంది. ప్రభుత్వం వెంటనే జెండర్ స్టడీస్ పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశం కల్పించాలి. •



## మహాఘట్‌బంధన్ సీఎం
# అభ్యర్థిగా తేజస్వి యాదవ్

- ఉప ముఖ్యమంత్రిగా ముఖేశ్ సహాని
- పేర్లు ప్రకటించిన కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్

**పాట్నా, అక్టోబరు 23:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్‌ను మహాఘట్‌బంధన్ ప్రకటించింది. అలాగే ఉపముఖ్యమంత్రి అభ్యర్థిగా కూటమికి చెందిన వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ(వీఎస్‌పి) అధినేత ముఖేశ్ సహాని పేరును వెల్లడించింది. గురువారం పట్నాలో నిర్వహించిన సమావేశంలో మహాఘట్‌బంధన్ పార్టీల నేతలు హాజరయ్యారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి వచ్చి తేజస్వి పేరును ఖరారు చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తమతో పాటు ఉన్న నేతలంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. అనంతరం తేజస్వి యాదవ్ మాట్లాడుతూ... 'ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాదు, బీహార్ అభివృద్ధి కోసం చేతులు కలిపాం. అవినీతి, నేరం అనే ఎన్ డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి కలిసి పనిచేస్తాం. తమకు బీహార్ ప్రజలు 20 నెలలు అవకాశమిస్తే, 20 నెలల్లోనే 20 సంవత్సరాలలో చేయని పనిని పూర్తి చేస్తాం' స్పష్టం చేశారు. ప్రస్తుతం తేజస్వి యాదవ్ బీహార్ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. గతంలో ఉపముఖ్యమమంత్రిగా పనిచేశారు. మహాఘట్‌బంధన్‌లో విభేదాల నేపథ్యంలో కొన్ని స్థానాల్లో ఆర్‌జెడి, కాంగ్రెస్ పరస్పరం పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీ చేయగా, ఆర్‌జెడి 143 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ పరిణామంతో కూటమిలో చీలిక వచ్చిందనే వార్తలకు బలం చేకూర్చినట్లు అయ్యింది. ఈ క్రమంలో ఇరు పక్షాలు సమావేశమై తేజస్వి యాదవ్ పేరు ఖరారు చేశాయి.

# ఆసియాన్ సదస్సుకు వెళ్లని ప్రధాని

## వర్చువల్‌గా పాల్గొంటా: మోడీ

### ట్రంప్, మోడీ భేటీ లేనట్లే ..

### భారత్ ప్రతినిధిగా హాజరుకానున్న జైశంకర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** కౌలాలంపూర్‌లో ఈ నెల 26 నుంచి జరుగనున్న 22వ ఆసియాన్ శిఖరాగ్ర సదస్సుకు తాను వెళ్లడం లేదు. వర్చువల్‌గా హాజరవుతున్నట్లు ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించారు. ఆసియాన్– భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సదస్సు నేపథ్యంలో మలేషియాతోపాటూ కంబోడియాలో కూడా ప్రధాని పర్యటించాలని తొలుత భావించారు. అయితే, తాజాగా ఆయన ఈ సదస్సుకు వెళ్లకపోవడంతో.. కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. ప్రధాని మోడీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ – మోడీ భేటీ ఈసారి కూడా లేనట్లే. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ప్రధాని మోడీ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ మలేసియా వెళ్తారని, ఆసియాన్ శిఖరాగ్ర సమావేశాల్లో భారత్ తరఫున జైశంకర్ ప్రాతినిధ్యం వహిస్తారని ఈ మేరకు మలేసియాకు న్యూఢిల్లీ సమాచారం ఇచ్చింది. తాజాగా మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో ప్రధాని మోడీ సంభాషించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "నా ప్రియమైన స్నేహితుడు మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో హృదయపూర్వక సంభాషణ జరిగింది. మలేసియా ఆసియాన్ అధ్యక్షత వహించినందుకు ఆయనకు అభినందనలు.. ఆసియాన్ – భారత్ శిఖరాగ్ర సమావేశంలో వర్చువల్‌గా పాల్గొనడానికి, ఆసియాన్– భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నాను" అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. ఇక ఆసియాన్ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోడీ వెళ్లకపోవడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఆ సదస్సుకు ట్రంప్ రావడంతోనే మోడీ వెళ్లడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ విమర్శలు గుప్పించారు. ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఈ సమావేశానికి వెళ్లడం లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఏ అభ్యర్థుల తరఫున ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరి ఠాకూర్ స్వస్థలం సమస్తిపూర్ నుంచే మోడీ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. సమస్తిపూర్‌లో ప్రధాని మోడీ తొలుత కర్పూరి ఠాకూర్‌కు నివాళి అర్పించి, అనంతరం సమస్తిపూర్, బెగుసరాయ్‌లలో ఎన్నికల ర్యాలీలు చేపట్టనున్నారని బిజెపి బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ వెల్లడించారు.

# 'వికాసానికి' 'వినాశనానికి' మధ్య పోరు

### బీహార్ ఎన్నికలపై కేంద్ర మంత్రి జెపి నడ్డా తీవ్ర వ్యాఖ్యలు!

**పాట్నా, అక్టోబర్ 23:** బీహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జెపి నడ్డా పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జెడీ.. రంగ్‌దారీ, జంగల్‌రాజ్, దాదాగిరీలకు ప్రతీక అని విమర్శించారు. బీహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. తాను పాట్నాలోనే పుట్టానని, బీహార్‌లోనే 20 ఏళ్లు గడిపానని, ఆర్జేడీ చీకటి యుగం గురించి తనకు తెలుసని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, వలసలను అడ్డుకుంటామని తేజస్వీయాదవ్ ఇచ్చిన హామీలు.. భూమికి ఉద్యోగం కుంభకోణంలో ఆర్జేడీ ప్రమేయాన్ని గుర్తుచేస్తున్నాయన్నారు. మాజీ గ్యాంగ్‌స్టర్ షహాబుద్దీన్ తనయుడు ఒసామాకు రఘునాథ్‌పూర్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బీహార్ విషయంలో ఆ పార్టీకి ఎంత శ్రద్ధ ఉందో ఇది తేటతెల్లం చేస్తోందన్నారు. తేజస్వీ యాదవ్ ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని బిజెపి ఎంపి, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. 2.6 కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని తేజస్వీ చెబుతున్నారు. దీనికి రూ.12 లక్షల కోట్లు అవసరం అవుతాయి.



## భారత్‌లో 'జన్‌జెడ్' ఉద్యమాలకు
# ఛాన్స్ తక్కువే!

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** ఆసియా, ఆఫ్రికాలోని పలు దేశాల్లో జెన్‌జడ్ (1997 –2012 మధ్య పుట్టిన తరం) యువత ప్రభుత్వాలనే కూల్చేస్తుంటే, ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో మాత్రం అలాంటి వాతావరణం కనిపించడం లేదు. దేశంలో దాదాపు 37 కోట్ల మంది జెన్ జడ్ యువత ఉన్నప్పటికీ, అవినీతి, నిరుద్యోగం, అసమానతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా వారు భారీ ఉద్యమాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల నేపాల్‌లో యువత కేవలం 48 గంటల్లో ప్రభుత్వాన్ని గద్దె దించింది. బంగ్లాదేశ్, ఇండోనేషియా వంటి దేశాల్లోనూ యువతరం ఆందోళనలతో ప్రభుత్వాలు దిగివచ్చిన సంఘటనలు ఉన్నాయి. సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా వేగంగా ఏకమై, అవినీతిపై పోరాడుతూ వారు సంచలనాలు సృష్టిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ముఖ్యంగా నేపాల్ పరిణామాల నేపథ్యంలో, ఢిల్లీలో యువత ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందన్న అంచనాలతో పోలీసులు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. భారత్‌లో యువత రోడ్ల మీదకు వచ్చి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రధాన కారణం వారి మధ్య ఐక్యత లేకపోవడమే. భారత్‌లో యువత కులం, మతం, ప్రాంతం, భాష వంటి గుర్తింపులతో బలంగా ముడిపడి ఉంది. దీంతో వారి సమస్యలు, ఆకాంక్షలు కూడా వేర్వేరుగా ఉంటున్నాయని సెంటర్ ఫర్ యూత్ పాలసీకి చెందిన సుధాంశు కౌశిక్ వివరించారు. ఉదాహరణకు, తమిళనాడులో జల్లికట్టు కోసం, గుజరాత్‌లో రిజర్వేషన్ల కోసం జరిగిన నిరసనలు స్థానిక సమస్యలకే పరిమితమయ్యాయి తప్ప దేశవ్యాప్త ఉద్యమాలుగా మారలేదు. మరోవైపు, నిరసనల్లో పాల్గొంటే దేశ వ్యతిరేకులు అనే ముద్ర వేస్తారనే భయం కూడా యువతను వెనక్కి లాగుతోంది. ఈ రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఈ భయంతో చాలామంది మౌనంగా ఉంటున్నారని ఓ పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ అభిప్రాయపడ్డారు. దీనికి తోడు, ఒకప్పుడు రాజకీయ చర్చలకు కేంద్రంగా ఉన్న యూనివర్సిటీల్లో కూడా ఇప్పుడు నిరసనలపై ఆంక్షలు పెరిగాయి. ఆర్థిక ఒత్తిళ్లు కూడా యువత దృక్పథాన్ని మారుస్తున్నాయి. ఉద్యమాలు చేయడం కంటే మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడటం లేదా విదేశాలకు వలస వెళ్లడంపైనే ఎక్కువ మంది దృష్టి పెడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం కూడా మరో కారణం. 2024 ఎన్నికల్లో 18 ఏళ్ల వయసున్న వారిలో కేవలం 38శాతం మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడం దీనికి నిదర్శనం. యువతలో 29శాతం మంది రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఈ కారణాలన్నీ కలిసి, అపారమైన శక్తి ఉన్నప్పటికీ భారత జెన్‌జడ్ ఒకేతాటిపైకి వచ్చి భారీ ఉద్యమాలు చేసే అవకాశాలు ప్రస్తుతానికి తక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హెచ్-1బి వీసాపై లక్ష డాలర్ల ఫీజు తొలగించండి

### అమెరికా చట్టసభ సభ్యుల లేఖ




**వాషింగ్టన్, అక్టోబరు 23:** హెచ్-1బి వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై సొంత దేశంలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా ఈ ఫీజు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ట్రంప్, వాణిజ్య మంత్రి లుట్నిక్‌కు లేఖ రాశారు. డెమోక్రాట్లు, రిపబ్లికన్ పార్టీలకు చెందిన ఏడుగురు చట్టసభ సభ్యులు ఈ లేఖ రాశారు. హెచ్-1బి వీసా ఫీజును పెంచడం వల్ల ఆ వీసా దుర్వినియోగం ఏమాత్రం ఆగదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి బదులుగా అమెరికాలోని స్టార్టప్ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఆవిష్కరణలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. దీని కారణంగా భారత్‌తో సహా అనేక దేశాల నుంచి వచ్చిన నైపుణ్యం కలిగటిన వ్యక్తులను కోల్పోవాల్సి ఉంటుందన్నారు. హెచ్-1బి వీసా దుర్వినియోగం కాకుండా మార్పులు అవసరమని తాము కూడా భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఫీజు పెంచడం అనేది సరైన చర్య కాదన్నారు. ఇది ప్రతికూలమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. పెద్ద కంపెనీలు ఈ మొత్తాన్ని భరించగలిగినప్పటికీ.. చిన్న కంపెనీలు ఆ వీసా అభ్యర్థుల నియామకాలను నిలిపివేసుకోవాల్సి వస్తోందన్నారు. ఇదే క్రమంలో ప్రాజెక్టులు కూడా విదేశాలకు తరలి పోతాయన్నారు. అధిక నైపుణ్యం కలిగిన వలసదారులు చరిత్రాత్మకంగా అమెరికాకు బలమని వ్యాఖ్యానించారు. అమెరికన్ల స్థానంలో తక్కువ జీతంతో విదేశీయులను నియమించుకునే అవుట్‌సోర్సింగ్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అధిక నైపుణ్యం కలిగిన వలసదారులు మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో సహా అమెరికా పౌరులకు అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థను ఆధునికీకరించేందుకు అధ్యక్షుడు ట్రంప్ కాంగ్రెస్‌తో కలిసి పని చేయాలని అభ్యర్థించారు. హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, హెచ్-1బి వీసాపై వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ ఆ తర్వాత స్పష్టతనిచ్చింది. ఇక, వీసా ఫీజు పెంపుపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో.. ట్రంప్ సర్కారు మార్గదర్శకాలు జారీ చేసింది. దాని ప్రకారం.. విదేశాల నుంచి నేరుగా హెచ్-1బి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

# అత్యవసర గర్భనిరోధక పిల్స్‌కు జపాన్‌లో ఫ్రీమార్కెట్!

**టోక్యో, అక్టోబరు 23:** మహిళల ఆరోగ్య హక్కుల విషయంలో జపాన్ ప్రభుత్వం ఒక సంచలననిర్ణయం తీసుకుంది. దేశంలో మొట్టమొదటిసారిగా అత్యవసర గర్భనిరోధక మాత్రలను (మార్నింగ్‌ఆఫ్టర్ పిల్) డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా ఫార్మసీల్లో విక్రయించడానికి అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయం దేశంలోని మహిళల పునరుత్పత్తి ఆరోగ్య హక్కుల సాధనలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఆస్కా ఫార్మాస్యూటికల్ తయారు చేస్తున్న 'నార్లెవో' అనే ఈ పిల్ అమ్మకాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. అయితే, దీనిని గైడెన్స్ అవసరమైన మందుల కేటగిరీలో చేర్చారు. అంటే, ఈ మాత్రను కొనుగోలు చేసే మహిళలు తప్పనిసరిగా ఫార్మసిస్ట్ సమక్షంలోనే దాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. కాగా, ఈ పిల్ ఎప్పటి నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తుందనే తేదీని కంపెనీ ఇంకా ప్రకటించలేదు. ఈ మాత్ర కొనుగోలుకు ఎలాంటి వయోపరిమితి గానీ, తల్లిదండ్రుల అనుమతి గానీ అవసరం లేదని అక్కడి మీడియా కథనాలు స్పష్టం చేశాయి. సురక్షితం కాని లైంగిక చర్య జరిగిన 72 గంటల్లోపు ఈ మాత్రను తీసుకుంటే గర్భం దాల్చకుండా 80 శాతం వరకు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది అండం పూర్తిగా అభివృద్ధి చెందకుండా లేదా గర్భాశయానికి అంటుకోకుండా నిరోధిస్తుంది. సంప్రదాయ, పితృస్వామ్య భావజాలం బలంగా ఉన్న జపాన్‌లో మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ఔషధాలపై ఆమోదం పొందడం అంత సులభం కాదు. ప్రపంచవ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో ఈ తరహా అత్యవసర గర్భనిరోధక మాత్రలు ప్రిస్క్రిప్షన్ లేకుండా లభిస్తున్నప్పటికీ, జపాన్‌లో మాత్రం ఇన్నేళ్లుగా దీనిపై చర్చ జరుగుతూనే ఉంది.

## సంక్షిప్తంగా..

### అమెరికా ఆంక్షలపై రష్యా హెచ్చరిక



**మాస్కో, అక్టోబరు 23:** ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి తెరదించేందుకుగానూ మాస్కోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఒత్తిడిని తీవ్రతరం చేశారు. ఈ క్రమంలోనే రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు కంపెనీలు రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే.. రష్యా దీన్ని తీవ్రంగా ఖండించింది. ఈ ఆంక్షలు బెడిసికొడతాయని రష్యా విదేశాంగశాఖ ప్రతినిధి మరియా జఖరోవా హెచ్చరించారు. చర్చలు కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 'రష్యా చమురు సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు మాస్కో కన్నా.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థనే దెబ్బతీస్తాయి. జాతీయ ప్రయోజనాల విషయంలో రష్యాను రాజీ పడేలా చేయడంలో ఇటువంటి చర్యలు సఫలీకృతం కావు. పాశ్చాత్య ఆంక్షలను తట్టుకుని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నాం. ఈ విషయంలో పెద్ద అడ్డంకులేమీ లేవు. రాజకీయ దురుద్దేశ ప్రకటనల కన్నా.. దౌత్యమార్గాల ద్వారా జరగాలి.

### హాసనాంబ ఆలయంలో ఐఎఎస్ అధికారిణి నిప్పులపై నడక



**బెంగళూరు, అక్టోబరు 23:** ఓ ఐఎఎస్ అధికారిణి హాసనాంబ ఆలయంలో నిప్పులపై నడిచి తన భక్తిని చాటుకున్నారు. హాసన్ జిల్లా డిప్యూటీ కమిషనర్ కెఎస్ లతాకుమారి.. ప్రసిద్ధ హాసనాంబ ఆలయంలో జరిగిన అగ్నిగుండం (కెండోత్సవం) కార్యక్రమంలో పాల్గొని, నిప్పులపై నడిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిప్పు కణికలపై నడిచినందుకు భక్తుల నుంచి ఆమె ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. హాసనాంబ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా 'కెండోత్సవం' నిర్వహించారు. యేడాదిపాటు ఆలయ గర్భగుడిని మూసివేసే ముందు ఈ క్రతువును జరపడం ఆనవాయతీ. ఈ కార్యక్రమంలో డిసి లతాకుమారి స్వయంగా పాల్గొని, కణకణలాడే నిప్పులపై చెప్పులు లేకుండా నడిచారు. ఆమె నిప్పులపై నడుస్తున్నప్పుడు భక్తులు హర్షధ్వానాలు చేశారు.


### 55 యేళ్లుగా వీడని చిన్నారి కిడ్నాప్ మిస్టరీ



**న్యూసౌత్‌వేల్స్, అక్టోబరు 23:** ఆస్ట్రేలియాలో 55 ఏళ్లుగా మిస్టరీగా మారిన మూడేళ్ల చిన్నారి అదృశ్యం కేసులో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడిగా భావిస్తున్న వ్యక్తిపేరును ఓరాజకీయ నాయకుడు పార్లమెంటులోనే బహిర్గతం చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. 1970 జనవరి 12న వోలోంగాంగ్‌లోని ఫెయిరీ మేడో బీచ్‌లో చెరిల్ గ్రిమ్మర్ (3) అనే చిన్నారి అదృశ్యమైంది.కేసులో మెర్క్యురీ అనే మారుపేరుతో ఉన్న వ్యక్తిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నేరం జరిగినప్పుడు అతను మైనర్ కావడంతో చట్టపరంగా అతని పేరును గోప్యంగా ఉంచారు. తాజాగా, న్యూసౌత్ వేల్స్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు జెరెమీ బకింగ్‌హామ్, తనకున్న ప్రత్యేకాధికారాలను ఉపయోగించి సభలో ఈరోజు నిందితుడి అసలు పేరును వెల్లడించారు. చెరిల్ గ్రిమ్మర్ హత్యపై దర్యాప్తు జరపాలన్నారు.

# దమ్ముంటే మమ్మల్ని ఎదుర్కో

### పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు టిటిపి హెచ్చరికలు!



**ఇస్లామాబాద్, అక్టోబరు 23:** తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులు ఒకవైపు.. అఫ్ఘానిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు మరోవైపు పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇప్పుడు టిటిపి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌ను హెచ్చరించింది. దమ్ముంటే తమను ఎదుర్కోవాలని సవాల్ విసురుతూ విడియోలు విడుదల చేసింది. తమ మీదకు సిపాయిలను పంపించడం మానేసి.. ఉన్నతాధికారులే యుద్ధభూమికి రావాలని వ్యాఖ్యలు చేసింది. అలాగే ఈ నెల 8న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో దాడి జరిపిన దృశ్యాలను విడుదల చేసింది. ఒక విడియోలో కనిపించిన కమాండర్ పేరు కాజిమ్ అని పాక్ అధికారులు వెల్లడించారు. 'దమ్ముంటే మమ్మల్ని ఎదుర్కో' అని అందులో మునీర్‌ను హెచ్చరించాడు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తీసుకున్న పాక్ అధికారులు కాజిమ్ తలపై 10 కోట్ల పాకిస్థానీ రూపాయల రివార్డు ప్రకటించారు. అతడి గురించి సమాచారం ఇచ్చిన వారికి ఆ మొత్తం ఇస్తామని వెల్లడించింది. తన భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులపై అఫ్ఘానిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

సరిహద్దుల్లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలను అఫ్ఘాన్ ఖండించింది. ఆ అంశమే ఇరుదేశాల మధ్య తీవ్ర ఘర్షణలకు దారితీసింది. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో ఇటీవల పాక్ చేసిన దాడులపై అఫ్ఘాన్ ప్రతీకార దాడులు చేసింది. కొన్ని రోజుల పాటు జరిగిన ఘర్షణలకు ఖతార్ రాజధాని దోహాలో ముగింపు పడింది. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని ఖతార్ విదేశాంగ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఐక్యరాజ్యసమితిలో మరోసారి పాక్ వక్రబుద్ధి!

### ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులన్న పాక్ ప్రతినిధికి కౌంటర్



**న్యూయార్కు, అక్టోబరు 23:** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. భారత్‌పై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులను స్వాతంత్ర్య యోధులుగా చిత్రీకరించి, వారి చర్యలను సమర్థించేందుకు విఫలయత్నం చేసింది. పాక్ కుట్రలను భారత్ తీవ్రంగా తిప్పికొట్టింది. ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్థానే కేంద్ర స్థానమని, దాని ద్వంద్వ నీతి, కపట వైఖరి మరోసారి బట్టబయలయ్యాయని ఐక్యరాజ్యసమితి వేదికగా గట్టిగా నిలదీసింది. సమితి సాధారణ సభలోని మూడో కమిటీ బుధవారం ఉగ్రవాద నిరోధక చర్యలపై చర్చ నిర్వహించింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రతినిధి ముహమ్మద్ జావేద్ అజ్మల్ మాట్లాడుతూ, విదేశీ ఆక్రమణను ఎదిరించే ప్రజల హక్కును, ఉగ్రవాదాన్ని వేరుగా చూడాలని వాదించారు. అంతర్జాతీయ చట్టాలు, సమితితీర్మానం 46/51 కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తప్పుడు వాదనలు వినిపించారు. పాకిస్థాన్ వాదనను భారత ప్రతినిధి, ఫస్ట్ సెక్రటరీ రఘూ పురి తీవ్రంగా ఖండించారు. మానవత్వానికే పెను ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని సమర్థించడం సిగ్గుచేటని అన్నారు. "ఉగ్రవాదం అనేది మానవత్వపు మూలాలపై దాడి చేసే అత్యంత ఘోరమైన నేరం. పాకిస్థాన్ ద్వంద్వ నీతి, కపటత్వం ప్రపంచానికి తెలుసు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఎన్నో ఉగ్రదాడులతో పాకిస్థాన్‌కు సంబంధాలున్నాయి. అలాంటి దేశం ఉగ్రవాదానికి కేంద్ర స్థానంగా మారింది" అని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్ తప్పుగా ఉటంకించిన అంతర్జాతీయ చట్టాల గురించి వివరిస్తూ, ఐరాస ప్రకటన రాజకీయ కారణాలతోభయభ్రాంతులకు గురిచేసే చర్య ఉగ్రవాదమే.

# రూ.79వేల కోట్ల రక్షణరంగ ప్రతిపాదనలకు ఆమోదం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23:** భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రూ.79,000 కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డిఎసి) సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలుఆమోదించారు. ఫలితంగా భారత సైన్యం, నావికాదళం, వాయుసేనల యుద్ధ సామర్థ్యాన్ని ఇది గణనీయంగా పెంచేందుకు తోడ్పడుతుంది. ఈ కార్యాచరణతో భారత సైన్యానికి నాగ్ మిస్సైల్ వ్యవస్థ ఎంకె-2 నామిస్, గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఇఎల్ఐఎన్‌టి సిస్టమ్‌లు (నామిస్) అందుబాటులోకి వస్తాయి. నామిస్ శత్రు యుద్ధ వాహనాలు, బంకర్ల వంటి, దుర్భేద్యమైన నిర్మాణాలను సైతం విధ్వంసం చేసే సామర్థ్యం భారత్ కలిగి ఉంటుంది. అంతేకాదు జిబిఎంఇఎస్ 24 గంటల ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్, టాక్టికల్ సమాచార సేకరణకు కూడా ఈ నిధులు సహాయపడతాయి. అలాగే, డైవర్స్ టెరైన్‌లలో లాజిస్టిక్స్ మద్దతును మెరుగుపరచడానికి హైమొబిలిటీ వెహికల్స్ (క్రేన్‌లు) కూడా ఈ కొనుగోళ్ల జాబితాలో చేర్చారు.నావికాదళానికి ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్‌లు (ఎల్పీడీ) 30 మి.మీ. నావల్ సర్ఫేస్ గన్‌ల కొనుగోళ్లకు ఆమోదం లభించింది. ఎల్పీడీలు సైన్యం, వాయుసేనతో కలిసి జాయింట్ అంఫిబియస్ అసాల్ట్ ఆపరేషన్‌లకు, శాంతి స్థాపన, మానవతా సహాయం, విపత్తు నివారణలకు ఇవి ఉపయోగపడతాయి.

ఇక, 30 మి.మీ. గన్‌లు తక్కువ తీవ్రత కలిగిన మారిటైమ్, యాంటీపైరసీ ఆపరేషన్‌లకు సహాయపడతాయి. డిఆర్‌డిఒ నావల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లాబ్ అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ లైట్‌వెయిట్ టార్పెడోలు సాంప్రదాయ, న్యూక్లియర్, మిడ్జెట్ సబ్‌మెరైన్‌లను కూడా అందుబాటులోకి తెచ్చుకోవచ్చు. మరోవైపు, 76 మి.మీ. సూపర్ ర్యాపిడ్ గన్ మోంట్ కోసం స్మార్ట్ అమ్యూనిషన్, ఎలక్ట్రోఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సిస్టమ్ కూడా మన రక్షణ వ్యవస్థలోకి చేరతాయి.

### దేశరాజధానిలో నలుగురు బీహారీ గ్యాంగ్‌స్టర్ల ఎన్‌కౌంటర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** దేశ రాజధాని ఢిల్లీలో తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెద్ద కుట్రకు పథకం రచిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లను పోలీసులు మట్టుబెట్టారు. ఢిల్లీ, బీహార్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. వాయవ్య ఢిల్లీలో తెల్లవారుజామున 2:20 గంటల సమయంలో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీలో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్లను అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే రోహిణిలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరణించిన వారిని సిగ్మా గ్యాంగ్‌కు చెందిన రంజన్ పాఠక్ (25), బిమ్లేష్ మహ్తో (25), మనీష్ పాఠక్ (33), అమన్ ఠాకూర్ (21)గా గుర్తించారు.



## గుల్బర్గా- బెంగళూరు మధ్య
# ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 23 ప్రభాతవార్త: ప్రస్తుత పండుగల సీజన్‌లో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ రాయలసీమ జిల్లాల మీదుగా గుల్బర్గా నుంచి బెంగళూరు కంటోన్మెంట్‌కు ప్రత్యేక రైలు సర్వీసును నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. గుల్బర్గా నుంచి బెంగళూరు కంటోన్మెంట్ వెళ్ళే నెంబర్ 06558 ప్రత్యేక రైలు ఈనెల 24న, శుక్రవారం ఉదయం 0935 గంటలకు గుల్బర్గా నుంచి బయలుదేరి, షాహ్‌బాద్ 10:00/02, యాద్గిర్ 10:38/48, క్రిష్ణా 11:20/30, రాయచూరు 11:53/55, మంత్రాలయం 12:18/20, ఆదోని 12:53/55, గుంతకల్లు మధ్యాహ్నాం 02:00/05, అనంతపురం 03:03/05, ధర్మవరం 03:35/40, హిందూపురం సాయంత్రం 04:50/52, యలహంక 06:08/10, బెంగళూరు కంటోన్మెంట్‌కు రాత్రి 08:30 గంటలకు చేరుకుంటుంది.

## నేటి నుంచి రైల్వే ట్రాక్ వేగ నిర్ధారణ పరీక్షలు

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 23 ప్రభాతవార్త: రాయలసీమ జిల్లాలలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో పలు సెక్షన్లలో రైళ్ల గరిష్ట వేగాన్ని పెంచేందుకు రైలుమార్గం పటిష్టత, సామర్థ్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈనెల 24న శుక్రవారం గుంతకల్లు -గూళ్యపాలెం- కల్లూరు, గుంతకల్లు- బళ్ళారి మధ్య, 28న మంగళవారం ధర్మవరం- పాకాల, పాకాల- కాట్పాడి, తిరుపతి- రేణిగుంటల మధ్య, 29న బుధవారం గూడూరు- రేణిగుంటతిరుపతి- పాకాల మధ్య, 30న గురువారం గుంతకల్లు- నంద్యాల మార్గాలలో ప్రస్తుతం ఎగువ, దిగువ రైలుమార్గంలో ఉన్న రైళ్ళ గరిష్ట వేగం 110 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెంచేందుకు ముందుగా రైలుట్రాక్ సామర్థ్యాన్ని పరిశీలించి, నిర్ధారించే క్రమంలో ప్రత్యేక బోగీలో అమర్చిన ఓఎంఎస్ యాంత్ర సహాయంతో రైలుమార్గం సామర్థ్యాన్ని నిర్ణయించేందుకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ట్రాక్ ఇంజనీర్, సంబంధిత అధికారులు ప్రత్యేక రైలులో పర్యటించి గరిష్ట వేగాన్ని నిర్ణయించి పై అధికారులకు నివేదిస్తారు. ఈ నివేదిక ఆధారంగా సంబంధిత ఉన్నతాధికారులు ఆయా సెక్షన్లలో రైళ్ల గరిష్ట వేగాన్ని పెంచేందుకు నిర్ణయం తీసుకుంటారు.

# పుట్టగొడుగుల పరిశోధన కేంద్రంగా శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల

- పుట్టగొడుగుల ఉత్పత్తిని పెంచడానికి ఎపి అనుకూలం
- పుట్టగొడుగులు మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు
- జాతీయ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వి.పి శర్మ



తిరుపతి విద్య, అక్టోబరు 23 ప్రభాతవార్త: భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో జాతీయ పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం ద్వారా శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకంపై 2014 సంవత్సరం నుంచి పరిశోధన నిర్వహిస్తున్నట్టు ఎన్జీరంగా వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. పుట్టగొడుగుల జాతీయ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వి.పి శర్మతో కలిసి తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల నందు ఏర్పాటుచేసిన పుట్టగొడుగుల పరిశోధన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ 2014 సంవత్సరం నుంచి ఈ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు, యువకులకు గ్రామీణ మహిళలకు శిక్షణతో పాటు స్వయం ఉపాధిగా పుట్టగొడుగుల పెంపకాన్ని ఎంచుకున్న యువతకు సలహాలు సూచనలు అందిస్తున్నామని తెలిపారు. పుట్టగొడుగులలో 35 శాతం ప్రోటీన్ ఉంటుందని, మన రాష్ట్రంలో బటన్ ఆయిస్టర్ పాల పుట్టగొడుగులను ఎక్కువగా వాడుతున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టగొడుగుల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని, యువత ఈ రంగంలో స్వయం ఉపాధి పొందడంతో పాటు దీనిని ఒక వ్యాపారంగా నిర్వహించడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. ఇక్కడి పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం నందు విత్తన ఉత్పత్తి (స్పాన్) కూడా చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలియజేశారు.

అనంతరం జాతీయ పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం, సోలాన్, హిమాచల్ ప్రదేశ్, డైరెక్టర్ డాక్టర్ విపి శర్మ మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుతం సంవత్సరానికి నాలుగు లక్షల టన్నుల పుట్టగొడుగుల ఉత్పత్తి జరుగుతున్నదని వివరించారు. పుట్టగొడుగుల ఉత్పత్తిని పెంచడానికి వాతావరణ పరంగా ఆంధ్ర రాష్ట్రం ఎంతో అనుకూలమైనదని తెలిపారు. ఈ సాగును చేపట్టడానికి అధిక స్థలం అవసరం లేదని, తక్కువ పెట్టుబడితో వ్యవసాయ వ్యర్థాలను వినియోగించుకొని స్వయం ఉపాధిగా చేపట్టవచ్చని పేర్కొన్నారు. ఈ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా పుట్టగొడుగులకు ఉన్న గణనీయమైన పోషక విలువల కారణంగా ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు విటమిన్ బి 12, డి విటమిన్ పుష్కలంగా ఉండాయన్నారు. కొన్ని రకాల పుట్టగొడుగులకు ఉన్న ఔషధ గుణాల వలన ఆంధ్రప్రదేశ్‌లో పుట్టగొడుగుల సాగుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, అందువలన తిరుపతి వ్యవసాయ కళాశాల నందు గల స్వచ్ఛంద పరిశోధనా కేంద్రాన్ని ప్రధాన పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనను సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పుట్టగొడుగులపై జరుగుతున్న పరిశోధనలను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి సుమతి, అధ్యాపక పరిశోధన సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్.ఆర్.శంకరన్ విధానాలు అనుసరణీయం

విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: ఉన్నతాధికారి హోదాలో ఎస్.ఆర్.శంకరన్ అమలు చేసిన పలు విప్లవాత్మక విధానాలు సామాజిక అసమానతల తొలగింపునకు దోహదం చేశాయని పలువురు వక్తలు కొనియాడారు. అటువంటి మహోన్నతమైన అధికారిని స్మరించుకోవడం ద్వారా నేటితరం స్ఫూర్తిపొందాలన్నారు. నిరంతరం ప్రజా సేవలోనే ఉంటూ పేదల కోసం పరితపించిన శంకరన్ అందరికీ ఆదర్శప్రాయులని పలువురు వక్తలు అన్నారు. పేదల అభ్యున్నతికి ఎన్నో చట్టాలు, పథకాలను రూపొందించిన మాజీ ఐఎఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ 91వ జయంతి విజయవాడ బిఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ ఐక్యతా భవన్‌లో ఘనంగా జరిగింది. ఎస్.ఆర్.శంకరన్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐఎఎస్ అధికారులు, ప్రజాప్రతి నిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని శంకరన్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాకి సునీత, ఎస్‌సి కమిషన్ కార్యదర్శి చినరాముడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షుడు విద్యా సాగర్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొలనుకొండ శివాజీ, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కె.సుబ్బారావు, బుట్టి రాయప్ప, సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇక రిటైర్డు ఐఎఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ జయంతి సభ నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాలలో మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన జరిగింది. ఈ కార్యక్రమంలో కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎం.విజయానంద్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్ర కుమార్, బెంగుళూరు ఎస్ఎస్ఎల "ఐయు విజిటింగ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ పి.ఎం.సౌజన్య, రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ చక్రపాణి, లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ జి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణముఖి పరవళ్లు



శ్రీకాళహస్తి, అక్టోబరు 23 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో తల్లడిల్లుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇక శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. గురువారం మల్లిమడుగు రిజర్వాయర్ నిండటంతో ముందుజాగ్రత్తగా గేట్లు ఎత్తివేయటంతో స్వర్ణముఖిలో వరద ఉధృతి పెరిగింది. శ్రీకాళహస్తీశ్వరుని ఆలయానికి సమీపంలో స్వర్ణముఖి నది వంతెనను తాకుతూ పరుగులు తీస్తుంది. 7316 క్యూసెక్కులు నీరు ప్రవహిస్తోంది. అయితే సుమారు 10,800 ఎకరాలకు అధికారికంగా సాగునీరు అందిస్తున్న చెంబేడు కాలువకు నీటిని సరఫరాను ఆపివేసినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. గురువారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలసి ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో తుపాను తాకిడి ప్రాంతాల్లో పర్యటించారు. చెరువుల్లో చేరిన నీరు వృధా పోకుండా కాపాడుకోవాలని సూచించారు.

# కుట్రలతో రాష్ట్రాభివృద్ధిని ఆపలేరు

## ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, అక్టోబరు 23 ప్రభాతవార్త: వైఎస్సార్సీ నేతలు కుట్రలు, అబద్ధాలతో రాష్ట్రాభివృద్ధిని ఆపలేరని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కడ సభ్యులు రాజ్‌కుమార్, రామచంద్ర, సుగుణమ్మ, వెంకీ, పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్, ఉదయ్, సుబ్బులతో కలసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ మద్యంపై వైఎస్సార్సీ నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లేనన్నారు. మద్య నిషేధం అంటూ అధికారంలో వచ్చిన మాజీ సిఎం జగన్, మద్యం ఆదాయాన్నే ప్రధాన వనరుగా మార్చేశారన్నారు. వేల కోట్లు పోగేసుకున్నారన్నారు. వైఎస్సార్సీ హయాంలో నకిలీ మద్యం ధాటికి 30వేల మంది మంది ప్రాణాలు కోల్పోయారనేది నిజం కాదా అని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు ప్రపంచ దేశాల్లో ఎపి బ్రాండ్‌ను ఎగరేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్సీ నేతలు ఏమీ చేయలేరని పేర్కొన్నారు. 2029లో సైతం కూటమి ప్రభుత్వం మరలా అధికార ంలో రావడం తథ్యమన్నారు. ఇప్పటికే మద ్యం కేసులో ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి జైలుకు వెళ్లారన్నారు. ములకలచెరువు ఘటనలో నిందితుడు జనార్ధనరావు మాజీ మంత్రి జోగి రమేష్‌కు సన్నిహితుడని పేర్కొన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్రప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు, జగన్ పాలనలపై ప్రజలు ఇప్పటికే అవగాహనకు వచ్చారన్నారు. వైఎస్సార్సీకి 11సీట్లు వచ్చినా వారిలో ఇంకా మార్పురాలేదని పేర్కొన్నారు. సమావేశంలో నేతలు డా॥ వెంకటేష్, మణి, వాసు, బాలకృష్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## నేరెళ్ళవాగులో వ్యక్తి గల్లంతు

జలదంకి (నెల్లూరు), అక్టోబరు 23 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా జలదంకి మండలం చామదల నేరెళ్ళవాగులో గ్రామానికి చెందిన దంపూరి మల్లికార్జున (45) గురువారం గల్లంతయ్యాడు. గ్రామస్తుల కదనంమేరకు మల్లికార్జున ప్రతిరోజు కావలికి కూలి పనులకై వెళుతుంటాడు. ఆ క్రమంలో ఉదయం తనకు చెందిన బైక్‌పై కిలోమీటరు దూరంలోవున్న వాగువద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో వాగు చప్టాపై కొద్దిపాటి నీరుపారుతుంది. దీంతో దాటి పోవచ్చులే అనుకొని బైక్‌ను కొద్దిదూరం పోనిచ్చాడు. అలాగే వెళ్తుండగా బైక్ అదుపుతప్పి చప్టా పైనుంచి వాగులోకి కొట్టుకుపోయాడు. గమనిస్తున్న కొంత మంది రక్షించే ప్రయత్నం చేశారు. అయితే వారి ప్రయత్నం విఫలమైంది. మల్లికార్జున గల్లంతైన విషయం గ్రామంలో దావనంలా వ్యాపించింది. అందరు పరుగున వాగువద్దకు చేరుకున్నారు. అదికారులకు సమాచారమందించారు. తహసీల్దార్ ప్రమీల, ఎంపిడిఒ బ్రహ్మయ్య, ఎస్ఐ లతీవున్నీషలు వాగువద్దకు చేరుకున్నారు. సంఘటనపై ఆరాతీశారు. రిస్క్యూ టీమ్‌ను రప్పించి గాలించారు. మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టమ్ నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా కుటుంబ యజమాని అకాల మృత్యువాత పడడంతో భార్య, పాపతో పాటు బంధువర్గాలు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## విద్యుదాఘాతానికి ఐదు గేదెలు మృతి

చేజర్ల (నెల్లూరు), అక్టోబరు 23 ప్రభాతవార్త: మండలకేంద్రమైన చేజర్లలలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలంలో విద్యుత్ తీగ తెగిపడి విద్యుత్ ఘాతానికి ఐదు గేదెలు మృతి చెందాయి. భాదితరులు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా చేజర్ల గ్రామానికి చెందిన మద్దిరెడ్డి శారదా అనే మహిళ రైతు మేత కోసం పొలానికి తొలుకొని వెళ్ళడంతో పొలంలో విద్యుత్ తీగ తెగి పడింది. ఆ తీగలో విద్యుత్ సరఫరా కావడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. బాధితురాలు ఈమేరకు చేజర్ల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. గేదెలు తమ కుటుంబానికి ఆధారంగా ఉండడంతో అవి మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని కోరారు. ఈవిషయంపై విద్యుత్‌శాఖ ఏఇ లిఖిత్‌రెడ్డిని ప్రభాతవార్త వివరణ కోరగా వర్షాల కారణంగా విద్యుత్ లైన్ తెగిపోవడంతో, అదే సమయంలో గేదెలు పొల్లాలోకి వెళ్ళడంతో ఐదు గేదెలు మృతి చెందాయని తెలిపారు.



## జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు
### ఖండించిన అనంతపురం రేంజ్ డీఐజీ

అనంతపురం, అక్టోబరు 23 ప్రభాతవార్త బ్యూరో: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి. ప్రభాకర్ రెడ్డి ఏఎస్‌పీ రోహిత్ కుమార్ చౌదరిపై చేసిన అవమానకర, అనుచిత వ్యాఖ్యలను అనంతపురం రేంజ్ డిఐజి డా. షిముసి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తాము అఖిల భారత సర్వీసు సభ్యులం, తమకు దేశం సేవ, భారత పౌరుల సేవ చేయడమే ప్రధాన ధ్యేయం. మతం, ప్రాంతం, కులం, వర్ణం మొదలైన వాటి తేడాలు మా సేవా ధోరణిని ఏమాత్రం ప్రభావితం చేయవు అని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మా విధి నిర్వహణలో ఎటువంటి ఆటంకం కలిగించవనీ, మా నిబద్ధతను లేదా మనోధైర్యాన్ని దెబ్బతీయవనీ తెలిపారు. రాజ్యాంగం మరియు దేశములోని చట్టాలు మా దృష్టిలో అత్యున్నతమైనవనీ, మా చర్యలే మాటలకంటే బలంగా మాట్లాడతాయనీ పేర్కొన్నారు. ఒక ఐపీఎస్ అధికారి లేదా ఏ ప్రభుత్వ ఉద్యోగిని, అవమానకర భాషలో సంబోధించడం పరిపాలనా ప్రమాణాలకు విరుద్ధమని డిఐజి పేర్కొన్నారు. "పోలీసు శాఖ ప్రజా శాంతి, భద్రత మరియు చట్టస్వతంత్రత కాపాడటానికి నిరంతరం కృషి చేస్తుందనీ, ఈ విధమైన వ్యాఖ్యలు ప్రజలకు మా సేవా భావం మరియు నిబద్ధతను ఏమాత్రం ప్రభావితం చేయవనీ పేర్కొన్నారు. తాము తమ పోలీస్ విధులను నిబద్ధతతో, నిష్పాక్షికంగా కొనసాగిస్తాము" అని డిఐజి వెల్లడించారు.

# జెసి వర్సెస్ పోలీస్ వార్

- తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌పై జెసి ప్రభాకర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- ఎస్పీ, డిఐజి సీరియస్
- ఎస్పీని కలిసేందుకు వచ్చిన జెసి ప్రభాకర్‌రెడ్డి



అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం, అక్టోబరు 23 ప్రభాతవార్త బ్యూరో: పోలీసుల అమరవీరుల దినోత్సవ పురస్కారాల సందర్భంగా ఈ నెల 21వ తేదిన టిడిపి నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వివాదాన్ని రేపాయి. జెసి వర్సెస్ పోలీస్ అధికారుల వార్‌గా తయారైంది. తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌కు జిల్లా పోలీసు అధికారుల సంఘం, జిల్లా ఎస్పీ జగదీష్, అనంతపురం డిఐజి షిమోసి అండగా నిలిచారు. ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను జిల్లా ఎస్పీ, అనంతపురం రేంజ్ డిఐజి తీవ్రంగా ఖండించారు. జెసి ప్రభాకర్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తున్నామని, న్యాయ నిపుణులతో చర్చిస్తామని జిల్లా ఎస్పీ జగదీష్ ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా గురువారం అనంతపురం ఎస్పీ జగదీష్‌ను కలిసేందుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

వివరాల్లోకి వెళ్తే ఈ నెల 21వ తేదిన జిల్లా పోలీసు అమరవీరుల దినోత్సవం రోజు తాడిపత్రిలో ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరి విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి తాడిపత్రి ప్రాంతంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవడం వల్లే అసాంఘీక కార్యకలాపాలు తగ్గాయని, శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, రౌడీ మూకల చర్యలను కఠినంగా అణచివేస్తామని ఏఎస్‌పి వివరించారు. అదేరోజు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి స్పందిస్తూ.. తాడిపత్రి ప్రాంతంలో శాంతి భద్రతలు అదుపులో ఉండేందుకు ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చేసిందేమీ లేదన్నారు. అంతేగాకుండా ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌పై పత్రికల్లో రాయలేని విధంగా జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యానిస్తూ తీవ్రంగా విమర్శించారు. ఈ సంఘటన పోలీసు వర్గాల్లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. ఈ సంఘటన జరిగిన మరుసటి రోజు 22న అనంతపురంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు సాకే త్రిలోక్‌నాథ్, జాఫర్ తదితరులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి జెసి ప్రభాకర్‌రెడ్డి బేషరతుగా ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుల అమరవీరుల దినోత్సవం రోజు పోలీసులను కించ పరిచే విధంగా జెసి ప్రభాకర్‌రెడ్డి ఒక ఐపిఎస్ అధికారిని మాట్లాడటం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పోలీసు శాఖకు మంచి పేరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటుంటే జెసి ప్రభాకర్‌రెడ్డి ఇలా మాట్లాడటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా ఈనెల 22న తాడిపత్రిలో జిల్లా పోలీసు అధికారుల సంఘాన్ని ప్రశ్నిస్తూ, ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చర్యలను విమర్శిస్తూ తాడిపత్రి టిడిపి నాయకులు, కౌన్సిలర్లు విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఖండించారు. పోలీసు అధికారుల సంఘం తీరుపై విమర్శలు గుప్పించడంతోపాటు తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరికి ఎందుకు క్షమాపణ చెప్పాలని తాడిపత్రి టిడిపి నాయకులు ప్రశ్నించడం జరిగింది. ఈ నేపథ్యంలో అదే రోజున గుత్తి పోలీస్‌స్టేషన్ తనిఖీకి వెళ్లిన అనంతపురం ఎస్పీ డి.జగదీష్ వద్ద విలేకర్లు తాడిపత్రి విషయాన్ని ప్రస్తావించగా జెసి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, చట్టపరంగా చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం రేంజ్ డిఐజి షిమోసి కూడా ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించడం గమనించ దగ్గ విషయం. ఈ నేపథ్యంలో తాడిప్రతిలో మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరి మధ్య నెలకొన్న వివాదం జెసి వర్సెస్ పోలీస్ అధికారుల వార్‌గా తయారైంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

# గాజుల అలంకరణతో దుర్గమ్మ అనుగ్రహం




గాజుల అలంకరణలో దుర్గమ్మవారిని దర్శించుకుంటున్న చైర్మన్ దంపతులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 ప్రభాతవార్త: శ్రీ కనకదుర్గ అమ్మవారు సుమంగళి చిహ్నమైన గాజుల అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రాంగణమంతటా 4,31,932 గాజులతో చూడముచ్చటగా అలంకరించడంతో దేదీప్యమాన శోభతో వెలుగొందుతున్న శ్రీ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. వర్ణమయ గాజుల అలంకరణలో దుర్గమ్మవారి ఆలయం ఇంద్రధన్సులా వెలుగులీనింది. ముందుగా ఇఓ దంపతులు, చైర్మన్ దంపతులు, పాలకమండలి సభ్యులు గాజుల ఉత్సవ పూజాదికాల్లో పాల్గొన్నారు. శుక్ర, శనివారాల్లో కూడా ఆలయమంతా గాజుల అలంకారం వుంచుతామని, శ్రీ అమ్మవారికి మాత్రం అలంకారం వుండదని ఇఓ వికె శీనా నాయక్ ఈ సందర్భంగా తెలిపారు. 300 మంది సేవాదారులు భక్తులకు ఈ ఉత్సవంలో సేవలందించారని వారి సేవలను ఇఓ ప్రస్తుతించారు. గాజులు సమర్పించిన దాతలను కూడా ఆయన ప్రస్తుతించారు. ఉత్సవం సందర్భంగా ఆలయంలో పెరిగిన భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఇఓ వికె శీనా నాయక్ అధికారులకు సూచనలు చేస్తూ చర్యలు తీసుకున్నారు.




## వేదోక్తంగా సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 ప్రభాతవార్త: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

## వేదోక్తంగా కార్తీకమాస పూజలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు.



గాజుల అలంకరణలో దేదీప్యమానశోభతో భక్తులను అనుగ్రహిస్తున్న దుర్గమ్మ



బస్టాండ్‌లో నిలిచిన వరదనీరు

# కుండపోత వర్షం

## లోతట్టు ప్రాంతాలు జలమయం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 23 ప్రభాతవార్త: అంబాజీపేట మండలంలో గురువారం ఉదయం నుండి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు జనజీవనం పూర్తిగా స్తంభించింది. గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు కొబ్బరి తోటలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలకు ప్రజలు బయటకు రాకపోవడంతో రోజువారి వ్యాపారాలు స్తంభించాయి. భారీ వర్షాలకు తోడు గాలులు లేకపోవడంతో కొంతవరకు ఉపశమనం కలిగింది. దీంతో అరటి వంటి ఉద్యాన పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా వేసిన ఉద్యాన పంటలు నీట మునగడంతో చాలా వరకు నష్టమేనని రైతులు చెబుతున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నాం మూడు గంటల వరకు కురిసిన భారీ వర్షానికి రహదారిపై వెళ్లే వాహనదారులకు ఎదుటి నుండి ఏమొస్తుందో కనిపించని చీకటి కమ్మేయడంతో తమ వాహనాలను రహదారి పక్కకు నిలిపి ఉంచారు. గురువారం రాత్రి వరకు ఒక మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది.

# వరదలపై నిరంతరం సమీక్ష

● ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు ● వచ్చే వారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ● అధికారులను అప్రమత్తం చేశాం: హోంమంత్రి వంగలపూడి అనిత



విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో భారీ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేసినట్లు రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ముంపు ప్రమాదం, ఇతర ఇబ్బందులు ఉండే ప్రాంతాల నివాశితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చినట్లు మంత్రి తెలిపారు. వరదలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నట్లు మంత్రి వివరించారు. విజయవాడలో అనిత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు మునిగే అవకాశం ఉండటంతో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో డ్రైనేజీలను క్లియర్ చేసి వర్షపు నీరు సకాలంలో వెళ్లేలా చూడాలని, ఇరిగేషన్ అధికారులు కట్టల వెంబడి ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే వారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున మొత్తం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. పిడుగులతో కూడిన వర్షాలు పడేటప్పుడు రైతులు పంట పొలాల్లో ఉండరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఇచ్చిన సమాచారం ప్రకారం, ఉత్తర అంతర్గత తమిళనాడు మరియు పరిసర ప్రాంతాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ, ఇవాళ అల్పపీడనంగా బలహీనపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడవచ్చు. మిగతా జిల్లాల్లో కూడా కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు సంభవించే అవకాశం ఉంది. ప్రజలు చెట్ల క్రింద నిలబడకూడదని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

### ప్రజలకు రక్షణ కల్పిస్తాం

#### మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ప్రకాశం జిల్లాలో భారీ వర్షాల పరిస్థితిపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి కలెక్టరేట్ నుండి మండల స్థాయి స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పరిస్థితులు, సన్నద్ధతపై వివరాలు పరిశీలించి, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అవాంఛనీయ పరిస్థితులు జరగకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు వర్ష ప్రభావిత మండలాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని, వాగులు పొంగుతున్న ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు అనిత తెలిపారు.

# బంగ్లాదేశ్ నేవీ దళానికి చిక్కిన మత్స్యకారులు

## స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు



విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: సముద్రంలో చేపలవేటకు వెళ్ళి, పొరపాటున బంగ్లాదేశ్ నేవీకి చిక్కిన విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులను దేశానికి తిరిగి తీసుకువచ్చే చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసింది. బంగ్లాదేశ్ నావికాదళం మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం అందిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖతో నిరంతరం సమన్వయం చేస్తూ, ఈ విషయంలో న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ద్వారా అధికారిక చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ బి.శ్యామ్‌ని సంప్రదించి, కేసు పురోగతిపై వివరాలు తెలుసుకుంది.

ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, మత్స్యకారులపై బంగ్లాదేశ్‌లో చార్జిషీట్ దాఖలు కాగా ఢాకాలోని భారత హైకమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ బృందం మత్స్యకారులకు చట్టపరమైన సహాయాన్ని అందిస్తూ, వారి విడుదలకు కృషి చేస్తోంది. వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడంతో పాటు, బంగ్లాదేశ్ రాయబార కార్యాలయాన్ని కూడా సంప్రదించి అవసరమైన సహకారాన్ని అందించాలని ప్రభుత్వం కోరింది. విజయనగరం జిల్లాలోని బాధిత మత్స్యకార కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సంప్రదిస్తూ, వారికి అన్ని రకాల సహాయాన్ని అందించడానికి కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కేంద్ర ప్రభుత్వంతో పాటు, విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారులను సైతం నిరంతరం సంప్రదిస్తూ, మత్స్యకారులను త్వరితగతిన క్షేమంగా దేశానికి రప్పించేందుకు అవసరమైన అన్ని రకాల ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మత్స్యకారులను రప్పించేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్‌తో మాట్లాడి, మత్స్యకారులను త్వరగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మత్స్యకారుల యోగ క్షేమాలను తెలుసుకున్నారు. వారితో శాటిలైట్ ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కాగా జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం ఆర్డీఓ డి.కీర్తి విశాఖపట్నం వెళ్లి, బాధిత మత్స్యకార కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పారు. మత్స్యకారులను తిరిగి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. బాధిత కుటుంబాలను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్కెట్ఫెడ్ చైర్మెన్ కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కలిసి, ధైర్యం చెప్పారు.

# యేడాది ఆఖరులో అమెరికా బ్లూబర్డ్ శాటిలైట్ ప్రయోగం!

## ఇస్రో చైర్మన్ డా.వి.నారాయణన్

**బెంగళూరు, అక్టోబరు 23:** భారత అంతరిక్ష పరి శోధన సంస్థ (ఇస్రో) మరో ప్రధాన వాణిజ్య ప్రయోగానికి సిద్ధమవుతోంది. అమెరికాతో అంత రిక్ష సహకారంలో భాగంగా, ఆ దేశానికి చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ అభివృద్ధి చేసిన 'బ్లూబర్డ్6' అనే భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. భారతదేశపు అత్యంత శక్తిమంతమైన ఎల్వీ ఎం3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనుండటం విశేషం. ఈ ప్రయోగానికి సంబంధిం చిన వివరాలను ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారా యణన్ గురువారం వెల్లడించారు. "బ్లూబర్డ్6 ఒక కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇప్పటికే ఆ శాటిలైట్ అమెరికా నుంచి మా వద్దకు చేరింది. రాకెట్ అనుసంధాన పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ యేడాది చివరిలోగా ప్రయో గాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రయోగ తేదీని సరైన సమయంలో ప్రధానమంత్రి ప్రకటిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలే నాసాఇస్రో సంయుక్తంగా చేపట్టిన నిసార్ మిషన్ విజయవంతమైన నేపథ్యంలో, ఈ తాజా ప్రయోగం ఇరుదేశాల మధ్య అంతరిక్ష భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనుంది. ఈ సందర్భంగా ఇస్రో చేపడుతున్న ఇతర ప్రాజెక్టుల గురించి కూడా నారాయణన్ మాట్లాడారు. దేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర ఖిగగన్‌యాన్ఖి మిషన్‌కు సంబంధించి దాదాపు 85 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు.

# కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

● గూగుల్‌పై జగన్ మాటలను అతని కుటుంబం కూడా నమ్మదు ● మంత్రి అనగాని సత్యప్రసాద్



గుంటూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి రెండు గంటల సేపు ప్రెస్‌మీట్ పెట్టి ఒక్క ఆధారం చూపకుండా రాష్ట్ర ప్రజల సమయాన్ని వృథా చేశారని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. అందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు. నిజం చెపితే తల వెయ్యి చెక్కలు అవుతుందని జగన్‌కు శాపం ఉన్నట్లు ఉందని అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి జీవితమంతా అబద్ధాలు చెప్పడంతోనే సాగిందని, వైసీపీ పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టిన పార్టీ అని తీవ్రంగా విమర్శించారు. లండన్ నుంచి వచ్చి బెంగళూరులో విశ్రాంతి తీసుకుని, పార్ట్ టైం విజటర్ లా తాడేపల్లికి వచ్చి, ఒక్క ఆధారం కూడా లేకుండా ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్టును రెండు గంటలు చదివారని ఎద్దేవా చేశారు. గూగుల్ తీసుకురావడంలో తమ ప్రమేయం ఉందని చెప్పుకోవడం హాస్యాస్పదమని, ఈ మాటలు ఆయన కుటుంబ సభ్యులు కూడా నమ్మరని విమర్శించారు.

గత ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యం తయారు చేస్తూ సొమ్ము చేసుకున్నారని, దీని కారణంగా దాదాపు 30 వేల మంది మరణించారని, 3 లక్షల మంది ఆసుపత్రి పాలయ్యారని నివేదికలు ఉన్నాయని ఆధారాలతో సహా చూపిస్తున్నామని తెలిపారు. కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్మోహన్ రెడ్డి అని ఘాటుగా విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలపై కోపం ఉందని, పెట్టుబడులు, ఉద్యోగాలు రాకుండా రాష్ట్రంలో అనిశ్చితిని సృష్టించేందుకు అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నామని, తప్పు చేసిన జయచంద్రా రెడ్డి, జనార్ధన్ రావు ఎవరైనా శిక్షార్హులేనని అని అన్నారు. రేపల్లెలో జూదంపై 2022లో తాను అప్పటి సీఎం జగన్ కు లేఖ రాస్తే ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. రేపల్లె నియోజకవర్గ ప్రజలు తనను కుటుంబ సభ్యుడిగా చూస్తారని, 'రేపల్లె డాన్' అనే మాటలు అవాస్తవమని అలాంటి పనులు తాను చేయనని పేర్కొన్నారు.



ఐసర్ ఆవరణలో అమ్మపేరిట మొక్కనాటుతున్న రమేష్ చంద్ర

# ఐసర్‌లో 'స్వచ్ఛోత్సవ్' సంబరాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 ప్రభాతవార్త: తిరుపతి ఐసర్‌లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్‌బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ సారధ్యంలో ఘనంగా 'స్వచ్ఛోత్సవ్' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది స్వచ్ఛత సేవ-2025 కార్యక్రమాలపై అవగాహన నిర్వహించారు. ఈ సదస్సుకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రమేష్ చంద్ర ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే స్వచ్ఛత పారిశుద్ధ్య నిర్వహణ సవాళ్ళకు ఐసర్ విద్యార్థులు, శాస్త్రవేత్తలు వినూత్న పరిష్కారాలు కొనుగొనాలని పిలుపు నిచ్చారు. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న ప్రజా అలవాట్లతో దేశం ఎదుర్కొనే పారిశుద్ధ్య, పర్యావరణ సమ్యల పరిష్కారమే మానవాళి మనుగడకు కీలకమని ఆయన వివరించారు. స్వచ్ఛత సేవ ఇతివృత్తంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను రమేష్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అందరూ స్వచ్ఛతకు కట్టుబడి ఉంటామని స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేసారు.



# పిపిపి పేరుతో ప్రైవేటీకరణ వద్దు

విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకర ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పిపిపి) విధానానికి తెర లేపిందని మాజీ ఎమ్మెల్సీ జెవివి రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక(జెవివి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రచురించిన "పిపిపి పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు" అనే పుస్తకాన్ని విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జెవివి రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో మంజూరైన 10 ప్రభుత్వ వైద్య కళాశాలలు వీటికి అనుబంధంగా ఏర్పడే ఆసుపత్రులను ప్రైవేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకురావాలని నిర్ణయించిందని తెలిపారు. పిపిపి పేరుతో ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టాలని నిర్ణయం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఈ అంశంపై ప్రజల్లో మరింత అవగాహన కోసం ఈ పుస్తకాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు కె. శ్రీనివాస్, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు యు. కృష్ణయ్య, ప్రజారోగ్య వేదిక నాయకులు రామావతారం, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సూర్యారావు, జెవివి రాష్ట్ర నాయకులు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగుల కదలికలపై నిరంతర నిఘా

● ఒడిశా నుంచి వచ్చే ఏనుగులను వెనక్కి మళ్లించే చర్యలు తీసుకోండి
● అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం



విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర సీతాకోక చిలుకగా తిరుమల లిమినియేసి బ్లూ టైగర్ గుర్తింపునకు ప్రతిపాదన అమలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. జాతీయ వన్య ప్రాణి బోర్డు సమావేశానికి జాతీయ రహదారులకు అటవీ భూముల సేకరణ నివేదిక రాష్ట్ర వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ప్రాంతానికి ఒడిశా వైపు నుంచి వస్తున్న మదపుటేనుగుల సమస్యను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. మన్యంలో ఏనుగుల సంచారం వల్ల జరుగుతున్న పంట నష్టం, ప్రాణనష్టంపై నివేదిక ఇవ్వాలని సూచించారు. మదపుటేనుగుల గుంపుల జాడను ఎప్పటికప్పుడు తెలుసుకుని పంటలకు నష్టం వాటిల్లకుండా వాటిని మళ్లించే ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన రాష్ట్ర వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు తీసుకోవాల్సిన అటవీ అనుమతులు, ఉత్తరాంధ్ర ప్రాంతంలో మనుషులు, జంతువుల మధ్య జరుగుతున్న సంఘర్షణలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.


ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దుల్లో మదపుటేనుగుల సంచారం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒడిశా వైపు రాష్ట్రంలో ప్రవేశించిన రెండు గుంపులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని క్షేత్ర స్థాయి నుంచి తెలిసింది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలి. ట్రాకర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా వాటిని తిరిగి అడవిలోకి మళ్లించాలి. ఒడిశా వైపు నుంచి వస్తున్నాయి కాబట్టి అవసరం అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వాటిని వెనక్కి పంపే విధంగా చర్యలు తీసుకోవాలి. అని అధికారులను ఆదేశించారు.

### అటవీ భూముల సేకరణపై జాతీయ వన్యప్రాణి బోర్డుకు నివేదిక

రాష్ట్ర పరిధిలో పలు జాతీయ రహదారుల నిర్మాణానికి అటవీ భూములు అవసరం అవుతాయి. అటవీ భూములతో పాటు ఎకో సెన్సిటివ్ జోన్, టైగర్ రిజర్వ్ జోన్ పరిధిలో ఉన్న భూములను దీని నిమిత్తం సేకరించాల్సి ఉంది. బద్వేల్, నెల్లూరు మధ్య 67వ నంబర్ నాలుగు లైన్ల జాతీయ రహదారి నిమిత్తం 34.67 హెక్టార్ల అటవీ భూమి అవసరం ఉంటుందని అధికారులు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు తెలియజేశారు. ఈ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉంది. ఈ భూములను బదిలీ చేసేందుకు జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి కోసం పంపించనున్నాం. బెంగళూరు, కడప, విజయవాడ ఎక్స్‌ప్రెస్ కారిడార్ కోసం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌తో పాటు శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ నుంచి 40.86 హెక్టార్ల భూమి బదిలీ చేసేందుకు నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇండియా అనుమతులతో పాటు జాతీయ వన్య ప్రాణి బోర్డుకు నివేదిక అందజేయనున్నాం. ఈ నెల 29వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశానికి పై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో కనిపించే అరుదైన సీతాకోక చిలుక అయిన తిరుమల లిమినియేసి బ్లూ టైగర్ సీతాకోక చిలుకను... రాష్ట్ర సీతాకోక చిలుకగా గుర్తించాలని జాతీయ వన్యప్రాణి బోర్డు ప్రతిపాదన పంపుతున్నామ"న్నారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్, పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ డాక్టర్ పి.వి. చలపతిరావు, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, అడిషనల్ డి.జి. ఎన్.మధుసూదన్ రెడ్డి, ప్రముఖ శాస్త్రవేత్తలు శ్రీమతి దీపా జైశ్వాల్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొలికపూడి వర్సెస్ కేశినేని చిన్ని

● తిరువూరు టికెట్ కోసం రూ.5 కోట్లిచ్చా
● ఎమ్మెల్యే శ్రీనివాసరావు వాట్సాప్ స్టేటస్
● మొన్నటి వరకు దేవుడన్నారు, నేడు దెయ్యం ఎందుకయ్యానో
● అంతా అదిష్టానమే చూసుకుంటుంది: కేశినేని చిన్ని వ్యాఖ్య
● బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహం



విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి: ఇక తిరువూరు టీడీపీలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరో దుమారానికి తెర తీశారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని లక్ష్యంగా కొలికిపూడి వాట్సప్ స్టేటస్ పెట్టడం వివాదాన్ని మరింత రాజేసింది. దీనిపై దృష్టి సారించిన చంద్రబాబు కొందరు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి వచ్చాక తానే ఈ అంశంపై దృష్టి పెడతానని తేల్చి చెప్పారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ చిన్నిల మధ్య మాటల యుద్ధం కాస్తా బ్యాంకు లావాదేవీల వరకు వెళ్లింది. ఎమ్మెల్యే టికెట్ కోసం డబ్బులు ఇచ్చానంటూ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి బ్యాంక్ స్టేట్‌మెంట్ విడుదల చేశారు. ఎంపీ చిన్ని అనుచరులకు ఎంత డబ్బులు ఎక్కడ ఇచ్చింది వివరాలతో కొలికపూడి వాట్సప్ స్టేటస్ పెట్టారు. 2024 ఎన్నికల్లో తిరువూరు టీడీపీ టిక్కెట్ కోసం కేశినేని చిన్ని తనను రూ.5 కోట్లు అడిగితే వివిధ మార్గాల్లో వాటిని ఎంపీ మనుషులకు ఇచ్చినట్లు కొలిపూడి వెల్లడించారు. తాను ఇచ్చిన డబ్బు మొత్తం వివరాలపై రేపు మాట్లాడుకుందాం అని స్టేటస్‌లో పెట్టారు. కొలికపూడి ఆరోపణలపై స్పందించిన ఎంపీ కేశినేని చిన్ని వివాదం అధిష్టానం దృష్టికి వెళ్లిందన్నారు. అంతా అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. మొన్నటివరకు కొలికపూడి తనను దేవుడన్నారని, ఇప్పుడు దెయ్యం ఎందుకయ్యానో సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను విమర్శించే వారిని తాను శత్రువుల్లాగే చూస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నేతలతో అంటకాగే నాయకుడిని తాను కాదన్నారు. తిరువూరు వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు కొందరు నేతల వైఖరి, సోషల్ మీడియాలో రచ్చపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విమర్శలు, వివాదాలు సృష్టించే వ్యాఖ్యలపై సీరియస్ అయిన చంద్రబాబు దుబాయ్ నుంచి తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఇద్దరినీ పిలిచి తాను మాట్లాడతానని సీఎం చంద్రబాబుకు పల్లా చెప్పగా వారితో మాట్లాడాల్సిన అవసరం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. దుబాయ్ నుంచి వచ్చాక తిరువూరు వ్యవహారంపై తానే దృష్టి పెడతానని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు తాను విదేశాల్లో పర్యటిస్తుంటే కొందరు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో అయినా, ప్రభుత్వంలో అయినా పాజిటివ్ నెస్ దెబ్బతీసేలా, క్రమశిక్షణ ఉల్లంఘించేలా వ్యవహరించే వారిని ఇక ఉపేక్షించేది లేదన్నారు.

# కొత్త పార్టీ పెడతా



**భువనగిరి, అక్టోబరు 23, ప్రభాతవార్త:** త్వరలోనే కొత్త పార్టీ పెడతానని తెలం గాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గురువారం ఆమె యాదగిరిగుట్టలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కోరుకుంటే తప్పకుండా రాజకీయ పార్టీని పెడతానని, పార్టీ పెడితే అది నాకు కాదు, ప్రజలకే మేలు జరగాలన్నారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ సంస్థ అయినప్పటికీ అవసరమైతే రాజకీయ అంశాలపై మాట్లాడటానికి ఎలాంటి ఇబ్బందులేదని తెలిపారు. రాజకీయాలపై మాట్లాడాలంటే పార్టీ ఉండాల్సిన అవసరం లేదు, కానీ ప్రజల అభీష్టం ఉంటే పార్టీ రాక తప్పదన్నారు. అందులో ఏమాత్రం సందేహం లేదన్నారు. 'జనం బాట' పేరుతో ఆమె రాష్ట్రవ్యాప్త పర్యటన అక్టోబర్ 25 నుంచి నిజామాబాద్ జిల్లాలో ప్రారంభం కానుంది.

# తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురికి అమృతలతా జీవన సాఫల్య పురస్కారాలు

అనంతపురం, అక్టోబరు 23 ప్రభాతవార్త బ్యూరో: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కవులు, కళాకారులకు 2024, 2025 సంవత్సరాలకు సంబంధించి అత్యుత్తమ పురస్కారాలైన అమృతలతా జీవన సాఫల్య పురస్కారాలను నిర్వాహకులు ప్రకటించారు.

అనంతపురానికి చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ శాంతి నారాయణకు ఈ పురస్కారం రావడం విశేషం. అమృతలతా జీవన సాఫల్య పురస్కారాలు 2024 సంవత్సరానికి గాను

### పురస్కారాలు నవంబరు 2న అందజేత

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రముఖులు వసుంధర, డాక్టర్ శాంతి నారాయణ, జీ. వల్లీశ్వర్‌లకు, 2025 సంవత్సరానికి గాను డాక్టర్ నలిమెల భాస్కర్, జి వెంకటకృష్ణ, డాక్టర్ పెద్దింటి అశోక్ కుమార్‌లకు అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను నిర్వాహకులు అందజేయనున్నారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా నృత్యము, మెడ్లి రంగాలకు సంబంధించి ఇందూరు అపురూప అవార్డులను 2024 సంబంధించి సూరారం శంకర, పంచెరెడ్డి లక్ష్మణ్, స్వయం ప్రకాష్, ఎన్.విజయ్ కిషన్ రెడ్డి, కుసుమలతారెడ్డి, 2025 సంవత్సరానికి గాను పి వసంత వివేక్, వి.నరసింహారెడ్డి, పి. సుజాత, సుమీల శర్మ, ఓం ప్రకాష్‌లకు అవార్డులకు ఎంపికైనట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరికి కూడా అదే వేదికపైన సత్కారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ రెండు రాష్ట్రాల తెలుగు కన్వీనర్ డాక్టర్ మృణాళిని, వి.ప్రతిమా తదితరులు హాజరుకానున్నారు.

తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రోడ్, ఎన్.హెచ్. 63, మామిడిపల్లిలో శ్రీవారి అపురూప కళ్యాణ మండపంలో నవంబర్ 2వ తేదీన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమృతలతా జీవన సాఫల్య పురస్కారం తనకు రావడం పట్ల ప్రముఖ కవి శాంతినారాయణ హర్షం వ్యక్తం చేశారు.

# కొన్ని సంవత్సరాల పాటు మీతో ఉండిపోతుంది అప్రీషియేట్ మీట్‌లో స్టార్ బాయ్

**స్టార్‌బాయ్ సిద్దు జొన్నల గడ్డ**



స్టార్ బాయ్ సిద్ధు జొన్న లగడ్డ లేటెస్ట్ రాడికల్ బ్లాక్ బస్టర్ 'తెలుసు కదా'. మిరాయ్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశిఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వం వహించారు. అక్టోబర్ 17న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌తో హౌస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ అప్రిషియేషన్ మీట్ నిర్వహించారు. అప్రిసియేషన్ మీట్ లో స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ, మీడియాకి థాంక్ యు. టిల్లు రిలీజ్ అయినప్పుడు ఎక్సైజ్మెంట్ ఫీల్ అయ్యాను. టిల్లు స్క్వేర్ రిలీజ్ అయిన తర్వాత ఒక కాన్ఫిడెన్స్ ఫీల్ అయ్యాను. జాక్ రిలీజ్ అయిన తర్వాత ఎమోషనల్ లాస్ ఫీల్ అయ్యాను. వీటన్నిటికంటే ఒక ఇంపార్టెంట్ ఫీలింగు తెలుసు కదా రిలీజ్ అయిన తర్వాత ఫీలయ్యాను. ఒక మనశ్శాంతిని ఫీలయ్యాను. ఈ సినిమా నన్ను ప్రశాంతంగా పడుకునేలా చేసింది. దీనికి అందరికంటే ముందుగా డైరెక్టర్ నీరజ కోనకి థాంక్స్ చెప్పాలి. నితిన్ అన్నకి థాంక్స్ చెప్పాలి. ఈ కథకు నేనైతేనే కరెక్ట్‌గా ఉంటుందని నాకు కనెక్ట్ చేశారు. నీరజ్ నేను అనుకున్న ఆలోచనలు తను చాలా గొప్పగా తీసుకుని ఈ కథలో ఇంప్లిమెంట్ చేసుకున్నందుకు తనకు థాంక్స్ చెప్పాలి. ఈ సినిమానే అందరు రాడికల్ అనుకుంటున్నారు. కానీ తన నెక్స్ట్ సినిమాలో ఓపెనింగ్ సీక్వెన్స్ చూస్తే మామూలుగా ఉండదు. మా విజన్ సపోర్ట్ చేసిన నిర్మాత విశ్వకి థాంక్యూ. ఆయన డబ్బు గురించి ఆలోచించలేదు. ఒక మంచి సినిమా తీద్దామని ముందుకు వచ్చారు. తమన్ ఫెంటాస్టిక్ మ్యూజిక్ ఇచ్చారు. ఈ ఆల్బమ్ నా కెరీర్లో ఎప్పటికీ మిగిలిపోతుంది. నవీన్ నూలి సినిమాని అద్భుతంగా ఎడిట్ చేశారు. అవినాష్ అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్ చేశారు. హర్ష శ్రీనిధి రాశి ఈ ముగ్గురు కూడా స్పెషల్ థాంక్స్. అద్భుతంగా పెర్ఫార్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన మమ్మల్ని అప్రిషియేట్ చేయడానికి వచ్చిన సందీప్‌కి ఎస్ కే ఎన్‌కి బండ్ల గణేష్‌కి కోన వెంకట్ కి, రవికి, శశికి థాంక్యూ. తెలుసు కదా థియేటర్స్‌లో వుంది. ఇది పక్కా మాస్ సినిమా. థియేటర్స్‌కి వెళ్లి చూడండి. ఈ సినిమా మీకు నచ్చుతుంది. మీకు గుర్తుండి పోతుంది. కొన్ని సంవత్సరాలు పాటు మీతో ఉండి పోతుంది. ఈ సినిమాని చూసి అప్రిషియేట్ చేసిన అందరికీ థాంక్యూ. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ, ఈ సినిమాకి మంచి విజయాన్ని అందించిన ఆడియన్స్ కి కృతజ్ఞతలు. ఈ సినిమాకి చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. అందరు కంటెంట్‌ని చాలా డీటెయిల్ గా అనలైజ్ చేశారు. అది మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి యూనిక్ పాయింట్ మీద కొత్త డైరెక్టర్‌కి సిద్ధు అవకాశం ఇవ్వడం అనేది గొప్ప విషయం. మేము ఒక యూనిక్ స్టోరీని చెప్పాము. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాని తప్పకుండా అందరూ చూడాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ నీరజకోన మాట్లాడుతూ, మాకు సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ థాంక్యు. ఈ సినిమాకి సిద్ధు బ్యాక్ బోన్. ఒక డెబ్యూ డైరెక్టర్‌గా నన్ను బిలివ్ చేసిన నిర్మాత విశ్వప్రసాద్‌కి ధన్యవాదాలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో నా జర్నీ ప్రారంభమైంది. డిఓపి జ్ఞానసాగర్, తమన్ ఈ సినిమాకి చాలా బిగ్ టెక్నికల్ సపోర్టు. తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. పాటలన్నీ చాలా సూపర్ హిట్. మా డైరెక్షన్ డిపార్ట్మెంట్‌కి, అందరికీ కృతజ్ఞతలు. రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, ఇందులో సీమంతం సాంగ్ రాశాను. ఇది చాలా కొత్త కథ. చాలా అద్భుతంగా తీశారు. టీజర్ దగ్గర్నుంచి ఈ సినిమాలో సిద్ధు మార్క్ కనిపించింది. చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఈ విజయంలో భాగస్వామ్యం అయినందుకు చాలా ఆనందంగా ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఇలాంటి మరెన్నో అద్భుతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. మూవీ యూనిట్ అందరూ ఈ వేడుకలో పాల్గొన్నారు.



## 'ఇట్లు మీ ఎదవ' చిత్రం నుంచి 'ఉన్నట్ట మరి లేనట్ట' సాంగ్ రిలీజ్


త్రినాధ్ కఠారి హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో సంజీవని ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత బళ్లారి శంకర్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇట్లు మీ ఎదవ. తెలుగు అమ్మాయి సాహితీ అవాంచ హీరోయిన్ గా నటిస్తున్నారు. వెయేళ్ళు ధర్మంగా వర్ధిల్లు అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆర్పీ పట్నాయక్ ఈ సాంగ్ ని అద్భుతమైన మెలోడీగా కంపోజ్ చేశారు. పూర్ణాచారి ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. చరణ్, శృతిక సముద్రాల వోకల్స్ మెస్మరైజ్ చేశాయి. సాంగ్ కి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇట్లు మీ ఎదవ టైటిల్ చాలా కొత్తగా వుంది. ఉన్నట్ట మరి లేనట్ట సాంగ్ చాలా అద్భుతంగా వుంది. ఆర్పీ పట్నాయక్ : ఎక్స్ట్రార్డినరీగా కంపోజ్ చేశారు. త్రినాధ్, సాహితీ జోడి చాలా బావుంది. ప్రొడ్యూసర్ శంకర్, డిఓపి జగదీష్ నాకు మంచి మిత్రులు. టీమ్ అందరికీ ఆల్‌దివెరీ బెస్ట్ చెప్తూ ఈ సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. ఈచిత్రంలో తనికెళ్ల భరణి, గోపరాజురమణ, దేవీ ప్రసాద్, సురభి ప్రభావతి, మధుమణి, తాగుబోతు రమేష్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు పట్నాయక్ మ్యూజిక్ అందించడం విశేషం. జగదీష్ చీకటి డీవోపీగా పని చేస్తున్న ఈ చిత్రానికి ఉద్ధవ్. ఎడిటర్. ఈచిత్రం షూటింగ్ పూర్తయింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తారాగణం: త్రినాధ్ కఠారి, సాహితీ అవాంచ, తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవీ ప్రసాద్, నవీన్ నేని, సురభి ప్రభావతి, మధుమణి, తాగుబోతు రమేష్, చలాకీ చంటి, జబర్దస్త్ నూకరాజు, జెమినీ సురేష్, డీడీ శ్రీనివాస్, రామజగన్. టెక్నికల్ టీం: రచన, దర్శకత్వం: త్రినాధ్‌కఠారి, నిర్మాత: బళ్లారి శంకర్‌బ్యానర్: సంజీవని ప్రొడక్షన్స్ డీవోపీ: జగదీష్ చీకటి
సంగీతం.. పట్నాయక్‌ఎడిటర్: ఉద్ధవ్.ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మల్లికార్జున్, లైన్ ప్రొడ్యూసర్: బృంధావన్ కేతిరెడ్డి: కాస్ట్యూమ్ డిజైనర్: బృందావర్ధని అవ్వారుపీఆర్వో: తేజస్వి సజ్జా.

## 'మన శంకరవరప్రసాద్ గారు' షూటింగ్‌లో జాయిన్ అయిన విక్టరీ వెంకటేష్



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2026 సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ సినిమా పండగ సీజన్‌కు పర్ఫెక్ట్ ట్రీట్. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రాన్ని అర్చన సమర్పిస్తున్నారు. ఎఫ్2 ఎఫ్3లాంటి లాఫ్ రయాట్స్ ఇచ్చిన అనిల్ రావిపూడి, 'మన శంకర వర ప్రసాద్ గారు'మరోసారి విక్టరీ వెంకటేశ్‌తో జట్టుకట్టారు. ఐకానిక్ హీరోస్ చిరంజీవి - వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం అభిమానులకు డబుల్ ఫెస్టివల్. ఈ సినిమాలో వెంకటేశ్ లెంగ్తీ, క్రూషియల్ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతంహైదరాబాద్‌లోని భారీ సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. వెంకటేశ్ ఈరోజు షూట్‌కి జాయిన్ అయ్యారు. చిరంజీవి - వెంకటేశ్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మేకర్స్ విడుదల చేసిన వీడియోలో చిరంజీవి సంతోషంగా వెంకటేశ్‌ను వెల్‌కమ్ చెబుతుండగా, వెంకటేశ్ తన మిత్రుడైన మెగాస్టార్ ను స్నేహంగా పలకరిస్తూ కనిపించారు. సెట్‌లో పండగ వాతావరణం స్పష్టంగా తెలుస్తోంది. 'మన శంకరవరప్రసాద్‌గారు' తెలుగు సినిమాలో బిగ్గెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఈచిత్రం మ్యూజిక్ జర్నీ అట్టహాసంగా ప్రారంభమైయింది. ఫస్ట్‌సింగిల్ మీసాల పిల్ల బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. ఈసాంగ్ లో చిరంజీవి ఫ్లే ఫుల్ అవతార్‌లో నయనతారను ఆటపట్టిస్తూ స్క్రీన్ పై అద్భుతమైన కెమిస్ట్రీని షేర్ చేసుకున్నారు. ఈ చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియోసంగీతం అందించగా, సమీర్ రెడ్డి సినిమా టోగ్రాఫర్‌గా, తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

## 'మాస్ జాతర' నుండి 'సూపర్ డూపర్' పాట విడుదల




'మాస్ జాతర'చిత్రం నుండి మాస్ గీతం 'సూపర్ డూపర్' విడుదల 'సూపర్ డూపర్' గీతంతో మాస్ విందు ఇచ్చిన 'మాస్ జాతర' చిత్ర బృందం 'మాస్ జాతర' చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే', 'హుడియో హుడియో' గీతాలు శ్రోతలను శేషంగా ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో ఉర్రూతలూగించాయి. తాజాగా చిత్ర బృందం, నాలుగో గీతంగా ఉత్సాహభరితమైన మాస్ పాట 'సూపర్ డూపర్'ను విడుదల చేసింది. రవితేజ మాస్ కి, శ్రీలీల ఎనర్జీకి తగ్గట్టుగా స్వరపరిచిన ఈ బ్లాక్ బస్టర్ ట్యూన్ అందరినీ కట్టిపడేస్తోంది. 'మాస్ జాతర' చిత్రాన్ని, ఆల్బమ్‌ని మరింతగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేలా ఈ సూపర్ డూపర్ గీతముంది. రెండు ఉత్సాహభరితమైన పాటలు, ఓ మంచి మెలోడీతో ఇప్పటికే మాస్ జాతర ఆల్బమ్ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తాజాగా విడుదలైన మాస్ ని ఉర్రూతలూగించే ఈ సూపర్ డూపర్ గీతం, ఆ స్థానాన్ని మరింత పదిలం చేసింది. మునుపటి మాస్ మహారాజా రవితేజను గుర్తుచేసేలా, ఆయనకు మాత్రమే సాధ్యమయ్యే స్వాగ్ ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీలీల తన అద్భుతమైన నృత్య ప్రదర్శనతో మరోసారి తెరపై వెలుగులు వెదజల్లారు. రవితేజ, శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ మాస్ గీతాన్ని ప్రేక్షకులు మెచ్చే నిజమైన వేడుకలా మలిచాయి. 'సూపర్ డూపర్' గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. మాస్‌ని మెప్పించడంతో పాటు, అందరినీ కాలు కదిపేలా చేసేలా ఎంతో హుషారుగా ఈ గీతముంది. భీమ్స్ సిసిరోలియోతో కలిసి రోహిణి సోరట్ ఆలపించడం ఈ పాటకు మరింత హుషారుని తీసుకొని వచ్చింది. గీత రచయిత సురేష్ గంగుల అందరూ పాడుకునేలా ఉల్లాసభరితమైన సాహిత్యాన్ని అందించి ఆకట్టుకున్నారు. సంగీతం, గానం, సాహిత్యం అన్నీ చక్కగా కుదిరి.. 'సూపర్ డూపర్'ను ఓ గొప్ప మాస్ గీతంగా తీర్చిదిద్దాయి. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, 'మాస్ జాతర' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. చిత్ర ప్రకటన వచ్చినప్పటి నుండి 'మాస్ జాతర'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, మూడు పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన నాలుగో గీతం 'సూపర్ డూపర్', సినిమా పట్ల ఆసక్తిని మరింత పెంచుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. కొద్దిరోజులుగా ప్రత్యేక ఇంటర్వ్యూలతో సామాజిక మాధ్యమాల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అలాగే, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ కూడా త్వరలో రానుంది. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి అక్టోబర్ 31న 'మాస్ జాతర' చిత్రం థియేటర్లలో అడుగుపెట్టనుంది.

## 'ఫౌజీ' నుండి అద్భుతమైన పోస్టర్ రిలీజ్



రెబెల్‌స్టార్ ప్రభాస్, క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడి, ప్రతిష్టాత్మక బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్, టి సిరీస్ ప్రజెంట్స్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్ రెబెల్ స్టార్ ప్రభాస్, క్రియేటివ్ ఫిల్మ్ మేకర్ హను రాఘవపూడి దర్శకత్వంలో చేస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ ప్రభాస్ హనుకాన్సెప్ట్ పోస్టర్, ప్రీ లుక్‌తో భారీఅంచనాలను సృష్టించింది. మేకర్స్ ఈరోజు టైటిల్‌ని రివల్ చేశారు. సక్సెస్ ఫుల్ పాన్‌ఇండియా బ్యానర్‌మైత్రిమూవీమేకర్స్ నిర్మాణం లో టిసిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. ఫౌజీ టైటిల్ ప్రభాస్ సైనికుడి పాత్రను సూచిస్తుంది. 1940 నేపథ్యంలో సాగే ఈకథలో కాలిపోయినబ్రిటిష్ జెండా తిరుగుబాటుకు సంకేతంగా కనిపిస్తోంది. చుట్టూ వ్యాపించిన అగ్నిజ్వాలలు, అందులో దాగి ఉన్నసంస్కృత శ్లోకాలు, కోడ్‌లాంటి చిహ్నాలుఈకథలోని మిథాలజికల్, హిస్టారికల్‌అంశాలనుసూచిస్తున్నాయి. ముఖ్యంగామహాభారతంలోని కర్ణుడి ప్రతిరూపంగా హీరోను చూపించే తీరు అద్భుతం. పోస్టర్‌లో ఉన్న శ్లోకాలు చెబుతున్న భావం గమనిస్తే..అతను పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడిలా, పాండవుల పక్షాన నిలిచేధర్మయోధుడు. గురువులేని యోధుడు అయిన ఏకలవ్యుడిలా, సహజసిద్ధమైన శౌర్యం కలవాడు. బ్రాహ్మణుడి జ్ఞానం, క్షత్రియుడిధర్మం రెండూ అతనిలో వున్నాయి. ప్రభాస్‌ను క్లోజప్ షాట్‌లోచూపించిన తీరుఅద్భుతం. అతని కళ్ళలో ఉన్న ఇంటెసిటీ, ఒకయోధుడి ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తాయి .అనేట్యాగ్‌లైన్‌దేశం కోసం ఒంటరిగా పోరాడేసైనికుడి కథని సూచిస్తోంది. "ఫౌజీ"టైటిల్ పోస్టర్‌అంచనాలకు మించివుంది. ఎమోషన్‌కి ,గ్రాండ్యూర్‌కిపేరుపొందిన హనుంరాఘవపూడి, ప్రభాస్‌ని ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పవర్‌ఫుల అవతార్‌లోచూపించ బోతున్నారు. పభాస్ సరసన హీరోయిన్‌గా ఇమాన్వీ నటిస్తోంది. అనుపమ్‌ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్‌లు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. సినిమాటోగ్రఫీని సుదీప్ చటర్జీ, నిర్వహిస్తుండగా, సంగీతాన్ని విషాల్ చంద్రశేఖర్ అందిస్తున్నారు. అనిల్ విలాస్ జాధవ్ ప్రొడక్షన్ డిజైనర్, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. పవర్ ఫుల్ టైటిల్, గ్రేట్ విజువల్ ప్రెజెంటేషన్, టెక్నికల్ టాలెంట్ అన్నింటి కలయికతో ఫౌజీ ప్రభాస్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచే పాన్ ఇండియా చిత్రం అవుతుంది. ఈ చిత్రంతెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో విడుదలకానుంది. తారాగణం: ప్రభాస్, ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు.

## ఇంగ్లీష్ డబ్బింగ్ వెర్షన్‌లో విడుదలవుతున్న కాంతార: చాప్టర్1



ఇంగ్లీష్‌డబ్బింగ్‌వెర్షన్‌తో విడుదలౌతున్నతొలి భారతీయ చిత్రంగా రికార్డ్ క్రియేట్‌చేసిన రిషబ్‌శెట్టి, హోంబలే ఫిల్మ్స్ కాంతార: చాప్టర్1 అక్టోబర్31న రిలీజ్ రిషబ్‌శెట్టి బిగ్గెస్ట్‌పాన్ ఇండియాబ్లాక్‌బస్టర్ కాంతార: చాప్టర్1. ప్రఖ్యాత పాన్‌ఇండియానిర్మాణసంస్థహోంబలేఫిల్మ్స్ నిర్మించిన ఈచిత్రం అక్టోబర్2న విడుదలైనఅన్నివర్గాల ప్రేక్షకులని ఆకట్టుకొని ఘనవిజయాన్ని అందుకుంది. రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్ తో కొత్త బెంచ్ మార్క్ ని క్రియేట్ చేసింది. కాంతార: చాప్టర్ 1 విజువల్ వండర్‌గా ప్రేక్షకులని మెస్మరైజ్ చేస్తోంది. ప్రేక్షకులువి మర్శకులనుంచి అద్భుతమైన ప్రశంసలు అందుకుంది .ఇప్పుడీ సినిమామరో మైల్ స్టోన్ క్రియేట్ చేసింది. ఇంగ్లీష్ డబ్బింగ్ వెర్షన్‌తో విడుదలౌతున్న తొలి భారతీయ చిత్రంగా రికార్డ్ క్రియేట్ చేసింది. అక్టోబర్ 31న ఇంగ్లీష్ వెర్షన్ వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. లేటెస్ట్ వెర్షన్‌లో రన్ టైం తగ్గించారు. 2గంటలు, 45 నిమిషాలు 40 సెకన్లు రన్ టైం వుంటుంది. కాంతార: చాప్టర్ 1 తెలుగులో 100 కోట్లు కలెక్ట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 800 కోట్లు కలెక్ట్ చేసింది. కన్నడ బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలిచింది. అన్ని భాషల్లో ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కాంతారకి ప్రీక్వెల్‌గా వచ్చిన కాంతార: చాప్టర్ 1 ప్రస్తుతం బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టిస్తూ సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది.

## నేషనల్ క్రష్ రశ్మిక మందన్న 'ది గర్ల్ ఫ్రెండ్'ట్రైలర్ రిలీజ్



నవంబర్ 7న పాన్ ఇండియా భాషలలో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న మూవీ నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు.

ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా ట్రైలర్ రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ నెల 25న ట్రైలర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా ట్రైలర్ పై అందరిలో క్యూరియాసిటీ ఏర్పడుతోంది. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. నటీనటులు :రశ్మిక మందన్న, దీక్షిత్ శెట్టి, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ కృష్ణన్ వసంత్‌సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్ కాస్ట్యూమ్స్ శ్రావ్య వర్మ ప్రొడక్షన్ డిజైన్ ఎస్ రామకృష్ణ, మోనిక నిగోత్రి, పీఆర్ఓ జి.ఎస్.కే మీడియా, వంశీ కాక మార్కెటింగ్: ఫస్ట్ షో: సమర్పణ: అల్లు అరవింద్ బ్యానర్స్: గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్: నిర్మాతలు :ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి రచన, దర్శకత్వం రాహుల్ రవీంద్రన్ .

## 'గుమ్మడి నర్సయ్య' నుంచి మోషన్ పోస్టర్ విడుదల



కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న 'గుమ్మడి నర్సయ్య' చిత్రం నుంచి మోషన్ పోస్టర్ విడుదల..ప్రఖ్యాత రాజకీయ నాయకుడు, ప్రజామనిషి గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్రను తెరపైకి తీసుకు వస్తున్నారు. పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడిగా గుమ్మడి నర్సయ్యకు తెలుగురాష్ట్రాల్లో ఉన్న మంచి పేరు అందరికీ తెలిసిందే. ఇక గుమ్మడి నర్సయ్య పాత్రలో కరుణాడ చక్రవర్తి శివరాజ్ కుమార్ నటించబోతున్నారు. ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ మీద ఎన్. సురేష్ రెడ్డి నిర్మాతగా పరమేశ్వర్ హివ్రాలే దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ మేరకు చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇక ఈ పోస్టర్‌ను, మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే గుమ్మడి నర్సయ్య పాత్రకు శివ రాజ్‌కుమార్ ప్రాణం పోసినట్టుగా కనిపిస్తోంది. ఆలుక్, వేషధారణ అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. సైకిల్, వెనకాల ఉన్న అసెంబ్లీ, ఎర్రకండువా ఇలా అన్నీ కూడా ఎంతో అథెంటిక్‌గా ఉన్నాయి. ఇక ఈ పోస్టర్‌తో ఒక్కసారిగా అంచనాలు పెంచేసినట్టు అయింది. ఇక మోషన్ పోస్టర్‌లో ఎమ్మెల్యేలు అంతా కూడా కారులో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సైకిల్‌లో రావడం.. ఆ మ్యూజిక్, ఆర్ఆర్ విజువల్స్ అన్నీ కూడా అద్భుతంగా అనిపిస్తోంది. నిర్మాత ఎన్. సురేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించబోతోన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడిగా సురేష్ బొబ్బిలి, ఎడిటర్‌గా సత్య గిడుటూరి పని చేస్తున్నారు. త్వరలోనే మూవీకి సంబంధించిన ఇతర విషయాల్ని

# ఆర్థికంగా స్థిరపడేలా..



**దీపాల సొబగులతో వెలుగులు నింపే పండుగ దీపావళి. ఈ పండుగ పర్యావరణహితంగా జరగాలనుకున్నారు రాంచీలోని మహిళలు. అందుకు ఆవుపేడతో దీపాలను తయారుచేస్తున్నారు. అదే వారిని ఆర్థికంగా స్థిరపడేలా చేసింది.**

రాంచీలో దీపావళి సంబరాలు మొదలయ్యాయి అంటే మార్కెట్లో ప్రతి దుకాణం రంగుల పూలు, లైటింగ్‌తో కళకళలాడుతుంది. వాటికి పోటీగా ఆవుపేడతో మహిళలు తయారుచేసిన ఎకోఫ్రెండ్లీ ప్రమిదలూ ఆకర్షిస్తాయి. 'గోవర్ క్రాఫ్ట్' పేరుతో 90మందికి పైగా మహిళలు ఆవు పేడతో ఏటా వీటిని తయారుచేస్తున్నారు. స్థానిక మహిళలు సమూహాలుగా ఏర్పడి ఆవుపేడను సేకరిస్తారు. ఎండబెట్టి, పొడిచేస్తారు. అందులో మట్టిని కలిపి ప్రత్యేక యంత్రాల సహాయంతో అచ్చులుగా పోస్తారు. తర్వాత వాటిని చేతులతోనే ప్రమిదలుగా చేస్తారు. మూడురోజులు ఆరనిచ్చి సహజ రంగులతో రంగులు వేస్తారు. సగటున ఒక మహిళ రోజుకు 200 నుండి 250 ప్రమిదలను తయారుచేయగలదు. వీటితో పాటు చిన్న చిన్న దేవుడి విగ్రహాలనూ తయారుచేస్తారు. గోవర్ క్రాఫ్ట్‌ను ఐదు సంవత్సరాల క్రితం రాంచీలో రోషన్ సింగ్, సోనాలి మెహతా స్థాపించాడు తొలిరోజుల్లో ఆవు పేడ వ్యర్థం కాదు, విలువైన వనరు అని ప్రజలని. ఒప్పుకోవడానికి కష్టం అదే దాని ప్రాముఖ్యత చెప్పాక ఒప్పుకొన్నారు. అందుకే స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చి ఇంటిదగ్గరే పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తు న్నాం. దీంతోపాటు ప్రభుత్వం సుకుర్హుటుగా గోశాల కమీషన్లు మార్కె టింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. మా దృష్టిలో వెలుగు అంటే.. ప్రమిదం నూనె పోసి వెలిగించడం కాదు, కష్ట పడి పనిచేయడం. ఇక్కడ మేము తయారుచేసే ప్రతి ప్రమిద వెనక ఓ మహిళ కథ ఉంటుంది. వారి పోరాటం దాగుంటుంది. గ్రామాల నుంచి నగరాలకు మార్కెట్ వ్యాప్తి చెందాలంటే మా ఆశయం అంటున్నారు సోనాలి.

# యువతకు ఆమె సేవలు స్ఫూర్తిదాయకం

**ప్రజా సేవే పరమావధిగా భావించే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులెంతోమంది! ప్రజల కష్టాలు తెలుసుకొని వాటిని దూరం చేయడానికి వారు అహర్నిశలూ శ్రమిస్తారు. సాక్షి సాహ్నీ కూడా ఇదే కోవకు చెందుతారు. అమృత్సర్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆమె.. అక్కడ ఈ హోదా అందుకున్న తొలి మహిళగా చరిత్రకెక్కారు. ప్రజలకు సేవ చేయడానికే న్యాయ విద్యను వదిలి ఇటువైపుగా అడుగులు వేస్తున్న ఆమె.. తన వృత్తి నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు.**



ఇటీవలే అమృతసర్‌ను వరదలు ముంచెత్తిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఆమె.. ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. ఈ వరదనే ముంపు నుంచి దాదాపు 900 మందిని రక్షించగలిగారు. ఇలా ఓ బాధ్యతాయుత అధికారిగా ఆమె తీసుకున్న సహాయక చర్యల్ని అక్కడి ప్రజలే కాదు.. దేశమంతా కొనియాడుతోంది. ఎడతెరపి లేని వర్షం కారణంగా ఇటీవల పంజాబ్‌ను వరదలు ముంచెత్తిన సంగతి తెలిసిందే! అక్కడి వాగులు పొంగిపొర్లడం, డ్యామ్స్ గేట్లు ఎత్తివేత అదనపు నీటిని విడుదల చేయడంతో... 23 జిల్లాల్లోని 1650 గ్రామాలు ఈ వరద బీభత్సానికి వణికిపోయాయి. అయితే ఈ ప్రకృతి విపత్తు నుంచి తమ ప్రజల్ని ఎలాగైనా కాపాడుకోవాలను కున్నారు అమృత్‌సర్ డిప్యూటీ కమిషనర్ సాక్షి ఈ పనినే తక్షణ సహాయక చర్యలు చేపట్టారు.

**అహర్నిశలూ క్షేత్రస్థాయిలోనే..!** అమృత్సర్ నిర్దేశిత అజ్నాల అనే నగరం చుట్టుపక్కల దాదాపు 20 గ్రామాలు వరద ముంపుకి సిద్ధంగా ఉన్నాయి. దీంతో తక్షణమే క్షేత్ర స్థాయిలో అడుగుపెట్టిన సాక్షి రాత్రనక, పగలనక అక్కడే ఉండి ప్రజలకు సేవలందించారు. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెడ్ క్రాస్.. ఇతర రక్షణ బృందాలను ఇక్కడికి రప్పించి.. వారి సమన్వయంతో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టారు. వరదల్లో చిక్కుకున్న మారుమూల ప్రాంతాల ప్రజలను రక్షించడానికి పడవలు, ఇతర వాహనాల సహాయం తీసుకున్నారా. ఇలా తన పటిమతో దాదాపు 900 మందిని కాపాడగలిగారు. వరద బాధితులకు ఆహారం, పరిశుభ్రమైన నీరు, అత్యవసరమైన వారికి వైద్య చికిత్సలు అందించడం.. వంటివన్నీ పకడ్బందీగా అందేలా చూశారు. ఇలా పరోక్షంగా బాధితుల్ని అక్కున చేర్చుకోవడమే కాదు.. వరద నీటిలోనే ప్రత్యక్షంగా బాధితులను కలుసుకున్నారు ఈ ప్రకృతి విపత్తును ధైర్యంగా ఎదుర్కొనేలా తన మాటలతో వారిలో సానుకూల దృక్పథం నింపారు. వరదల్లో సర్వస్వం కోల్పోయిన చిన్నారులను, మహిళలను, వృద్ధులను గుండెలకు హత్తుకొని ఓదార్చారు. ఇలా ఓ బాధ్యతాయుత అధికారిగా, ప్రజా సేవకురాలిగా ఆమె స్పందించిన తీరు, తీసుకున్న సహాయక చర్యలపై అక్కడి ప్రజలు ప్రశంసలు కురిపించారు. అంతేకాదు.. సాక్షి. ది రియల్ హీరో! అంటూ మరో దేశమంతా ఆమె సేవల్ని కొనియాడుతోంది. యువ ఐఏఎస్ అధికారులు, ఈ రంగంలోకి అడుగుపెట్టాలనుకునే యువతకు సాక్షి సేవలు స్ఫూర్తిదాయకం!' అంటూ మరికొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఈ కలెక్టరమ్మ పేరు పెట్టింట్లో ట్రెండ్ అవుతోంది.

**ఎనిమిది బంగారు పతకాలు !** సాక్షి పంజాబ్ కేడర్‌కు చెందిన ఐఎస్ అధికారిణి. ఆమె కుటుంబంలో అందరూ ప్రభుత్వోద్యోగులే! ఆమె తండ్రి సర్వీస్ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందారు. తల్లి స్కూల్ ప్రిన్సిపాల్. కాగా, సోదరి బ్యాంకింగ్ రంగంలో విధులు నిర్వర్తిస్తోంది. ఇలా క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరిగిన సాక్షి కూడా ప్రభుత్వోద్యోగం సంకల్పించుకుంది. హైదరాబాద్ లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా'లో న్యాయవిద్యలో డిగ్రీ పట్టా



పుచ్చుకున్న సాక్షి ఆ సమయంలో క్లాస్ టాపర్గా నిలిచింది. ఎనిమిది బంగారు పతకాలు అందుకుంది. అయితే చదువు పూర్తయ్యాక లాయర్గా స్థిరపడాలనుకున్న ఆమె.. సివిల్స్ ద్వారా సమాజంలో మంచి మార్పులు తీసుకురావాలని, ప్రజా సేవ చేయమని ఇటువైపుగా అడుగులు వేసింది. ఈ కోరుకునే న్యాయ విద్యను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని 2012లో తొలిసారి సివిల్స్ రాసింది. కానీ ఈ ప్రయత్నం విఫలమవడంతో ఆ మరుసటి ఏడాది మరో ప్రయత్నం చేసింది. ఈసారి సక్సెసైంది సాక్షి ఆలిండియా ఆరో ర్యాంకు సాధించిన ఆమె.. 2014లో విధుల్లో చేరింది.

**మహిళల కోసం..** ఆమె ప్రారంభించిన 'ప్యూచర్ టైకూన్స్ ఛాలెంజ్' అనే కార్యక్రమం అక్కడి గ్రామీణ/వెనకబడిన ప్రాంతాల్లోని మహిళలు, యువతను వ్యాపారాభివృద్ధి దిశగా ప్రోత్సహించింది ఇలా అక్కడి మహిళలు, ప్రత్యేక అవసరాలున్న వ్యక్తులు, విద్యార్థులు ప్రారంభించారు చిరువ్యాపారాలు.. ప్రముఖ టీవీ బిజినెస్ రియాల్టీ షో 'షార్క్ ట్యాంక్ ఇండియా'లో నగదు బహుమతి గెలుచుకునేలా చేశాయి. ఇక నుంచి అమృత్సర్ డిప్యూటీ కమిషనర్‌గా సేవలు అందిస్తోన్న సాక్షి అక్కడి గ్రామాలన్నీ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది.

# విడిపోయి కలుస్తున్నారు !

**భార్యాభర్తలన్నాక గొడవలు సహజం.** కానీ వాటిని ఎలా పరిష్కరించు కుంటున్నారు. అన్నదానిపైనే దాంపత్య జీవితం ఆధారపడి ఉంటుంది. కోపంలో ఒకరినొకరు కసురుకున్నా... ఉదయం అయ్యేసరికి పరిస్థితుల్ని చక్కబెట్టుకుంటేనే బంధం బలపడేది. కానీ ఇప్పటి వరకు ఉన్నారు. చిన్నచిన్న విషయాల్ని తెగేదాకా లాగుతున్నారు. అవే చినికిచినికి గాలివానగా మారి విడి పోవడానికి కారణమవుతున్నాయి.. ఇకపై ఇలా



కాకూడదంటే తీసుకోమంటున్నారు నిపుణులు. అదేంటంటే...

✦ చెడమడ తిట్టుకుని కలిసి ఒకేచోట ఉండాలంటే కోపం మరీ పెరిగిపోతుంది. అందుకే నిద్రపోయేటప్పుడు ఉండ మంటున్నారు నిపుణులు. దీనివల్ల మనసు కుదుటపడి అవతలి వాళ్ల వెర్షన్ని అర్థం చేసుకునే సమయం దొరుకుతుందట. పైగా మంచినిద్ర మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. రోజును తాజాగా ప్రారంభించేందుకు ఇది అందుబాటులోకి వచ్చింది.

✦ చాలామంది మగవాళ్లు ఎంత పెద్ద గొడవైనా, ఏం జరగనట్లు నడుచుకుంటుంటారు. ఆడవాళ్లు సుల భంగా దేన్నీ మరచి పోలేరు. అయితే అన్ని సార్లు ఈ పద్ధతి మంచిది కాదు. ఆ కోపం తగ్గాలంటే ఒంటరిగా ఒక రాత్రి గడవడమే మేలట.

✦ గొడవ అయ్యాక చాలామంది బాధపడుతూ కూర్చుంటారు. అవతలి వాళ్లేమో నిద్రపోతుంటారు. అది ఇంకా మనలో ఒత్తిడినీ, కోపాన్నీ పెంచేస్తుంది. అందుకే వాళ్లకి కాస్త దూరంగా ఉంటే వేరే వ్యాపకాలమీదకు మనసు మళ్లుతుందట. చిన్నచిన్న కారణాలతో విడాకులు తీసుకుని జీవితాంతం విడిపోయే బదులు, ఇలా కాస్త ఎడబాటుగా ఉండి ఎవరికి వాళ్ల సమయం ఇచ్చుకోవడం మంచిదేమో కదా. పైగా మిలీనియల్స్ ఈ ట్రెండ్ ఫాలో అవడానికి ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నారట.




**మన పని మనం చేసుకు పోదాం.** చాలామంది ఉద్యోగినుల ధోరణి అలాగే ఉంటుంది. అనవసర వివాదాల్లో దూరతామేమో అన్న భయం ఒకటే. పని ముగించుకుంటే త్వరగా బయటపడొచ్చు అన్న ఆలోచన మరొకటిందా. సందేహం అడిగితే ఏమీ తెలియదు అనుకుంటారు. ప్రశ్నిస్తే పొగరుగా బావిస్తారు ఇలా లోలోపలే బోలెడు ఊహించుకుంటారు. కానీ ఈ తీరే వారిని ఎనగకుండా ఆపుతుంది. మీదీ అనే వరసైతే బ్రాండింగ్ తప్పనిసరి అంటే మేకోవర్. దుస్తుల్నీ, హెయిర్లైలో మార్చమని కాదు... మీ పూర్తి ఇమేజింగ్ మార్చుకోమని అర్థం. అడగండి... ప్రమోషన్ కానీ, ఫైనాళ్ల మెచ్చుకోలు కానీ రానప్పుడు నిరాశ సహజమే కానీ ఎందుకు రావట్లేదు. అన్న ప్రశ్న వేసుకోండి. అయితే దీనికి మాత్రం మీరే సమాధానం ఇవ్వవద్దు. ఎందు కంటే.. ఫలానా అమ్మాయి నా గురించి చెడుగా చెప్పిందేమో, నేనెక్కడ ఎదిగి పోతానో అని వల్ల ఇలా మనమంటే పడనివారి మీదకే దృష్టి వెళ్తుందట. వాటివల్ల ప్రయోజనం లేకపోగా వర్థం అందుకే మీ పనితీరు తెలిసినవారిని అడగండి వాళ్లైతే మీ లోపాలు కచ్చితంగా చెబుతారు. ఉద్యోగి ఇలాగే చేస్తే ఆమెకేం సలహాలొచ్చాయో తెలుసా! పని చేస్తావు కానీ... అభిప్రాయాలు చెప్పవు ఎప్పుడూ దీనంగా ముఖం పెట్టుకుని ఉంటావు... దీనితో నీతో పని చేయాలని పించదు. వ్యక్తిగత శుభ్రత పాటించు... అంటూ సలహా లొచ్చాయట. అసలీ కోణాలూ మనపై ప్రభావం చూపు ఊహించ గలమా? కొన్ని సార్లు చిన్న అంశాలూ పెద్ద సమస్య అవుతాయనడా నికి ఇది ఉదాహరణ కాబట్టి, ఏ మార్పు అవసరమో అడిగి తెలుసుకోండి. చెప్పినవన్నీ మార్చుకోవాలనేం లేదు. కానీ కొన్నింటినైనా ప్రయత్నించొచ్చు. అప్పుడు నెమ్మదిగా మీలో మార్పు మొదలవు తుంది. చుట్టుపక్కల వాళ్లూ దాన్ని గమని స్తారు. ఒక పరిశోధన ప్రకారం... ఒక పదిని అక్క మగ ఇద్దరూ చేస్తున్నప్పుడు... ఆడవాళ్ల నుంచేఎక్కువ ఫలితం ఆశిస్తారట. మీ సాయి వాళ్లూ అలాగే ఆలోచిస్తుండొచ్చు. కాబట్టి, వాళ్లతోనూ మాట్లాడండి మీ నుంచి ఏమేం ఆశిస్తున్నారో తెలుసుకోండి అయితే వాటిలో సాధ్యా సాధ్యాలు మనిషివి అప్పుడే చెప్పండి. మనకి ఇంటి బాధ్యతలు అదనం. వాటిని గుర్తు చేస్తే ఈ ఆశించడం తగ్గుతుంది అయితే ఒక్కసారి మాట్లాడి ఇబ్బందులన్నీ చెప్పడంతో సమస్య తీరుతుంది. ఎవరికి లేదు. సాధన చేయాలి. నో చెప్పాలి అదంతా నిరంతర ప్రక్రియ, అయితే ఎవరినో అనుసరించొద్దు, అనుకరించొద్దు. గంగలా మాట్లాడలేరా అయితే ఎదుటివారు చెప్పేది వినండి. మీటింగుల్లో కదిలించవ నర్లేదు..కానీ,అవసరమైన సందేహాలు అడగొచ్చు.

# 'పింక్ ఐ' అంటే ..

సాధారణంగా మేకప్ వేసుకునే కంటికి సంబంధించిన మేకప్ ఉత్పత్తుల్లోని అవశేషాలు, రసాయనాలు కంటికి అనుకూలంగా పేరుకుపోతాయి. ఇక రాత్రి పూట కూడా దాన్ని తొలగించకుండా అలాగే పడుకోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతుంది. ఇది అప్పటికప్పుడు ప్రతికూల ప్రభావం చూపకపోయినా కొన్ని రోజుల తర్వాత కళ్లలో దురద, ఎరుపెక్కడం.. వంటి కంటి ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. అంతేకాదు.. దీర్ఘకాలంలో ఇది 'పెంక్ ఐ' (కంటి చుట్టూ వాపు/ఇన్ఫెక్షన్ రావడం) సమస్యకు దారితీసే ప్రమాదమూ లేకపోలేదంటున్నారు నిపుణులు. కాబట్టి కళ్లకు మేకప్ ఎంత తక్కువగా వేసుకుంటే అంత మంచిదని చెబుతున్నారు. అలాగే పడుకునే ముందు ఐ మేకప్ తొలగించుకోవాలి.



**కళ్లలోకి వెళ్లకుండా.....** కంటికి మేకప్ వేసుకోవడానికే కాదు.. తొలగించడానికీ ప్రస్తుతం మార్కెట్లో విభిన్న సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటితో పని లేకుండా ఇంట్లోనే సులభంగా కంటి మేకప్‌ను తొలగించుకు నేందుకు బోలెడన్ని మార్గాలున్నాయి.

✦ సాధారణ మేకప్ తొలగించుకునేందుకు ఉపయోగించే కొబ్బరి నూనె కంటి మేకప్ తొలగించడానికి ఉపయోగపడుతుంది. ముందుగా కాటన్ ప్యాడ్‌పై కొన్ని చుక్కల కొబ్బరి నూనె వేసి.. దాన్ని కనురెప్పలు, కంటి చుట్టూ చర్మంపై నెమ్మదిగా రుద్దుతూ మేకప్ ను తొలగించు కోవాల్సి ఉంటుంది. ఈ కనురెప్పల వద్ద కాటన్ స్వాబ్ ఉపయోగిస్తే.. మేకప్ కంటి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తపడచ్చు.

✦ జెల్/పౌడర్/క్రీమ్ ఆధారిత మేకప్ ఉత్పత్తులను పూర్తిగా తొలగించడంలో పెట్రోలియం జెల్లీ కీలక పాత్ర ఈ కొద్దిగా జెల్లీ కంటి చుట్టూ అప్లై చేసి.. చూపుడు వేలితో గుండ్రంగా రుద్దుతూ మేకప్ తొలగించుకోవాలి. ఆపై గోరువెచ్చటి నీటిలో ముంచిన కాటన్‌తో ఆ ప్రదేశంలో తుడిచేస్తే సరిపోతుంది.

✦ కొద్దిగా బేబీ ఆయిల్‌ను కాటన్ ప్యాడ్పై వేసి.. దానితో కళ్ల చుట్టూ నెమ్మదిగా, గుండ్రంగా రుద్దుతూ కూడా మేకప్‌ను సులభంగా తొలగించవచ్చు.



✦ కనురెప్పలకు అప్లై చేసుకున్న మస్కారాను తొలగించుకునేలా మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు భావిస్తున్నారు. ఈ కాటన్ స్వాబ్‌గా కొబ్బరి నూనె/ బేబీ ఆయిల్లో ముంచి.. దానితో మస్కారా అప్లైట్లుగా చేసుకున్న కింది నుంచి పై దిశగా మేకప్ను తొలగించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా మస్కారా పూర్తిగా తొలగిపోవడంతో పాటు కంట్లోకి వెళ్లకుండా కూడా ఉంటుంది.

✦ మేకప్ బ్రష్లను శుభ్రం చేయకపోయినా కంటి సంబంధిత ఇన్ఫెక్షన్లు తప్పవంటున్నారు నిపుణులు. అందుకే వాటిని వాడిన ప్రతిసారీ బేబీ వాష్, లిక్విడ్ సోప్తో శుభ్రం చేసి.. పొడిగా ఆరబెట్టాలి. ఇక వాటి బ్రిజిల్స్ పాతబడిపోతే.. వెంటనే మార్చేయడం లేదంటే కొత్త బ్రష్లను కొనడం మంచిది.ముఖానికి పట్టించినట్లే కొందరు కంటికీ దట్టంగా మేకప్ వేస్తుంటారు. దానివల్ల కంటి సమస్యల్ని కోరికోరి కొని తెచ్చుకున్నట్లే కాబట్టి ఐ మేకప్ ఎంత సింపుల్‌గా, తక్కువగా వేసుకుంటే అందం అంతగా ఇనుమడిస్తుంది.. కంటి సమస్యలు రాకుండానూ జాగ్రత్తపడచ్చు. ఒకవేళ ఈ సమస్యలు మరీ తీవ్రమైతే మాత్రం నిపుణులను సంప్రదించడం మర్చిపోవద్దు!

# ఆకుకూరల్లో రారాణి

**ఆకుకూరల్లో బచ్చలి రారాణి అంటే అతిశయం కాదు.** పప్పులో వేసినా, పచ్చిమిర్చి జోడించి పచ్చడి చేసినా, పెరుగు పులుసు చేసినా సూపర్‌గా ఉంటుంది. ఇది రుచికే కాదు పోషకాల్లోనూ మేటి, ఇ, సి, ఐ, కె విటమిన్లు, క్యాల్షియం, ఫొలెట్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, మాంగనీస్‌లతో మంచి పోషకాహారం. బచ్చలికూర తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



ఎముకలు దృఢంగా ఉంటాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది.మధుమేహం నుంచి ఉపశమనం లభిస్తుంది. చర్మానికి కాంతి వస్తుంది. కుదుళ్లు గట్టిపడతాయి, జుట్టు రాలడం తగ్గుతుంది. ఆందోళన తగ్గుతుంది. మెదడు పనితీరు మెరుగవుతుంది. తరచుగా బచ్చలికూర తినేవారిలో కంటిచూపు బాగుంటుంది. ఇది క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తుంది. ఇందులో పీచు విస్తారంగా ఉన్నందున జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. బచ్చలికూరతో చేసే పకోడీలు, బజ్జీలు వంటివి కూడా యమా టేస్టీగా ఉంటాయి.

# కార్తీక స్నానం

శ్రీ మహావిష్ణువు జలాంతర్యామిగా కార్తీక మాసంలో శ్రీ మహా విష్ణువు చెరువులలో, దిగుడు బావులలో, పిల్ల కాలువలలోనూ నివసిస్తాడని పురాణాల ద్వారా తెలుస్తోంది. అందుకే ఈ మాసంలో వాపీ, కూప, తటాకాదులలో స్నానం చేయడం ఉత్తమం. ఈ మాసం మొత్తంలో కుదరని పక్షంలో కనీసం ఒక్కరోజైనా నదీ స్నానం చేయాలని శాస్త్రవచనం. అది కూడా వీలుకాని వారు సూర్యోదయానికి ముందే, స్నానం చేసే నీటిలో గంగ, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, నర్మద, తపతి, సింధు మొదలైన సమస్త నదీజలాలను ఆవాహన చేసుకుని స్నానం చేస్తే నదీ స్నానం చేసిన ఫలితమే దక్కుతుంది. కార్తీక స్నానం వెనుక శాస్త్రీయత మానవ శరీరం ఉష్ణ శక్తికి కేంద్రంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు ఉష్ణశక్తి ఉత్పత్తి అవుతూ, బయటకు పోతూ ఉంటుంది. శరీరంలో ప్రవహిస్తున్న ఉష్ణ శక్తిని బయటకు పంపడమే స్నానం ప్రధాన ఉద్దేశం. అలా ఎప్పటికప్పుడు ఉష్ణశక్తి బయటకు పోతేనే ఉత్సాహంగా ఉంటాం. ఈ ప్రక్రియను "ఎలక్ట్రో మాగ్నెటిక్ యాక్టివిటీ" అంటారు. అందుకే మన పూర్వీకులు ఆధ్యాత్మికం, దేవుడు, భక్తి పేరు చెప్పి కార్తీకం నెల రోజులూ బ్రహ్మ ముహూర్తంలో స్నానాలు చేయమనేవారు. ఈ నెల రోజులు ఆ చల్లదనాన్ని తట్టుకోగలిగితే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని విశ్వాసం.కార్తీక మాసం అంటే చలి పుంజుకునే సమయం. ఉష్ణోగ్రత తక్కువగా ఉండే ఈ మాసం మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జీర్ణశక్తి తగ్గుతుంది. చురుకుదనం తగ్గుతుంది. పైగా బద్ధకం పెరుగుతుంది. శరీరంలో నొప్పులు ఎక్కువవుతాయి. నరాల బలహీనత ఉన్న వాళ్లు చలికి ముడుచుకుని పడుకోవడం వల్ల ఇంకా పెరుగుతాయి. వీటన్నింటి నుంచి ఉపశమనమే కార్తీక స్నానం. ఆరోగ్య రక్షణ కోసమే పెద్దలు ఈ నెల రోజులూ ఈ నియమం పెట్టారు. కార్తీక స్నానంతో ఔషధీ తత్వం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో వేకువ జామునే నిద్రలేచి సూర్యోదయానికి ముందే స్నానం, దైవపూజ చేస్తే బద్ధకం వదిలి రోజంతా ఉత్సాహంగా ఉండడమే కాకుండా మానసికంగా కూడా ఉల్లాసంగా ఉంటుంది. నదీ స్నానం చేయాలంటే నది వరకు నడవాలి. అంటే తెల్లవారుజామున ఇది కూడా వ్యాయామమే. పైగా నదుల్లో సహజంగా ఉండే ఔషధాలే కాకుండా నదీ పరీవాహక ప్రదేశాల్లో ఉండే ఔషధాలు కూడా నీటిలో కలుస్తాయి. ఇలాంటి నీటిలో స్నానం చేయడం ఆరోగ్యప్రదం. నదులలో స్వచ్ఛమైన నీరుండే సమయం ఇదే! నవంబరు నాటికి వర్షాలు తగ్గిపోతాయి. నదుల ఉధృతి తగ్గి వాటిలోని మలినాలన్నీ అడుగుకి చేరి నిర్మలమైన నీరు ప్రవహిస్తుంది. అందుకే స్వచ్ఛంగా ఉన్న నీటిలో స్నానం చేసేందుకు కార్తీక మాసమే అనువైన సమయం.



ఆధ్యాత్మికం

# చలిలో నల్లయాలకులు ..

కొందరికి మెనోపాజ్‌లో భాగంగా చలి ఎక్కువగా అనిపిస్తుంది. అలాంటివాళ్లు నల్లయాలకులు తినండి: మంచి ఉపశమనం లభిస్తుంది అంటున్నారు నిపుణులు... రక్తప్రసరణ సవ్యంగా జరగకపోవడమే చలికి ప్రధాన కారణం. నల్లయాలకుల్లో ఉంటే ఫినోలిక్ ఆమ్లం దీన్ని సరిచేస్తుంది. శరీరం మొత్తం రక్తం ప్రవహించేందుకూ, వేడిని ఉత్పత్తి చేయడానికీ నల్లయాలకులు



ఉపయోగపడతాయి. అయితే ఘాటు ఎక్కువగా ఉండటంవల్ల వీటిని అందరూ ఇష్టపడతారు. కానీ అత్యవసర సమయాల్లో వీటిని తింటే ఫలితముంటుం దట.హారం నేరుగా తినలేనివాళ్లు టీ, ఆహారంలో చేర్చుకోవచ్చు. 'నేషనల్ ఇనిషి యల్ ఆఫ్ హెల్త్' 2015 అధ్యయనం ప్రకారం... మెటబాలిక్ సింట్రోమ్‌ను తిప్పికొట్టే డైటరీ ఫైబర్, కార్బోహైడ్రేట్లు నల్లయాలకు ఎక్కువగా ఉంటాయని నిరూపించారు. అంతేకాదు, అక్కడ ఉండే సినీయోల్, టెరిఫినైన్ జీవక్రియను నియంత్రిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడటానికి ఉపయోగపడతాయి. అధిక బరువును తగ్గిస్తాయి. వీటి సువాసన మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది.




# పాక్‌కు ఘోర ఓటమి

## దక్షిణాఫ్రికా చేతిలో 8 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌కు ఘోర ఓటమి ఎదురైంది. రెండో టెస్టులో 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడింది. పాక్ నిర్దేశించిన 72 పరుగుల లక్ష్యాన్ని ప్రొటీస్ కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ సమమైంది. రావాల్పిండి వేదికగాగురువారం జరిగిన దక్షిణాఫ్రికా సెకెండ్‌ఇన్నింగ్స్‌లో ఐడైన్ మార్‌క్రమ్ (42) టాప్ స్కోరర్‌గా నిలవగా, రికెల్టన్ 25 పరుగులతో రాణించాడు. పాక్ బౌలర్లలో నోమన్ అలీ ఒక్కడే 2 వికెట్లు సాధించాడు. అంతకు ముందుకు 94/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన పాక్‌కు సౌతాఫ్రికా స్పిన్నర్ హార్మర్ చుక్కలు చూపించాడు. అతడు స్పిన్ ఉచ్చులో చిక్కుకున్న పాక్ సెకండ్ ఇన్నింగ్స్‌లోకేవలం 138 పరుగులకే కుప్పకూలింది. 44 పరుగులు వ్యవధిలో ఆతిథ్య జట్టు ఏకంగా 6 వికెట్లు కోల్పోయింది. దీంతో సఫారీలు ముందు పాక్ జట్టు కేవలం 72 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో హార్మర్ 6 వికెట్లు, మహారాజ్ 2, రబాడ ఒక్క వికెట్ పడగొట్టారు. పాక్ బ్యాటర్లలో బాబర్ అజం (50) టాప్ స్కోరర్ కాగా, మిగిలిన వారంతా దారుణంగా విఫలమయ్యారు.కాగా తొలిఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 404పరుగుల భారీస్కోర్ సాధించింది. టెయిలాండర్ బ్యాటర్లు సెనురన్ ముత్తుస్వామి (155 బంతుల్లో 89 నాటౌట్) అజేయ అర్థ శతకం చేయగా, కగిసో రబడ (61 బంతుల్లో 71) అదరగొట్టాడు. పాక్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులు చేసింది.

ఆట



వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో విశ్వజిత్‌కు

# రెండో కాంస్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లలో విశ్వజిత్ మోర్ వరుసగా రెండో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. సెర్బియాలో జరిగిన అండర్ 23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో విశ్వజిత్ మోర్ తన 55 కిలోల కాంస్య పతకంతో భారతదేశం యొక్క మొట్టమొదటి మరియు ఏకైక గ్రీకోరోమన్ పతకాన్ని సాధించాడు. కాంస్య పతక పోరులో ప్రస్తుత ఆసియా అండర్ 23 ఛాంపియన్, కజకిస్తాన్‌కు చెందిన యెరాస్సిల్ మామిర్బె కోవ్‌ను 5-4 తేడాతో ఓడించాడు. గత ఏడాది అల్బేనియాలో కాంస్య పతకం సాధించిన తర్వాత అండర్ 23 వరల్డ్స్‌లో విశ్వేజిత్ వరుసగా రెండో పతకం సాధించాడు. అక్కడ భారత్ తరపున గ్రీకోరోమన్ పతక విజేతగా నిలిచాడు. ఈ ఏడాది తన తొలి అంతర్జాతీయ బౌట్ ఆడుతున్న విశ్వజిత్, సీనియర్ ప్రపంచ పతక విజేత, రొమేనియాకు చెందిన డెనిస్ మిహైతో జరిగిన మొదటి రౌండ్‌లో కఠినమైన ఆటను ఎదుర్కొన్నా ఆ బౌట్‌ను 6-2 తేడాతో గెలిచి ఉత్కంఠభరితమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, రష్యాకు చెందిన అలీబెక్ అమిరోవ్ చేతిలో తన సెమీఫైనల్ బౌట్‌ను ఓడిపోయినా పతక పోటీలో తన స్థానాన్ని నిర్ధారించుకున్నాడు. 60 కిలోల విభాగంలో కునాల్ తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన మెల్కాము ఫెటేనే చేతిలో ఓడిపోవడంతో, గ్రీకోరోమన్‌లో భారత్ తరపున పతకం సాధించిన ఏకైక వ్యక్తిగా విశ్వజిత్ నిలిచాడు. ఇక మహిళల విభాగంలో హన్నీ కుమారి (50 కిలోలు), దీక్షా మాలిక్ (72 కిలోలు) వరుసగా బెలారసియన్, చైనా ప్రత్యర్థులపై జరిగిన 16వ రౌండ్‌లో ఓటమితో నిష్క్రమించారు. ప్రియా మాలిక్ (76 కిలోలు) అమెరికాకు చెందిన కైలీ వెల్కర్ చేతిలో 16వ రౌండ్ బౌట్‌లో ఓడిపోయినప్పటికీ, కైలీ ఫైనల్‌కు చేరుకోవడంతో ఆమెకు రెపిచేజ్ ద్వారా రెండవ అవకాశం లభించనుంది.



# టి20 సిరీస్ ఇంగ్లండ్‌దే

## న్యూజిలాండ్‌కు వర్షం దెబ్బ

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇంగ్లండ్ కైవసం చేసుకుంది. ఆక్లాండ్ వేదికగా గురువారం జరగాల్సిన మూడో మ్యాచ్ మధ్యలో వర్షం కారణంగా రద్దైంది. మూడో టీ20 3.4 ఓవర్ల పాటు సాగింది. టాస్ ఓడి ఇంగ్లండ్ అహ్వానం మేరకు బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ వర్షం ప్రారంభమయ్యే సమయానికి 1 వికెట్ నష్టానికి 38 పరుగులు చేసింది. టిమ్ రాబిన్సన్ (2) ఔట్ కాగా, టిమ్ సిఫర్ట్ (23), రచిన్ రవీంద్ర (10) క్రీజులో ఉన్నారు. తదుపరి వర్షం పెరగడంతో ఆటను రద్దు చేస్తూ రిఫరీ నిర్ణయం తీసుకున్నాడు. అంతకు ముందుకు క్రైస్టచర్స్‌లో జరగాల్సిన తొలి టీ20 కూడా వర్షం కారణంగా ఫలితం తేలకుండా ముగిసింది. మధ్యలో రెండో టీ20లో 65 పరుగుల తేడాతో గెలవడంతో 1-0తో సిరీస్ ఇంగ్లండ్ వశమైంది. ఆ మ్యాచ్‌లో విధ్వంసం సృష్టించిన హ్యారీ బ్రూక్ 35 బంతుల్లో 78 పరుగులు సాధించాడు.

# డబ్ల్యుపిఎల్ మెగా వేలం

## ఐదుగురిని మాత్రమే రిటైన్.. లాస్ట్ డేట్ వచ్చే నెల 5

## ఫ్రాంచైజీ పర్స్ వాల్యూ రూ.15 కోట్లు

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) విజయవంతంగా మూడు సీజన్లు పూర్తి చేసుకుంది. ఇప్పుడు నాలుగో సీజన్‌కు సిద్ధమవుతోంది. డబ్ల్యూపీఎల్-2026 సీజన్ కన్నా ముందు మెగా వేలాన్ని నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. వేలం తేదీని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధికారికంగా ప్రకటించనప్పటికి నవంబర్ 26 లేదా 27 తేదీల్లో ఢిల్లీ వేదికగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఫ్రాంఛైజీలు ఎంత మంది ప్లేయర్లు అట్టిపెట్టుకోవాలి? రైటు టు మ్యాచ్? వంటి నిబంధనలు గురించి ఇప్పటికే ఫ్రాంఛైజీలకు బీసీసీఐ సమాచారం ఇచ్చింది. ఈ నిబంధనల ప్రకారం ఒక్కో ఫ్రాంఛైజీ గరిష్టంగా ఐదుగురిని మాత్రమే రిటైన్ చేసుకోవచ్చు. ఇందులో ముగ్గురు భారత ప్లేయర్లు, ఇద్దరు విదేశీ ఆటగాళ్లను అట్టిపెట్టుకునేందుకు అనుమతి ఉంది. ఫ్రాంఛైజీలు అట్టి పెట్టుకునే ప్లేయర్లలో తొలి ప్లేయర్‌కు రూ.3.5 కోట్లు, రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75 కోట్లు, నాలుగో ప్లేయర్‌కు కోటీ, ఐదో ప్లేయర్‌కు రూ.50లక్షలు గా నిర్ణయిం చారు. ఇక వేలంలో ఫ్రాంఛైజీ పర్స్ వాల్యూను రూ.15 కోట్లుగా నిర్ణయిం చారు. ఐదుగురిని రిటైన్ చేసుకుంటే పర్స్ వాల్యూ నుంచి 9.75 కోట్లు కట్ అవుతుంది. ఒక్కో ఫ్రాంఛైజీ గరిష్టంగా 18 మందిని తీసుకోవచ్చు. మొత్తం ఐదు ఫ్రాంఛైజీలు 90 మంది ప్లేయర్లు కలిగి ఉండనున్నాయి. ఇక ఫ్రాంఛైజీలు అన్ని తాము అట్టి పెట్టుకునే ప్లేయర్ల జాబితాను నవంబర్ 5లోపు బీసీసీఐకి సమర్పించాల్సి ఉంటుంది. బీసీసీఐ ఐదు రైట్‌టు మ్యాచ్ (ఆర్‌టీఎమ్) ఎంపికలను ఆమో దించింది. కానీ ఒక ఫ్రాంఛైజీకి అందుబాటులో ఉన్న ఆర్‌టీఎమ్‌ల సంఖ్య అనేది నిలుపుకున్న ఆటగాళ్ల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. అట్టిపెట్టుకున్న ప్రతి ఆటగాడికి, ఫ్రాంఛైజీ ఒక ఆర్‌టీఎమ్ ఎంపికను కోల్పోతుంది. ఒక జట్టు ఐదుగురు ఆటగాళ్లను నిలుపుకుంటే వేలంలో ఆర్‌టీఎంను ఉపయోగించుకునే అవకాశం ఉండదు. మరోవైపు ఎటువంటి రిటెన్షన్లు లేకుండా వేలంలోకి వెళ్లే జట్టు ఐదు ఆర్‌టీఎమ్‌లను ఉపయోగించుకోవచ్చు.



# రెండో వన్డేలోనూ భారత్‌కు ఘోర పరాజయం

## 2-0తో సిరీస్ ఆస్ట్రేలియా కైవసం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. అడిలైడ్ వేదికగా జరిగిన రెండో వన్డేలోనూ టీమ్‌ఇండియా ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ 2 వికెట్ల తేడాతో నెగ్గింది. 265 పరుగులలక్ష్యాన్ని ఆసీస్ 8వికెట్లు కోల్పోయి ఛేదించింది. కూపర్‌కొనోలీ (61 పరుగులు), మ్యా థ్యూ షార్ట్ (74 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో మిచెల్ ఓవెన్ (36 పరుగులు)





మెరుపులు మెరిపించాడు. దీంతో ఆస్ట్రేలియా 46.3 ఓవర్లలోనే టార్గెట్ అందుకుంది. భారత్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా, వాషింగ్టన్ సుందర్ తలో 2 వికెట్లు, అక్షర్ పటేల్, సిరాజ్ చెరో ఒక వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. ఓపెనర్ రోహిత్ శర్మ (73) అర్ధ శతకంతో రాణించగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (9) విఫలమయ్యాడు. విరాట్ కోహ్లి మరోసారి డకౌట్ అయ్యి తీవ్ర నిరాశ పర్చాడు. దీంతో భారత్ 17 రన్స్‌కే 2 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రోహిత్, శ్రేయస్ అయ్యర్ (61) హాఫ్ సెంచరీలతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. మూడో వికెట్‌కు 118 పరుగులు జోడించి జట్టును మంచి స్థితిలో నిలిపారు. తర్వాత రోహిత్‌ను స్టార్క్ ఔట్ చేయగా, శ్రేయస్‌ను జంపా పెవిలియన్‌కు పంపాడు. అక్షర్ పటేల్ (44)ఆకట్టుకోగా, కేఎల్‌రాహుల్ (11),వాషింగ్టన్ సుందర్(12), నితీశ్ (8) విఫలమయ్యారు. చివర్లో పేస్ బౌలర్ హర్షిత్ రానా (24), అర్షదీప్ సింగ్ (13) తొమ్మిదో వికెట్‌కు 37 రన్స్ జోడించారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా 4, జెవియర్ బార్ట్‌లెట్ 3, మిచెల్ స్టార్క్ 2 వికెట్లు పడగొట్టారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో దక్కించుకుంది. గత ఆదివారం పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నెగ్గిన ఆసీస్, తాజాగా అడిలైడ్ లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఇక చివరిదైన నామమాత్రపు వన్డే ఈ నెల 25న జరగనుంది.

# సెన్సెక్స్, నిఫ్టీలకు ఐటి రంగాల మద్దతు

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి, అక్టోబరు 23:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల్లోనే ముగిసాయి. ప్రధానంగా ఐటి షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు గురువారం కూడా లాభాలతో ముగిశాయి. అయితే, ట్రేడింగ్ చివరి గంటల్లో లాభాల స్వీకరణ జరగడంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి కిందకు జారాయి. ట్రేడింగ్ సమయంలో బిఎస్‌ఇ సెన్సెక్స్ 864 పాయింట్ల వరకు లాభపడి 85,290 వద్ద కొత్త 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. కానీ చివరికి 130 పాయింట్ల స్వల్ప లాభంతో 84,556 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 26,104 స్థాయికి చేరినప్పటికీ, చివరకు కేవలం 23 పాయింట్ల లాభంతో 25,891 వద్ద ఫ్లాట్‌గా స్థిరపడింది. ఉదయం వచ్చిన లాభాలను నిఫ్టీ పూర్తిగా కోల్పోయిందని విశ్లేషకులు తెలిపారు. ఐటి రంగ షేర్లు ఈ ర్యాలీని ముందుండి నడిపించాయి. ఇన్ఫోసిస్ ప్రమోటర్లు రూ.18,000 కోట్ల షేర్ల బైబ్యాక్‌లో పాల్గొనబోమని ప్రకటించడంతో ఆ సంస్థ షేరు ఏకంగా 4 శాతం పెరిగింది. దీనికి తోడు, భారత్, అమెరికా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న వార్తల నేపథ్యంలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టిసిఎస్ షేర్లు కూడా రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. బిఎస్‌ఇ ఐటి ఇండెక్స్ 2.2 శాతం పెరిగింది. ఇతర లాభపడిన షేర్లలో యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ ఒక శాతానికి పైగా వృద్ధి చెందాయి. మరోవైపు, ఎటర్నల్ 3 శాతంతో టాప్ లూజర్‌గా నిలవగా, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసిఐసిఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు 1 నుంచి 2 శాతం మధ్య నష్టపోయాయి. మిడ్‌స్మాల్‌క్యాప్ మార్కెట్‌లో సెంటిమెంట్ బలహీనంగానే ఉంది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం చొప్పున క్షీణించాయి. ఇదే సమయంలో, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న ఆశలతో రూపాయి బలపడింది. డాలర్‌తో పోలిస్తే 19 పైసలు లాభపడి 87.82 వద్ద స్థిరపడింది.



## గ్యాడ్జెట్

# నలుగురికి మించకుండా నామినీలు

## బ్యాంకు లావాదేవీల్లో సడలింపులు తెచ్చిన కేంద్ర ఆర్థికశాఖ




**ముంబయి, అక్టోబరు 23:** బ్యాంకు ఖాతాదారులకు కేంద్రంఊరటనిచ్చింది. డిపాజిట్ ఖాతాలు, సేఫ్టీ లాకర్లకు సంబంధించిన నామినేషన్ సౌకర్యాలలో కీలక మార్పులు తీసుకువచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం, ఖాతాదారులు ఇకపై ఒకరికి బదులుగా గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా నియమించుకోవచ్చు. ఈ కొత్త విధానం నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం 2025లో భాగంగా ఈ కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టారు.

దీని ప్రకారం బ్యాంకు డిపాజిట్లకు నామినీలను రెండు విధాలుగా నియమించుకునే అవకాశం కల్పించారు. ఖాతాదారులు తమకు నచ్చిన విధంగా నలుగురు నామినీలకు ఒకేసారి లేదా ఒకరి తర్వాత మరొకరికి ప్రయోజనం అందేలా ఎంచుకోవచ్చు. అయితే, బ్యాంకుల్లోని సేఫ్ కస్టడీ వస్తువులకు, సేఫ్టీ లాకర్లకు మాత్రం ఒకరి తర్వాత మరొకరు అనే పద్ధతిలోనే నామినేషన్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. ఈ కొత్త విధానంలో మరో ముఖ్యమైన సౌలభ్యం కూడా ఉంది. నలుగురు నామినీలను ఎంచుకున్నప్పుడు, ఎవరికి ఎంత వాటా (శాతం) చెందాలో కూడా ఖాతాదారులే ముందుగా నిర్దేశించవచ్చు. అయితే, మొత్తం వాటాలన్నీ కలిపి 100 శాతానికి సమానంగా ఉండాలి. ఈ నిర్ణయంవల్ల భవిష్యత్తులో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు చాలా సులభంగా, పారదర్శకంగా పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటం, కస్టమర్లకు సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టంలోని సెక్షన్లు 10,11, 12, 13.. నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం నోటిఫైచేసింది. ఈనిబంధనలను అన్ని బ్యాంకుల్లో ఒకే విధంగా అమలు చేయడానికి అవసరమైన బ్యాంకింగ్ కంపెనీల (నామినేషన్) నిబంధనలు 2025ను, సంబంధిత ఫారాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# టాటా ట్రస్టుల్లోకి మెహ్లీ మిస్త్రీ!

**ముంబయి, అక్టోబరు 23:** టాటాట్రస్ట్‌ల్లో కొనసా గుతున్న అంతర్గత వివాదాలకు చెక్‌పెడుతూ టాటాట్రస్ట్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నది. ఇప్పటివరకూ వివాదాస్పదంగా మారిన ట్రస్టీల నియామకంలో మెహ్లి మిస్త్రీని లైఫ్‌టైమ్ ట్రస్టీగా నియమించేందుకు ట్రస్ట్‌బోర్డు నిర్ణయించింది. మిస్త్రీ పదవీకాలం మూడురోజులకు ముగుస్తుం దనగా ట్రస్ట్ బోర్డుఈనిర్ణయం తీసుకుందని అంచనా. సర్ దొరాబ్జీ టాటాట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌ల్లో ఆయన జీవితకాలపు సభ్యునిగా ఉంటారు. ఈ రెండుసంస్థలకే టాటాసన్స్‌లో మెజార్టీ వాటాలున్నాయి. రతన్‌టాటా కన్ను మూసిన తర్వాత టాటాసన్స్‌లో విభేదాలు చెలరేగుతూనే ఉన్నాయి. నోయెల్ టాటా ఛైర్మన్‌గా వచ్చిన తర్వాత ట్రస్టుబోర్డుల్లో మెహ్లీమిస్త్రీ నియామకంతోనే ప్రారంభం అయ్యాయి. నోయెల్ నిర్ణయాలను తరచూ వ్యతిరేకిస్తూ వస్తున్నందున ట్రస్టుల బోర్డుల్లో మిస్త్రీని తప్పించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే అనూహ్యరీతిలో మెహ్లీమిస్త్రీని మళ్లీ ట్రస్టుబోర్డు శాశ్వత సభ్యునిగా నియమించే కీలకనిర్ణయం తీసుకోవడం చర్చకు తావిచ్చింది. షాపూర్‌జీ పల్లోంజీ కుటుంబానికి చెందిన మిస్త్రీ 18శాతం వాటా కలిగి ఉన్నారు. ఇటీవలే వేణు శ్రీనివాసన్‌ను టాటాట్రస్టుల్లో జీవితకాలపు సభ్యునిగా నియమించిన వెనువెంటనే మిస్త్రీపేరుకూడా తెరపైకి రావడం గమనార్హం.

# దేశంలోనే అత్యధిక అప్పుల్లో 'తెలుగు' కుటుంబాలు




**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** దేశంలోనే అత్యధికంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు అప్పుల భారంతో సతమతమవుతు న్నారు. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన ఒక సర్వేలో ఈసమాచారం వెలుగుచూసింది. 2020-21 గణాంకాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, అప్పుల్లో కూరుకుపోయిన జనాభా విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ రెండోస్థానాన్ని ఆక్రమించింది. ఈ సర్వే ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 43.7 శాతం మంది ప్రజలు అప్పులతో జీవిస్తున్నారు. ఇక తెలంగాణలో ఈ సంఖ్య 37.2 శాతంగా నమోదైంది. ఈ రెండు రాష్ట్రాలు దేశంలోనే తొలి రెండు స్థానాల్లోఉండటం తీవ్రఆందోళన కలిగిస్తోంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆర్థిక సమ్మిళితంలో ఎపి దేశంలోనే రెండో స్థానంలో ఉంది.

రాష్ట్రంలో 15 యేళ్లు పైబడిన వారిలో 92.3 శాతం మంది బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నారు. కర్ణాటక (95.9శాతం) మాత్రమే ఎపి కన్నా ముందుంది. అయితే, కర్ణాటకలో కేవలం 23.2 శాతం మందే అప్పులపాలు కావడంగమనార్హం. మరోవైపు, తెలంగాణలో బ్యాంకింగ్ సేవలవిస్తరణ ఇంకా మెరుగుప డాల్సి ఉందని ఈసర్వే స్పష్టంచేసింది. ఇక్కడ 86.5 శాతం మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉండగా, ఈ విషయంలో పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ 14వ స్థానంలో నిలిచింది. ప్రాంతాల వారీగా చూస్తే, దక్షిణాది రాష్ట్రాల్లో సగటున 31.8 శాతం మంది అప్పుల్లో ఉండగా, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ సంఖ్య కేవలం 7.4 శాతంగానే ఉంది. అక్కడ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ 80.2 శాతంగా నమోదైంది.

# పసిడి నిల్వలు భారీగా పెంచుకుంటున్న ఆర్బీఐ



**ముంబయి, అక్టోబరు 23:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ తన పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం కొనుగోళ్లను వేగవంతం చేసింది. ఫలితంగా, ఆర్బీఐ వద్ద ఉన్న బంగారం నిల్వలు 880 మెట్రిక్ టన్నుల మైలురాయిని దాటాయి. ఆర్బీఐ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో అంటే సెప్టెంబర్ చివరి నాటికి 0.6 టన్నుల సుమారు 600 కిలోలు బంగారాన్ని కొనుగోలు చేసింది. ఇందులో జూన్ నెలలో 0.4 టన్నులు, సెప్టెంబర్ నెలలో 0.2 టన్నులు అంటే 200 కిలోలు సమీకరించింది. దీంతో సెప్టెంబర్ చివరినాటికి ఆర్బీఐ మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. ఈ నిల్వల మొత్తం విలువ 95 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉందని ఆర్బీఐ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ అనిశ్చితులు పెరిగిపోవడమే బంగారం కొనుగోళ్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయాల్లో బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా సెంట్రల్ బ్యాంకులతో పాటు సాధారణ పెట్టుబడిదారులు కూడా భావిస్తారు. ఈ డిమాండ్ కారణంగానే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయని ఆర్బీఐ తన బులెటిన్‌లో పేర్కొంది. ముఖ్యంగా సెప్టెంబర్‌లో పసిడి ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకాయి. కేవలం ఆర్బీఐ మాత్రమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు కలిసి సుమారు 166 టన్నుల బంగారాన్ని తమ అధికారిక నిల్వలకు జోడించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ మొత్తం 54.13 మెట్రిక్ టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

# పసిడి, వెండి ధరల్లో తగ్గని దూకుడు

## తులం బంగారం రూ.1.28 లక్షలు పైమాటే



**ముంబయి, అక్టోబరు 23:** బులియన్ మార్కెట్‌లో ధోరణులు రోజురోజుకూ మారుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ బ్యాంకుల మానిటరీ పాలసీ నిర్ణయాలు, డాలరుతో రూపాయి మారకం విలువలు, ముఖ్యంగా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలు వంటివి బులియన్ మార్కెట్‌పై తీవ్రస్థాయి ప్రభావం చూపిస్తున్నాయి. గత కొన్నిరోజులుగా రాకెట్ వేగంతో దూసుకుపోయిన బంగారం, వెండి ధరలు అంతే వేగంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత వారం ఆల్‌టైమ్ హైరికార్డులతో పరుగులు పెట్టిన రేట్లుఅదే తీరులో కొనసాగు తున్నాయి. నేడు వరుసగా రెండో రోజుకూడా బంగారం ధరలు పెరిగాయి. మార్కెట్ వర్గాల ప్రకారం గురువారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24క్యారెట్ల స్వచ్ఛమైన 10గ్రాముల బంగారం ధర రూ.1,28, 300కి చేరింది. అంటే ముందురోజుతో పోలిస్తే పదిగ్రాములు పసిడిధరలు రూ.2600పైగానే పెరిగింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,15,390గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,26,030గా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,14,650గా ఉంది. అటు వెండి ధరలుకూడా కిలోకుసుమారు మూడువేలకుపైగా పెరిగింది. గురువారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కిలోవెండి రూ.1,59,500గా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.